ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కర్నూలు

: fb.com/vaartha Digital

Published from Kurnool, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-7-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 152 పేజీలు: 10+4 వెల: 6.50


బంగ్లా మాజీ అధ్యక్షురాలు హసీనాకు జైలు శిక్ష

వర్జిన్ ఎయిర్‌లైన్స్ విమానంలో పాము

5లో

# నా కష్టం పేదల కోసమే

## ఇంటికి పెద్ద కొడుకుగా సేవలు అందిస్తున్నా

## నాది అభివృద్ధి, సంక్షేమ యజ్ఞం

### కుప్పం ఎయిర్‌పోర్టుకు భూమిలిచ్చేవారికి పూర్తి న్యాయం చేస్తాం

### రూ. 1207 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన సిఎం చంద్రబాబు



బుధవారం కుప్పంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**కుప్పం, జూలై 2 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తానని ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రిగా తాను కష్టపడేది పేదల కోసమేనని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రెండురోజుల కుప్పం పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం తులసినాయనపల్లి వద్ద బుధవారం నిర్వహించిన ప్రజావేదిక బహిరంగ సభలో సిఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో ప్రజలకు సంక్షేమం ఇస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం అభివృద్ధి కంటే సంక్షేమం స్పీడ్ అందుకుందని పేర్కొన్నారు. వైఎస్సార్సీ ప్రభుత్వం కంటే డబుల్ సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నామన్నారు.

అప్పులతో సంక్షేమం శాశ్వతం కాదన్నారు. ఇంటికి పెద్ద కొడుకుగా తాను రాష్ట్ర ప్రజలకు సేవలు అందిస్తున్నానన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నా దిగమింగి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను గతేడాది జూన్ నెలలో ఎన్నికల్లో గెలిస్తే ఏప్రిల్ నెలనుంచే పెన్షన్లు అందించానని గుర్తు చేశారు. దేశంలో మరెక్కడైనా నాలుగువేలు పెన్షన్ అందిస్తున్నారా? అని ప్రశ్నించారు. దివ్యాంగులకు 6వేలు, కిడ్నీబాధితులకు 10వేలు, మంచానికి పరిమితమైన వారికి 15వేల వంతున జీతంలా వారికి పెన్షన్ అందిస్తున్నామన్నారు. 12రెట్లు పెంచి పింఛన్ ఇస్తోంది ఎన్డీయే కూటమి ప్రభుత్వమేనన్నారు. తనకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఏనాయకుడు తమకు అండగా ఉంటారో ఎవరినుంచి వారి జీవితాల్లో వెలుగులు వస్తాయో ఆలోచించాలని సూచించారు. తనది అభివృద్ధి, సంక్షేమ యజ్ఞం అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాల కోసం >>2



## బ్రిక్స్ దేశాల మధ్య సంబంధాలు పటిష్టం

### రియో డి జనీరోలో వివిధ దేశాలతో భేటీ కానున్న ప్రధాని

### ఘనాలో మోడీకి ఘనస్వాగతం

**ఆక్రా(ఘనా),జులై 2:** ఐదుదేశాలపర్యటనలోభాగంగా బుధవారం ఆఫ్రికా దేశం ఘనా రాజధాని ఆక్రాకు చేరుకున్న ప్రధాని నరేంద్రమోడీకి ఘనస్వాగతం లభించింది. అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయంలో అధ్యక్షుడు జాన్ డ్రమాని మహామా మోడీకి సాదర స్వాగతం పలికి తన మంత్రివర్గ సహచరులను పరిచయంచేసారు. అనంతరం సాయుధదళాల గౌరవ వందనం స్వీకరించారు. అధ్యక్ష భవనంలో ఘనా అధ్యక్షుడు మహామాతో ద్వైపాక్షిక భేటీ జరిపారు. భారత్ శాంతియుతమైన బహుళ ధృక్కోణాల అభివృద్ధి ప్రపంచాన్ని కోరుకుంటోందని ప్రధానిమోడీ పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యానికి కట్టుబడి భారత్ పనిచేస్తుందన్నారు. బ్రిక్స్‌లో ఒక వ్యవస్థాపక దేశం హోదాలో ఆ కూటమి బలోపేతానికి అన్ని రకాల చర్యలను చేపడతామని మోదీ వెల్లడించారు.

ఈ సదస్సు సందర్భంగా రియో డీ జనీరోలో తాను వివిధ దేశాల ప్రభుత్వాధినేతలతో భేటీ అయి, ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తానన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులాడిసిల్వతో జరిగే సమావేశంలో గ్లోబల్ సౌత్ దేశాల బలోపేతంపై ముఖ్య చర్చ జరుగుతుందన్నారు. ఐదు దేశాల పర్యటన కోసం ప్రధాని నరేంద్రమోడీ బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరారు.



బుధవారం ఉపాధ్యాయురాలు కల్యాణి కుమారిని సత్కరిస్తున్న మంత్రి లోకేష్

# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయండి

### ఉపాధ్యాయులను కోరిన మంత్రి లోకేష్

### ఇక విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టి పెడతాం

### 'షైనింగ్ టీచర్'ను ఘనంగా సత్కరించిన మంత్రి

**విజయవాడ, జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ విద్య బలోపేతం చేసే పవిత్ర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక ఆశయంతో పనిచేస్తున్నామన్నారు. ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృషిసారిస్తామన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం మారుమూల గిరిజన గ్రామం జెఎం తండాలోని ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో వృత్తిపట్ల అంకితభావం చూపి అద్భుత ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయురాలు ఎం.కల్యాణి కుమారిని కుటుంబంతో సహా ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మంత్రి నారా లోకేష్ "షైనింగ్ టీచర్' పేరుతో ఘనంగా సత్కరించారు.

**విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారు**

2017లో జెఎం తండా మండల పరిషత్ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలకు బదలీ అయిన ఉపాధ్యాయురాలు కల్యాణి తన అంకితభావంతో పాఠశాల రూపురేఖలు మార్చి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులందరికీ ఆమె ఆదర్శంగా నిలిచారు. తాను బాధ్యతలు చేపట్టేనాటికి పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కేవలం 14 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అందులో ఇద్దరు మాత్రమే క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేవారు. ఒకానొక దశలో పాఠశాలను మూసివేయాలని భావించారు. ఉపాధ్యాయురాలిగా ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత సొంత నిధులతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు పాఠశాలలో మౌలికసదుపాయాల కల్పనకు కృషిచేశారు. తన పనితీరుతో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించారు. దీంతో 2020-21 విద్యాసంవత్సరానికి విద్యార్థుల సంఖ్య 53కి పెరిగింది.

విద్యార్థిగా మారిన విద్యాశాఖ మంత్రి 'షైనింగ్ టీచర్'తో సమావేశం సందర్భంగా విద్యార్థిగా మారిన విద్యశాఖ మంత్రి లోకేష్.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉపాధ్యాయురాలి నుంచి ఎంతో హుందాగా సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు కల్యాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కూడా మంచి విద్య లభిస్తుందనే నమ్మకం తల్లిదండ్రుల్లో కల్పించాలి. స్టార్ ఆఫ్ ది వీక్ పేరుతో ప్రతి సోమవారం హోం వర్క్, హాజరు, క్రమశిక్షణ, ప్రేయర్, హ్యాండ్ రైటింగ్, వ్యక్తిగత >>2

# సిఆర్‌డిఏ రీజియన్‌లో తాజా భూసేకరణ

### లాండ్ పూలింగ్ స్కీంకు నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ, జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి మినహా మిగిలిన రాజధాని ప్రాంతంలో భూసమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రాజధాని ప్రాంత ల్యాండ్ పూలింగ్ స్కీం2025 రూల్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రజా రాజధాని నిర్మాణానికి అవసరమైన ప్రాజెక్టులు ఎయిర్‌పోర్టులు, పోర్టులు, ఇతర వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద భూసేకరణ యంత్రాంగం అవసరమని సీఆర్‌డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. భూ యజమానులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మధ్య పరస్పర సమన్వయంతో భూసమీకరణ పథకం చేపట్టాలని నిర్ణయించారు. రైతులు లేదా రైతుల బృందం నుంచి భూమిని సమీకరించి అభివృద్ధి చేసేందుకు నిబంధనలు నిర్దేశిస్తూ రాజధాని ప్రాంత భూసమీకరణ పథకం(సూత్రీకరణ,అమలు)రూల్స్,2025ను రూపొందించారు. ఈ నిబంధనలు రాజధాని నగరం మినహా మిగిలిన రాజధాని ప్రాంతంలో ప్రాజెక్టులకు భూమి సమీకరించేందుకు వినియోగిస్తారు. ఆ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రాజధాని ప్రాంత ల్యాండ్ పూలింగ్ స్కీం2025 రూల్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రజా రాజధాని నిర్మాణానికి అవసరమైన ప్రాజెక్టులు ఎయిర్‌పోర్టులు, పోర్టులు, ఇతర వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద భూసేకరణ యంత్రాంగం అవసరమని సీఆర్‌డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. భూ యజమానులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మధ్య పరస్పర సమన్వయంతో భూసమీకరణ పథకం చేపట్టాలని నిర్ణయించారు. రైతులు లేదా రైతులబృందంనుంచి భూమిని సమీకరించి అభివృద్ధి చేసేందుకు నిబంధనలు నిర్దేశిస్తూ రాజధాని ప్రాంత >>2

# రైతు సంక్షేమానికే పెద్దపీట

### తాటిపూడి నీటిని మళ్లించే ఆలోచన లేదు: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



బుధవారం తాటిపూడి జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్

**విజయనగరం, జులై 2 (ప్రభాతవార్త ప్రతినిధి) ;** రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లాలోని గంట్యాడ మండలం బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం నుంచి సాగునీటిని మంత్రి శ్రీనివాస్ బుధవారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో, పంటలు బాగా పండాయని, రైతులు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది కూడా అదే అనుకూల పరిస్థితి నెలకొంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు ఎంతో కష్టపడి చెరువులను తవ్వించి వాటిని తాటిపూడి జలాశయానికి అనుసంధానం చేశారని, దానివల్ల పంటలు బాగా పండేవని వివరించారు. ప్రస్తుతం ఎక్కడైనా నీటికి ఇబ్బంది ఏర్పడినా, చెరువులు దెబ్బతిన్నా, వాటిని పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు చేస్తే, మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి ప్రయోజనం కలిగించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మంచి పంటలను పండించి సమాజానికి అందించాలని కోరారు. ఎంఎస్ఎంఈ పార్కు నీటి సరఫరాకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే జిఒ వచ్చిందని, అయినప్పటికీ కొంతమంది రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

తాటిపూడి నీటిని విశాఖపట్నం తాగునీటి అవసరాలకు, ఆయకట్టు రైతులకు మాత్రమే వినియోగిస్తామని, దారి మళ్ళించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎంవి రమణ, తాహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపిడిఒ రమణమూర్తి, డిఈలు రామునాయుడు, శ్రీచరణ్, తాటిపూడి ఆయుకట్టు దారుల సంఘం అధ్యక్షులు కె.జగన్నాథరావు, కూటమి నాయకులు కొండపల్లి కొండలరావు, భాస్కరనాయుడు, రొంగలి కృష్ణ, ఇతర ఆయుకట్టు సంఘాల నాయకులు, డైరెక్టర్లు తదితరులు కూడా పాల్గొన్నారు.



## ఐపిఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా

### భారత్ పోలీసు సేవకు గుడ్‌బై

**విజయవాడ జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఐపిఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా చేసారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు ఇచ్చిన సమాచారంలో తాను భారత్ పోలీసు సేవలకు స్వచ్ఛందంగా రాజీనామా చేశానన్నారు. ఇది పూర్తిగా వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక ఆలోచన తర్వాత తీసుకున్న నిర్ణయమని వివరించారు., నా జీవన లక్ష్యాలు, కుటుంబ సభ్యుల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఒక స్పష్టమైన నిర్ణయంగా ఇది చెప్పవచ్చు. ఇటీవల కొన్ని వర్గాలు నా రాజీనామాకు కారణంగా ఒత్తిళ్లు, వేధింపులు ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అటువంటి ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అపోహలకు గురిచేసే విధంగా ఉన్నాయని నేను స్పష్టంగా తెలియజేస్తున్నాను అన్నారు. తన రాజీనామా లేఖను డిజిపికి పంపినట్లు ఆయన తెలిపారు. తాను ఐఐఎం విద్యార్థినని.. ఈ నేపథ్యంలో తనకు మంచి ఆఫర్ రావడంతో ఈ ఐపిఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సిద్ధార్థ్ కౌశల్ వివరణ ఇచ్చారు. తాను ఒత్తిళ్ల కారణంగా ఈ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు వస్తున్న వార్తల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. తన రాజీనామా స్వచ్ఛందంగా స్వతంత్రంగా, ఎటువంటి బల >>2

# మెడికల్ కాలేజీలపై నిఘా

### ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ క్రియాశీలకంగా వ్యవహరించాలి: వర్సిటీ సంస్కరణకోసం కమిటీ: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జులై2, ప్రభాతవార్తప్రతినిధి:** రోగ నియంత్రణాంశాలు,నివారణలేని వ్యాధులను ఎలా అదృశ్యం చేయాలనే దిశలో ఏపీ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీలో పరిశోధనలు జరగాలని మంత్రి సత్యకుమార్ యాదవ్‌వ్యాఖ్యానించారు. నూతనమై వైద్య విధానాలు, వ్యాధి నివారణ, నియంత్రణంశాలపై నూతనంగా వచ్చే మెడికల్ గ్రాడ్యుయేట్స్ సమర్థమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. 39 ఏళ్ల చరిత్ర కలిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ పనితీరును వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ రెండు గంటలకు పైగా బుధవారం విశ్వవిద్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సమగ్రంగా సమీక్షించారు. 1986లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పట్నించీ వైద్యారోగ్య శాఖా మంత్రి స్థాయిలో సమీక్ష జరగడం ఇదే మొదటిసారి అని అధికారులు తెలపగా మంత్రి ఆశ్చర్యపోయారు. పలు ప్రధాన విషయాల్లో విశ్వవిద్యాలయం పనితీరు మెరుగుపడాలని మంత్రి వ్యాఖ్యానించారు. గతానికి భిన్నంగా ఇకనుంచి విశ్వవిద్యాలయం క్రియాశీలకంగా వ్యవహరించి వైద్య విద్య వికాసానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రధాన విషయాలపై దృష్టి పెట్టకుండా సాధారణ బాధ్యతల నిర్వహణతో సాగుతోందని మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో విద్యాబోధన నాణ్యతను పెంచడంపై ఇంతవరకు దృష్టి సారించిన దాఖలాలు లేవని ఆయన అన్నారు. కేవలం సిలబస్ తయారీ, పరీక్షల నిర్వహణకు పరిమితమవడం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం చట్టం స్ఫూర్తిని, ఆశయాలను నిర్లక్ష్యం చేసినట్టవుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య విద్య ప్రమాణాల పెంపు దిశగా విశ్వవిద్యాలయం చేపట్టిన తనిఖీలు, వాటికి సంబంధించిన నివేదికల వివరాలు అడిగిన మంత్రికి ఈ దిశగా నిర్దిష్టమైన ప్రయత్నాలు జరగలేదని అధికారులు తెలపగా మంత్రి అంసతృప్తిని వ్యక్తం చేశారు. ఉన్నత వైద్య విద్య నాణ్యత కోసం మౌలిక సదుపాయాలు, బోధనా తీరులు, వైద్యులు, విద్యార్థుల హాజరుపై పటిష్టమైన నిఘావిధానాన్ని రూపొందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

# జైలు నుంచి వంశీ విడుదల

**విజయవాడ, జులై2,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీ బుధవారం విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు. నకిలీ ఇళ్లపట్టాల కేసులో వంశీకి నూజివీడు కోర్టు నిన్న బెయిల్ మంజూరు చేసింది. ఆయనను కోర్టు జారీ చేసిన అన్ని దృవీకరణ పత్రాలను పరిశీలించిన మీదట జైలు అధికారులు ఆయనను విడుదల చేయడానికి అనుమతించారు. వివిధ కేసుల్లో దాదాపు 137 రోజులుగా వంశీ జైలులో ఉన్నారు. ఇతర కేసుల్లో ఆయన బెయిల్ లభించినప్పటికీ, ఇళ్లపట్టాల కేసులో బెయిల్ మంజూరు కాకపోవడంతో ఇప్పటి వరకు రిమాండ్‌లో ఉన్నారు. నూజివీడు కోర్టు ఇళ్ల పట్టాల కేసుల్లో బెయిల్ ఇవ్వడంతో రిమాండ్ నుంచి బయటకు వచ్చారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నకిలీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారంటూ వంశీపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ బెయిల్ కోసం నూజివీడు కోర్టును ఆశ్రయించారు. దీనిపై నాలుగు వారాల క్రితమే వాదనలు ముగిసాయి. మంగళవారం వంశీకి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వంశీపై ఉన్న రెండు కేసుల్లో కూడా గత నెలలోనే ఆయనకు బెయిల్ మంజూరు అయ్యింది. తాజాగా నకిలీ ఇళ్లపట్టాల కేసులో బెయిల్ రావడంతో ఈరోజు వంశీ జైలు నుంచి విడుదలయ్యారు.

### బిజెపి జాతీయ మండలికి

## రాష్ట్రం నుంచి 40 మంది

### వారిలో మాజీ సిఎం కిరణ్, పురందేశ్వరి, సోము వీర్రాజు తదితరులు

**విజయవాడ జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎపి నుంచి 40 మందికి చోటు దక్కింది. వీరిలా మాజీ సిఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు దగ్గుబాటి పురందేశ్వరి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సిఎం రమేష్ పాకా వెంకట సత్యనారాయణ, సత్యకుమార్ యాదవ్, పి.విష్ణుకుమార్, జివిఎల్ నరసింహారావు, సోము వీర్రాజు ఉన్నారు. కురసా ఉమామహేశ్వరరావు, పంగిరాజారావు, పైడి వేణుగోపాల్, రెడ్డి పావని, ఎస్.కాశీవిశ్వనాథరాజు, పిల్లా రామకుమారి, వి.సూర్యనారాయణరాజు, అయ్యాజీ వేమ, ఆర్.శ్రీదేవి, సీతారామాంజనేయ చౌదరి, బి.నిర్మల కిషోర్ వైఎస్ ,చౌదరి, సాధినేని యామినీశర్మ, బిట్ర వెంకట శివన్నారాయణ, కృపారావు, అన్నెం సతీష్, ముప్పల వెంకటరమణ, లంకా దినకర్, దారా సాంబయ్య, ఎస్.సురేష్‌రెడ్డి, ముని సుబ్రహ్మణ్యం, ఎస్.దయాకర్‌రెడ్డి సి.బాబు, నిషిద రాజు, ఆదినారాయణరెడ్డి, ఎస్.విష్ణువర్ధన్ దేవానంద్, పి.వి. పార్థసారథి, సీహెచ్.సావిత్రి మేడా మురళి, అంకల్‌రెడ్డిలకు జాతీక కౌన్సిల్ సభ్యులుగా అవకాశం కల్పించారు.

### పవన్, అన్నామలైకి

# అండగా ఉంటాం

### వారిపై తమిళ ప్రభుత్వం కేసులు మురుగన్‌పై దాడివంటిదే

### హిందూ ధార్మిక సదస్సులో రాష్ట్ర బిజెపి కొత్త అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ,జూలై 2,ప్రభాతవార్తప్రతినిధి:** హిందు,సనాతన ధార్మిక సమాజ పరిరక్షణ భారతీయులందరి బాధ్యతని ఎపి బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. హైందవ, సనాతన ధర్మాలకు విఘాతం కలిగించాలని ప్రయత్నించే వారి చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, బిజెపి నేతలపై తమిళనాడు ప్రభుత్వం కేసు పెట్టడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వంపై మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్, బిజెపి నేతలపై తమిళనాడులో కేసు పెట్టడం మురుగన్‌పై దాడిగా భావిస్తామని అన్నారు. బుధవారం విజయవాడలో జాతీయ హిందూ ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు.



అన్నామలైకి అండగా పవన్ కల్యాణ్ కూడా రంగంలోకి దిగారని చెప్పారు. పవన్ కల్యాణ్, అన్నావలైకి తాము అండగా ఉంటామని మాధవ్ ఉద్ఘాటించారు. గోమాతను జాతీయ జంతువుగా గుర్తించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి సూచించారు. ఉత్తరాదిలో చాలా దేవాలయాలు మద్యం, మాంస రహితంగా ఉన్నాయని వెల్లడించారు. తిరుమల, తిరుపతిలను కూడా మద్యం, మాంస రహితంగా చేయాలని కోరారు. తిరుమల తిరుపతిని పవిత్రంగా ఉంచి.. టెంపుల్ సిటీగా ప్రకటించాలని సూచించారు.

దేవాలయాల భూములు, ఆస్తులను సంరక్షించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి కోరారు. దేవాలయాల భూములు, ఆస్తులను సంరక్షించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి కోరారు. పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, మాధవ్, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ ఉనికికే బనకచర్ల వివాదం

## రాయలసీమకు గోదావరి నీళ్లు రావాలని కెసిఆర్ అనలేదా?

### వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టాం: మంత్రి పయ్యావుల



బుధవారం కూడేరు మండలం జయపురం గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 2 ప్రభాతవార్త బ్యూరో :** బనకచర్లతో తెలంగాణకు ఏ విధమైన నష్టం లేదని బిఆర్‌ఎస్ ఉనికి కోసమే బనకచర్ల వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని కిందికిపోయే నీటిని వాడుకుంటే పై రాష్ట్రాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నుల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం కింద ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలం జయపురం గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్ ఇంటింటికీతిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్టుపై బిఆర్‌ఎస్ నేత హారీష్‌రావు చేస్తున్న ఆరోపణల వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని, బిఆర్‌ఎస్‌లో అంతర్గత సమస్యలు ఉన్నాయన్నారు. అందులో భాగంగా బిఆర్‌ఎస్ నేత హారీష్‌రావు తన ఉనికిని చాటుకోవడానికి బనకచర్ల అంశాన్ని వాడుకుంటున్నారని ఇది పూర్తిగా ఆయన సృష్టిస్తున్న రాజకీయ డ్రామా అని మిగతా నేతలు కూడా ఆయన ట్రాప్‌లో పడి మాట్లాడుతున్నారని పయ్యావుల కేశవ్ ఆరోపించారు. ఇదే అంశంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఎక్కడా స్పందించలేదని ఆయన గుర్తు చేశారు. బనకచర్ల ప్రాజెక్టు కింద కిందికి వెళ్లే నీటినే వాడుకుంటారని తెలంగాణకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిసి కూడా కేవలం రాజకీయ ఉద్దేశాలతోనే బిఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో వైఎస్.జగన్, కేసిఆర్ కలిసినప్పుడు చేసుకుందామని మాట్లాడుకున్నారని రాయలసీమకు గోదావరి నీళ్లు రావాలని విందుభోజనంలో కెసిఆర్ అనలేదా అని పయ్యావుల ప్రశ్నించారు. ఇప్పుడు బిఆర్‌ఎస్ పార్టీ నేతలే అందుకు విరుద్ధంగా మాట్లాడటం వారి ద్వంద వైఖరికి నిదర్శనమని, అనవసరంగా వివాదాలు సృష్టించి రెండు రాష్ట్రాల మధ్య అపోహలు పెంచ వద్దని ఆయన హితవు పలికారు. గత వైసిపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని, వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందని రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. తల్లికి వందనం, అన్నా క్యాంటీన్లు, గ్యాస్ రాయితీ వంటివి పక్కాగా అమలు చేస్తున్నామని, పింఛన్ గతంలో 3వేలు ఇస్తే, మేము 4వేలు ఇస్తున్నామని ఆయన వెల్లడించారు. మద్యం, ఇసుక కుంభకోణాలు బయటికి వస్తున్నాయని, మద్యం డబ్బులు ఎక్కడికి వెళ్లాయన్నది అందరికీ తెలుసు అని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యేలు, మంత్రులు పల్లెల్లో తిరుగుతుంటే ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. గతంలో అరాచక ప్రభుత్వం ఉందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని సంక్షేమం అంటే అన్ని పథకాలు ఆపేసి నాలుగు పథకాలు అమలు చేయడం కాదని, అన్ని పథకాలను అమలు చేయడమే నాయకుని లక్ష్యమని రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు అందరూ బాధ్యతతో పని చేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా కూడేరు మండలం జయపురం గ్రామంలో 55 మంది రైతులకు 105 రకం కందులను రైతులకు ఇష్టంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, బ్రహ్మయ్య, తహశీల్దారు మహబూబ్ బాషా, సర్పంచు రమాదేవి, లలితమ్మ, జిల్లా, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యాంశంగా మమ్ముట్టి

### మలయాళ సూపర్‌స్టార్ జీవిత ప్రస్థానం సిలబస్‌లోకి తెచ్చిన కేరళ ప్రభుత్వం



**తిరువనంతపురం,జులై 2:** మలయాళ చిత్రసీమలో ఐదు దశాబ్దాలుగా సూపర్ స్టార్‌గా వెలుగొందుతున్న అగ్ర నటుడు మమ్ముట్టికి ఓ అరుదైన, విశిష్టమైన గౌరవం లభించింది. ఏడు పదుల వయసులోనూ అలుపెరుగని నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్న ఆయన సినీ జీవిత ప్రస్థానం ఇప్పుడు డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా మారింది. ఆయన చదువుకున్న కళాశాలే ఈ గౌరవాన్ని అందించడం విశేషం. కేరళలోని ప్రతిష్ఠాత్మక మహారాజా కళాశాల, మమ్ముట్టి సినీరంగానికి అందించిన సేవలను గుర్తిస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తమ కాలేజీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (బిఎ) హిస్టరీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల సిలబస్‌లో ఆయన కెరీర్‌పై ఓ ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చింది. 'హిస్టరీ ఆఫ్ మలయాళం సినిమా' పేరుతో రూపొందించిన ఈ పాఠ్యాంశంలో మమ్ముట్టి సినీ ప్రయాణం, ఆయన ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు, అందుకున్న పురస్కారాల గురించి వివరంగా పొందుపరిచారు. ఈ నిర్ణయంలో మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, మమ్ముట్టి కూడా ఇదే మహారాజా కళాశాల పూర్వ విద్యార్థి.

తాను విద్యాభ్యాసం చేసిన కళాశాలలోనే తన జీవితం ఒక పాఠంగా మారడం ఆయన కెరీర్‌లో ఒక మైలు రాయిగా నిలిచిపోనుంది. కాగా, ఈ అధ్యాయంలో కేవలం మమ్ముట్టి గురించి మాత్రమే కాకుండా, మలయాళ సినిమాకు దిక్సూచిగా నిలిచిన ఇతర దిగ్గజాలు మోహన్‌లాల్, ప్రేమ్ నజీర్, జయన్, షీలా వంటి వారి గురించి కూడా చర్చించారు. తద్వారా మలయాళ సినిమా చరిత్రను విద్యార్థులకు సమగ్రంగా అందించాలని కళాశాల యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఈవార్త తెలియడంతో మమ్ముట్టి అభిమానులు సోషల్ మీడియా వేదికగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## పోలీస్ అకాడమీ సెంటర్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన డిజిపి

**ఆగిరిపల్లి జూలై 2 ప్రభాతవార్త:** ఆగిరిపల్లి మండలం నుగొండ పల్లిలో ఏ.పి పోలీస్ అకాడమీ సెంటర్ నిర్మాణా ప్రదేశాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా బుధవారం పరిశీలించారు. 94.497 ఎకరాల భూమిలో ఏ.పి. పోలీస్ అకాడమీ సెంటర్ నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టిన నేపథ్యంలో డీజీపీ పరిశీలన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పోలీస్ శిక్షణ సదుపాయాలు కలిగిన ఒక ఆధునిక ఏపీ పోలీస్ అకాడమీ సెంటర్ నిర్మాణం కోసం త్వరలో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖకు మిక్కిలి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో మధుసూదన రెడ్డి అదనపు డిజిపి (లా ఆర్డర్) జి.వి.జి. అశోక్ కుమార్, ఐజీపీ, ఏలూరు రేంజ్, ఎం. రవి ప్రకాష్ ఐజీపీ, సత్య యేసు బాబు, డీఐజి, ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు సబ్ కలెక్టర్ , నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ , అగిరిపల్లి ఎస్ఐ కె. సుభ శేఖర్ ఇతర రెవెన్యూ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు
# చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గైర్హాజరు!

**బ్రసేలియా, జులై2:** బ్రెజిల్‌లో ఈ వారం జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదు. ప్రీమియర్ లీ కియాంగ్ ఈ సదస్సుకు హాజరుకానున్నట్లు డ్రాగన్ అధికారికంగా వెల్లడించింది. జిన్‌పింగ్ అధికారం చేపట్టిన 12 ఏళ్లలో తొలిసారి ఈ సదస్సుకు దూరంగా ఉండటం గమనార్హం. మరోవైపు అధ్యక్షుడు ఇటీవల కొంతకాలం అదృశ్యమయ్యారన్న వార్తల వేళ ఈ కీలక ప్రకటన వెలువడింది. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జులై 5 నుంచి 8 వరకు బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఈ సదస్సుకు హాజరుకానున్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన ఈ కూటమిలో ఈజిప్టు, ఇథియోపియో, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇలు ఆ తర్వాత చేరిన సంగతి తెలిసిందే. రష్యాలోని కజాన్‌లో గతేడాది జరిగిన సదస్సులో భారత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం నెలకొన్న సమయంలో నాలుగేళ్ల విరామం తర్వాత ఇద్దరు నేతలు సమావేశంకావడం అప్పట్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాకుండా పలు ద్వైపాక్షిక అంశాల పైనా ఓ అంగీకారానికి రావడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి. తాజాగా ఇదే సదస్సుకు జిన్‌పింగ్ దూరమవుతున్న నేపథ్యంలో తదుపరి వీరిద్దరు ఈ ఏడాది చివరలో చైనాలో జరిగే ఎస్‌సివో సదస్సులోనే భేటీఅయ్యే అవకాశాలు ఉన్నాయి.

మరోవైపు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మే 21న నుంచి జూన్ 5 వరకూ అదృశ్యమయ్యారన్న వార్త ఇటీవల కలకలంరేపింది. అధ్యక్ష మార్పుకు ఇది సంకేతమంటూ కొన్ని నిఘా సంస్థలు అంచనా వేసినట్లు వార్తలువచ్చాయి. సంస్కరణాభిలాషి, టెక్నోక్రాట్ అయిన వాంగ్ యాంగ్ తదుపరి అధ్యక్షుడు కావచ్చంటూ ఊహాగానాలు వినిపించాయి.

## చెవిరెడ్డిని రెండవ రోజు
# విచారించిన సిట్

**విజయవాడ,జూలై2,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని సిట్ అధికారులు రెండోరోజు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో ఏ 38గా చెవిరెడ్డి ఉన్నారు. మూడు రోజుల పాటు మాజీ ఎమ్మెల్యేను సిట్ కస్టడీకి ఇస్తూ ఏసీబీ కోర్టు అనుమతించింది. దీంతో రెండో రోజు విచారణ నిమిత్తం ఆయనను సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకుని సిట్ కార్యాలయానికి తరలించారు ఇక ఈకేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పీఏలు బాలాజీ, నవీన్‌ను ఇండోర్‌లో అదుపులోకి తీసుకున్న సిట్ పోలీసులు విజయవాడకు తీసుకొచ్చారు. ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వెంటనే వారిని ఇండోర్ కోర్టులో హాజరుపరిచారు. ఆపై ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చారు. బుధవారం బాలాజీ, నవీన్‌లను సిట్ పోలీసులు ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు. ఎన్టీఆర్ జిల్లా శివారుల్లోని గరికపాడు చెక్‌పోస్టు దగ్గర పట్టుబడిన అనాధికారిక సొమ్ముకు సంబంధించిన కేసులో వీరిద్దరు నిందితులుగా ఉన్నారు.


## బానిసత్వంలో మగ్గడం కంటే
# జైలు చీకటి గది ఎంతో బెటర్
### పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్

**కరాచి,జులై 2:** పాకిస్థాన్ పాలకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, వారి బానిసత్వంలో మగ్గిపోవడం కంటే జైలులోని చీకటి గదిలో జీవించడానికే తాను ఇష్టపడతానని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జైలు జీవితం గడుపుతున్న ఆయన, ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్ట సవరణలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిరంకుశ పాలకులపై దేశవ్యాప్తంగా పోరాటం చేయాలని తన పార్టీ కార్యకర్తలకు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' సోషల్‌మీడియా మాధ్యమంలో సందేశాన్ని విడుదల చేశారు. పాకిస్థాన్ ప్రభుత్వం ఇటీవల చేసిన 26వ రాజ్యాంగ సవరణ ప్రజాస్వామ్య మూలాలను దెబ్బతీసిందని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు, చట్టబద్ధమైన పాలన, నైతిక విలువలు, మీడియా స్వేచ్ఛ అనేవి నాలుగు ముఖ్యమైన స్తంభాలు. కానీ తాజా సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ఈనెల 6వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పోరాడాలని పాకిస్థాన్ తెహ్రీక్‌ఏఇన్సాఫ్ (పీటీఐ) కార్యకర్తలకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తన సందేశాలు ప్రజలకు చేరకుండా అన్ని విధాలుగా అడ్డుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై కూడా ఇమ్రాన్ ఖాన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక నియంత అధికారంలోకి వస్తే ఓట్లతో పని ఉండదు. తన ఇష్టానుసారం ప్రయోగాలు చేస్తూ పాలన సాగిస్తాడని పరోక్షంగా విమర్శించారు. దేశ న్యాయవ్యవస్థ పైనా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానాల్లో ఎంపిక చేసిన న్యాయమూర్తులే ఉన్నారని, స్వతంత్రంగా వ్యవహరించే వారికి శక్తి లేకుండా పోయిందని అన్నారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ కనుమరుగైందని, నిజాయతీగా పనిచేసే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## వారసుడి ఎంపిక ప్రజలే నిర్ణయిస్తారు: దలైలామా

**న్యూఢిల్లీ, జులై2:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి తన వారసుడి ఎంపిక కొనసాగించాలా అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు. తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిసానతరని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని ఈ ప్రక్రియలో మరెవరికీ జోక్యం చేసుకునే అధికారం లేదని తేల్చి చెప్పారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటి నుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా ఆ తర్వాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హాన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరువాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్ సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన ఆధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చి చెప్పారు.

## పార్లమెంటుహాలులో దాడి కేసు
# నిందితులకు బెయిల్!



**న్యూఢిల్లీ,జులై 2:** 2023 డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని లోక్‌సభలోకి ఇద్దరు ప్రవేశించి భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆ కేసులో నిందితులు నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు ఇవాళ బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, హరీశ్ విద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం నీలం, మహేశ్‌లకు ఊరట కల్పించింది. ఇద్దరికీ 50వేల పూచీకత్తుపై బెయిల్ కల్పించారు. పార్లమెంట్ దాడి ఘటన గురించి మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకూడదని అని కోర్టు ఆదేశించింది. సోషల్ మీడియాలోకూడా ఎలాంటి పోస్టులు కూడా పోస్టుచేయకూడదని అని ధర్మాసనం పేర్కొన్నది. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. 2001 నాటి పార్లమెంట్ దాడి ఘటనను వ్యతిరేకిస్తూ.. కొందరు నిరసనకారులు పార్లమెంట్ బిల్డింగ్‌లోకి ప్రవేశించారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న సమయంలో స్మోక్ కానిస్టర్లను స్ప్రే చేశారు. విజిటర్స్ గ్యాలరీ నుంచి కిందకు దూకి స్మోక్ స్ప్రే చేశారు. ఆజాద్‌ను 2023, డిసెంబర్ 13వ తేదీన అరెస్టు చేశారు. అతనితో పాటు సాగర్ శర్మ, మనోరంజన్ డీ, అన్మోల్ షిండేలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన రోజున ఆజాద్, షిండేలు పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు. లోక్‌సభ చాంబర్‌లోకి శర్మ, మనోరంజన్ ప్రవేశించారు. ఈ కుట్రలో భాగమైన ప్రధాన నిందితుడు లలిత్ ఝా, మరో నిందితుడు మహేశ్ కుమావత్‌లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులపై తగినన్ని సాక్ష్యాధారాలు ఉన్నందున బెయిల్ ఇవ్వరాదని ఢిల్లీ పోలీసులు విచారణ సందర్భంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. విశ్వసనీయ పత్రాలు, మెటీరియల్ ఉన్నందున 1967 చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద శిక్షార్హులని కోర్టుకు విన్నవించారు. 2023 పార్లమెంటు శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలో జీరో అవర్ జరుగుతుండగా పబ్లిక్ గ్యాలరీ నుంచి సాగర్ శర్మ, మనోరంజన్ అనే ఇద్దరు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. పసుపురంగుతో కూడిన పొగ విడుదల చేయడంతో ఎంపీలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇదే సమయంలో అమోల్ శిందే, నీలమ్‌లు పార్లమెంటు వెలుపల కలర్ గ్యాస్ వదులుతూ నియంతృత్వం పనిచేయదంటూ నినాదాలు చేశారు. అనంతరం భద్రతా సిబ్బంది ఈ నలుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన సంచలనం సృష్టించడంతో పార్లమెంటు సమగ్ర భద్రతా బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు కేంద్రం అప్పగించింది.



బుధవారం చంద్రబాబు కుప్పం సభకు అశేష సంఖ్యలో హాజరైన ప్రజలు

# నా కష్టం పేదలకోసమే

>> రాక్షసులపై యుద్ధం చేయాల్సి వస్తోందన్నారు. తాను హత్యా..శవ రాజకీయాలు చేయనని తాను ప్రజాహిత రాజకీయాలు మాత్రమే చేస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయాలు నేరస్తుల మయం అయ్యాయన్నారు. వైఎస్సార్సీ పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. 10లక్షల కోట్ల అప్పులు పెట్టారన్నారు. వాటికి అసలు, వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను పడకేయించారన్నారు.

తాను సిబిఎన్ 14కాదు 95 అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టాలని రౌడీయిజం చేస్తే సహించేది లేదన్నారు. తొమ్మిదిసార్లు ఎమ్మెల్యే అయిన తనపై ఏనాడైనా నేరారోపణలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇకపై ప్రతి నాలుగు నెలలకు ఓసారి గ్యాస్ డబ్బులు మహిళల ఖాతాల్లో వేస్తామని పేర్కొన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ తల్లికివందనం పథకం ఇచ్చామన్నారు. ఇంటర్‌లో చేరిన వారికి త్వరలోనే నగదు వేస్తామన్నారు. ఒకే కుటుంబంలో ఐదుమందికి 75వేలు అందించామన్నారు. రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామన్నారు. అలాగే రైతులకు ఉచితంగా సోలార్ పంప్‌సెట్లు అందిస్తామని సిఎం పేర్కొన్నారు. పేదలను ఆదుకునేందుకే పి4కార్యక్రమం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఎయిర్‌పోర్ట్ భూముల రైతులకు న్యాయం చేస్తా :**

కుప్పంలో ఎయిర్‌పోర్టునిర్మాణంకు భూములిచ్చే రైతులకు తాను న్యాయం చేస్తానని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతులకు మెరుగైన ప్యాకేజ్ అందిస్తామన్నారు. రైతులు కూడా సహకరించాలన్నారు. ఎయిర్‌పోర్ట్ అంటే అభివృద్ధి అన్నారు. తనపై విశ్వాసంతో అమరావతి ప్రాంత రైతులు 33వేలఎకరాల భూములు ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చారని అమరావతి రైతుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామన్నారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో ఎన్డీయే కూటమి పాలన ఏడాది పూర్తయిన నేపథ్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నెలరోజుల పాటు రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు కుప్పం ప్రాంతంలో 1207 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను సిఎం చంద్రబాబునాయుడు నిర్వహించారు. అర్హులైన వారికి ట్రై, ఇ-సైకిళ్లు, ఇ-ఆటోలు పంపిణీ చేశారు. పలువురు పారిశ్రామికవేత్తలు ఈసందర్భంగా సిఎం చంద్రబాబు సమక్షంలో ప్రభుత్వం తరపున కడ ద్వారా మౌఖిక ఒప్పందాలు (ఎంఒయు)లు చేసుకున్నారు.

# బలోపేతం చేయండి

>> పరిశుభ్రత యూనిఫాంలో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తాను. ప్రతి రోజూ హోంవర్క్ ఇస్తాను. చిన్న పిల్లలకు ఫ్రూట్స్, వెజిటబుల్స్ ఫోటోల ప్రదర్శన ద్వారా వారిలో చదువు పట్ల ఆసక్తి కలిగిస్తానని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 9,600 పాఠశాలలకు తరగతికో ఉపాధ్యాయుడు ఉన్నారు. భవిష్యత్ లో మరింత మెరుగుపరుస్తాం. విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. డిజిటల్ విద్యకు ప్రాధాన్యత ఇస్తాం. నిజానికి ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుంది. ముందు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ , మంత్రులు దృష్టిసారిస్తున్నాం. ఇకపై ఉత్తమ ఉపాధ్యాయులను కలిసి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు.

# సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా

>> వంతం లేకుండానే తీసుకున్న నిర్ణయం అన్నారు. ఐపిఎస్ సేవలని పనిచేయడంపై నా జీవితంలో అత్యంత గౌరవప్రదమైన, తృప్తికరమైన అనుభవం. నేను పనిచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎప్పుడూ నా ఇంటిలా భావించాను. ఈ రాష్ట్ర ప్రజలపై నాకు ఎనలేని ప్రేమ, గౌరవం ఉన్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నాపై అధికారులకు, సహచర అధికారులకు ఉద్యోగులతో పాటు నన్ను ఆదరించిన ప్రజలందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీరు ఇచ్చిన మద్దతు, విశ్వాసమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చాయి. ఇక నుంచి జీవితాన్ని కొత్త దారిలో కొత్త లక్ష్యాలతో ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నాను. సమాజానికి మరో విధంగా సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాను.

**కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి ఎపికి అనిల్ కుమార్ సింఘాల్**

కేంద్ర సర్వీసుల నుండి తిరిగి ఎపికి రానున్న స్పెషల్ చీఫ్, సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్. పదోన్నతి నిమిత్తం ఎపికి పంపిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం. అనిల్ కుమార్ సింఘాల్ గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ పదవులు నిర్వహించారు.

# భూసేకరణ

>> భూసమీకరణ పథకం (సూత్రీకరణ, అమలు) రూల్స్, 2025ను రూపొందించారు. ఈ నిబంధనలు రాజధాని నగరం మినహా మిగిలిన రాజధాని ప్రాంతంలో ప్రాజెక్టులకు భూమి సమీకరించేందుకు వినియోగిస్తారు. ఆ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి నోటిఫికేషన్ జారీచేసింది. రాజధానిపరిధిలో కొత్తగా సమీకరించే భూముల నుండి తీసుకునే ప్లాట్ల నిర్వహణ కమిషనర్ గుర్తించిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్/ స్థానిక సంస్థ యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం నూతన నిబంధనలను విడుదల చేసింది. రైతుల నుంచి సమీకరించిన భూములపై సర్వహక్కులూ సీఆర్‌డిఏ కమిషనర్‌కు వస్తాయి, ఈ భూములు తిరిగి తీసుకోబో మని ముందుగానే రైతులు ధృవీకరించాల్సి ఉంటుంది. "భూమిలిచ్చే రైతులు ఆన్‌లైన్ పద్ధతిలో ఆధార్ గుర్తింపు ఓటిపి ద్వారా తిరిగి తీసుకోవ డానికి వీల్లేని పద్ధతుల్లో భూములు ప్వగించడంతోపాటు స్వచ్ఛం దంగా భూములు ఇస్తున్నట్లు వేలిముద్ర వేయాలి" ఇవి సిఆర్ డిఏ పరిధిలో పూలింగుకు తీసు కోబోయే భూముల్లో అమలు చేయనున్న కొత్త నిబంధనలు. ప్రస్తుతం అమరావతి రాజధాని 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో కాకుండా అదనంగా భూములు సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

తేది : 03-07-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
అష్టమి మ.2.08
హస్త మ.1.51
వర్జ్యం రా.10.51-12.39
దు.ఉ.10.01-10.53, మ.3.16-4.08
రాహుకాలం - మ.1.30-3.00

## వారఫలం

**మేషం :** రాజకీయ, కళా,పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వ రంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం:** క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. నూతన భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది.

**కర్కాటకం :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పోటీ పరీక్షలు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**సింహం :** చిరకాల స్వప్నం నెరవేరే సమయం. సంతానం నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కన్య :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**తుల :** నిరుద్యోగుల శుభవార్తలు వింటారు. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాల వారికి అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**ధనుస్సు:** కాంట్రాక్టులు లాభిస్తాయి. ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. సోదరుల నుండి శుభవార్తలు.

**మకరం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. భాగస్వామ్య వ్యాపారాలలో అధిక లాభాలు పొందుతారు.

**కుంభం :** ఇతరుల విషయాలలో జోక్యం తగదు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. శ్రమ అధికం.

**మీనం :** సహాయం కోసం ప్రత్యర్థులు మీ దగ్గరకు రావడం విశేషం. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా శంకర్ రావు

**గుంతకల్లు రైల్వే, జులై 02, ప్రభాత వార్త:** దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శిగా బోడపరపు శంకర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూనియన్ కు చెందిన విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం2014 మేరకు కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా దక్షి ణ కోస్తా రైల్వే జోన్ ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రైల్వేలో అఖిల భారత రైల్వే కార్మిక సమాఖ్య (ఏ ఐ ఆర్ ఎఫ్) దక్షి ణ కోస్తా రైల్వేజోన్ లో తన అనుబంధ కార్మిక యూనియన్ ను ఏర్పాటుచేసే క్రమంలో విజయవాడలోని కె జీ వి, సి ఎస్ ఆర్ భవనంలో ఈనెల 02 నుంచి 04 వరకు నిర్వహిస్తున్న జోనల్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఏ ఐ ఆర్ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా, కోశాధికారి శంకర్ రావులతో పాటు గుంతకల్లు,వాల్తేరు, విజయ వాడ,గుంటూరు డివిజన్ లకు చెందిన యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. దక్షిణ కోస్తా రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గా గుంతకల్లు,విశాఖపట్నం, విజయవాడ,గుంటూరు డివిజన్ ల, వర్క్ షాప్ లకు చెందిన మజ్దూర్ యూనియన్ కమిటీ సభ్యులు, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శిగా శంకర రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికా వర్గాల సమాచారం. మూడు రోజులపాటు నిర్వహించే ఈసమావేశంలో కేంద్ర 8వ వేతన సంఘం ఏర్పాటు, ఏకీకృత పెన్షన్ పథకం అమలు, దక్షి ణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం వంటి కీలక విషయాలపై అత్యున్నత స్థాయి చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకుంటామని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఈసమావేశాల్లో గుంతకల్లు రైల్వే డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎం.బాషా, యస్.విజయకుమార్, సహాయ కార్యదర్శులు ఎం . శ్రీనివాసులు, ఏ.నారాయణ, కె.అశ్వని, జి.మధుసూధన్ రావు, కోశాధికారి కె.శ్రీనివాస శర్మ, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు కె శేఖర్ బాబు, జి.సురేష్ కుమార్లు పాల్గొన్నారు.

# అరటి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

### తాడపత్రి ప్రాంతంలో పర్యటించిన కలెక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం ,జులై 2:(ప్రభాతవార్త బ్యూరో)** అరటి సంబంధించి టిష్యూ కల్చర్ మొక్కల ఉత్పత్తి మరియు పరిశోధన కొరకు పరిశోధన కేంద్రం ఏర్పాటు కొరకు జిల్లాలోని తాడిపత్రి మండలం భోగసముద్రం, తలారి చెరువు, వెంకటంపల్లి గ్రామాల నందు అనుకూలమైన స్థలాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. బుధవారం ఉదయం అనంతపురం డివిజన్ రెవెన్యూ అధికారి కేశవ నాయుడు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. భారతదేశ కేంద్ర ప్రభుత్వం అధీనంలో పనిచేస్తున్న భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్ ( బి బి ఎస్ ఎస్ ఎల్ ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందు వివిధ పంటల విత్తనాభివృద్ధి కొరకు మరియు ముఖ్యంగా అరటి సంబంధించి టిష్యూ కల్చర్ మొక్కల ఉత్పత్తి మరియు పరిశోధన కొరకు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ప్రతిపాదనలు పంపారు. అందులో భాగంగా అనంత పురం జిల్లా నందు ఏర్పాటు చేయమని జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనలు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ పలు గ్రామ స్థలాలను పరిశీలించి కేంద్ర సంస్థకు అనుకూలమైన విధంగా భూములను పరిశీలించారు. 50 ఎకరాలలో అరటి టిష్యూ కల్చర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు స్థల పరిశీలన కొరకు కలియ తిరుగుతూ వివిధ సర్వే నంబర్లలో స్థలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుత స్థల పరిశీలన అనంతరం భూమి ఎంపిక కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు సిద్ధం

**తిరుమల,జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వెంకన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఇతోధిక సేవలందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనకు దిగితే చర్యలు తప్పవని టిటిడి పేర్కొంది. కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయమైన కోర్కెలను సంబంధిత శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని కోరింది. న్యాయమైన కోర్కెలను తీర్చడానికి యాజమాన్యం సదా సిద్ధంగా ఉందని తెలిపింది. అత్యవసర విభాగాలైన పారిశుధ్యం, ఆరోగ్యం తదితర శాఖలలో కాంట్రాక్టు ఉద్యోగులు విశేషంగా సేవలందిస్తున్నారని, భక్తులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు తీసుకోవద్దని కోరింది. భక్తుల సేవలకు ఉద్యోగులు ఆటంకం కలిగించే చర్యలు నిషేధించే ఎస్మా చట్టం టిటిడిలో అమలులో ఉందని ,నిబంధనలను ఉద్యోగులు గుర్తుచేసుకోవాలని టిటిడి పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న దార్మికసంస్థలో విధులను బహిష్కరించడం సరికాదని సూచించింది. రోగుల వైద్యసేవలను బహిష్కరించినా చర్యలు తప్పవని స్విమ్స్ తెలిపింది.

# 16న ఆణివార ఆస్థానం

### - సాయంత్రం పుష్పపల్లకీసేవ

### - ఆర్జితసేవలు,15న విపిఐ బ్రేక్ సిఫార్సులు రద్దు

**తిరుమల, జులై2 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదమొక్కులవాడు శ్రీవేంకటేశ్వరస్వామికి ఈనెల 16వతేదీ బుధవారం ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో ఆణివార ఆస్థానం జరుగుతుంది. ఈనెల 16వతేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 15వతేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. ఆణిమాసం చివరిరోజున నిర్వహించే కొలువుకావడంతో ఆణివార ఆస్థానంగా పేరుంది. గతంలో ఇదే రోజు టిటిడి ఆదాయం వ్యయాలు వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. అయితే టిటిడి బోర్డు ఏర్పాటుతో మార్చినెలలో వార్షిక లెక్కలు ప్రారంభ మవుతాయి. 16వతేదీ ఉదయం 7గంటలకు ఆలయం లోపల బంగారువాకిలిముందు ఘంటామండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కలసి శ్రీమలయప్ప స్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకువేంచేపుచేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసేనాధిపతి విశ్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. పరివట్టం కట్టుకుని జీయంగార్లు బియ్యపుదక్షిణ స్వీకరించి స్వామివారిని నిత్యఐశ్వర్యోభవ: అని దీవిస్తారు. ఆ రోజు శ్రీరంగం నుండి పట్టువస్త్రాలు తిరుమలకు చేరుతాయి. చివరగా 16వతేదీ సాయంత్రం మలయప్పస్వామి శ్రీదేవిభూదేవులతో కలసి పుష్పపల్లకిపై ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. ఆలయంలో ఆర్జితసేవలు రద్దుచేశారు. ఆణివార ఆస్థానంకోసం 15వతేదీ మంగళవారం ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు. కాగా 14వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలు, 15న విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సులేఖలు స్వీకరించరు.



# గోవిందరాజస్వామికి పుష్పశోభితం

### 3 టన్నులు పుష్పాలు, 12 రకాలు



**తిరుపతి,జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం 3టన్నులు పుష్పాలతో, 12రకాల సువాసనల పుష్పాలను గోవిందరాజస్వామి ఉత్సవర్లకు పుష్పయాగం చేశారు. సాయంత్రం వరుణుదేవుడు పలక రించగా ఆలయంలో వేదోక్తమంత్రో చ్చరణల నడుమ శోభాయమానంగా పుష్పయాగ మహోత్సవం నిర్వ హించారు. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆరురకాల ఆకులతో 12రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులకు స్పృశించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు పాలు,పెరుగు, తేనె, చెరకురసం, విబూది, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో కలశస్నపనతిరుమంజనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్,కర్నాటక ,తమిళనాడునుండి దాతలు విరాళంగా పంపిన పుష్పాలు, పత్రాలతో విశేషంగా అభిషేకించారు. ఆలయంలో ఇటీవల బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులవల్లగానీ, అర్చకులవల్ల, అధికారుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం జరిపించడం పరిపాటి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఉద్యానవనవిభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఆలయ ఏఇఒ గోపీనాథ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు 'నేమ్‌బ్యాడ్జీలు' కాగితంపైనే!

### భక్తులకు పారదర్శక సేవలకే ఈ విధానమన్న టిటిడి బోర్డు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న లక్షమంది భక్తులకు నిరంతరాయంగా...ఇతోధికంగా సేవలందిస్తున్న ఉద్యోగులు,సిబ్బందికి నేమ్‌బ్యాడ్జీలు ఇవ్వాలనే ప్రతిపాదనలు నాలుగునెలలుగా కాగితాలకే పరిమితమైపోయింది. దీన్ని తొలుత కొందరు ఉద్యోగులు వ్యతిరేకించినా ఆ తరువాత తిరుమలలో విధులు నిర్వహిస్తున్న కొందరు ఇదీ మంచి విధానమనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జారీచేసిన గుర్తింపుకార్డులను చొక్కా జేబుకుగానీ, మెడలో ట్యాగ్‌తో ధరించాల్సి ఉన్నా ఉద్యోగులు,సిబ్బంది ఎవరూ దీన్ని ఆచరించడంలేదు. దీంతో ఆలయంలోపల మాత్రమేగాక ఆలయం వెలుపల, వసతి కల్పన విభాగంలో విచారణ కార్యాలయాల వద్ద, గదుల కేటాయింపు, లడ్డూ వితరణ శాల,కల్యాణకట్ట తదితర ప్రాంతాల్లో సిబ్బంది గుర్తింపు కార్డులు ధరించాల్సి ఉంది. అయితే ఇవేమీ పట్టవన్నట్లు కొందరు సిబ్బంది వ్యవహరిస్తుండటంతో ఇటీవల కాలంలో వెల్లువెత్తిన పలు ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో ఉద్యోగులు గుర్తింపుకార్డును కనపడేలా ధరించాలని,

నేమ్‌బ్యాడ్జీలు ఉంటే మంచిదనే వ్యాఖ్యలు వ్యక్తమయ్యాయి. దీనివల్ల ఏ విభాగంలో ఎక్కడ ఎవరు తప్పుచేసినా భక్తులుగానీ, పై అధికారులుగానీ వెంటనే కనుక్కోవడం సులభమవుతుంది. గత మార్చినెలలో టిటిడి ధర్మకర్తలమండలి సమావేశంలో తిరుమల,తిరుపతిలో టిటిడికి సంబంధించిన అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నేమ్‌బ్యాడ్జీలు ఏర్పాటుచేయడం వల్ల భక్తులకు జవాబుదారితనంగా వ్యవహరిస్తారనే ఉద్దేశ్యమని వెల్లడించారు.

అయితే ఈ ప్రతిపాదనలకు తొలుత కొంత వ్యతిరేకత వ్యక్తమైనా ఆ తరువాత నేమ్‌బ్యాడ్జీ ధరించడం వల్ల కొంత మంచిదనేది వినిపిస్తోంది. ఇప్పటికే టిటిడిలో ఆలయంలోపల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు వారివారి చొక్కాలకు నామం బొమ్మతో ఉన్న బ్యాడ్జీ ధరిస్తున్నారు. ఇదీ దేవుని చెంత సేవకులమని తెలిపేలా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో టిటిడిలో శాశ్వత ఉద్యోగులు 6,553మందివరకు క్రిందిస్థాయి సబార్డినేట్ నుండి పైస్థాయిలో డిప్యూటీ ఇఒ హోదా వరకు ఉన్నారు. వీరంతా కూడా తక్కువసంఖ్యలోనే గుర్తింపుకార్డు ధరిస్తున్నారు. మిగిలిన వారిలో చాలావరకు గుర్తింపుకార్డు కూడా లేక విధులు నిర్వహిస్తున్నారు.

# తొలి త్రైమాసికంలో అత్యుత్తమ ఆదాయాన్ని ఆర్జించిన దక్షిణ మధ్య రైల్వే

**గుంతకల్లు రైల్వే, జులై 02, ప్రభాత వార్త:** దక్షి ణ మధ్య రైల్వే జోన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రికార్డు స్థాయిలో ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ వరకు రూ. 5219 కోట్ల స్థూల మూలాధార ఆదాయం, 37.41 మిలియన్ టన్నుల సరుకు రవాణా , రూ. 3457.33 కోట్లు సరుకు రవాణా ఆదాయం, ప్యాసింజర్ విభాగం నుండి రూ. 1485.21 కోట్లు నమోదయ్యాయి. ఏప్రిల్ జూన్ మధ్య నెలల్లో మూడు మాసాల్లో రూ.5219 కోట్ల స్థూల మూలాధార ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది 202425లో నమోదైన మునుపటి అత్యుత్తమ ఆదాయం రూ.5,156 కోట్ల కంటే 1.2 శాతం అధికం. ఈ కాలంలో ప్రయాణీకుల ఆదాయం రూ.1485.21 కోట్లు.సరుకు రవాణా ఆదాయం రూ.3457.33 కోట్లు రావడం ద్వారా దీనికి తోడ్పాటు లభించింది. అదేవిధంగా, జోన్ ఇప్పటివరకు అత్యధికంగా 37.41 మిలియన్ టన్నుల సరుకు రవాణా లోడింగ్‌ను సాధించింది. ఇది 2024 25లో నమోదైన 35.89 మిలియన్ టన్నుల మునుపటి అత్యుత్తమ లోడింగ్ కంటే 4శాతం అధికం. ప్రస్తుత సరుకు రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూనే, సరుకు రవాణా విభాగంలో నూతన పంథాలను ప్రవేశపెట్టడం, కొత్త గమ్యస్థానాలను జోడించడం ద్వారా సరుకు రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది, ఈ దిశలో నిరంతర ప్రయత్నం ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 3 నెలల్లో జోన్ 37.41 మిలియన్ టన్నుల సరుకు రవాణా వస్తువులను రవాణా చేయడం ద్వారా అత్యుత్తమ సరుకు రవాణాను నమోదు చేసింది. గత సంవత్సరం ఇదే కాలంలో సరుకు రవాణా (35.89 మిలియన్ టన్నుల) కంటే ఇది 1.52 మెట్రిక్ టన్నులు ఎక్కువ. బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్ వంటి అన్ని వస్తువులలో సరుకు రవాణాలో మెరుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. జోన్ అదే సమయంలో, అవసరమైన, సాధ్యమైన చోట ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడం ప్రయాణీకుల ప్రయాణ ధోరణులను నిరంతరం పర్యవేక్షి స్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో దక్షి ణ మధ్య రైల్వే 865 ప్రత్యేక రైళ్లను నడిపి 11.18 లక్షల మంది ప్రయాణికులను వారిగమ్యస్థానాలకు చేర్చింది . అదనంగా, జోన్ డిమాండ్ మరియు సాధ్యాసాధ్యాలు ఉన్న చోట రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేయడంతో వెయిట్‌లిస్ట్ ను తగ్గించ గలిగింది . జోన్ ఈ కాలంలో ప్రయాణీకుల ఆదాయం పరంగా, రూ. 1485.21 కోట్ల ఆదాయాన్ని సాధించింది, ఇది గత సంవత్సరం నమోదైన ప్రయాణీకుల ఆదాయం రూ. 1455.15 కోట్ల కంటే 2శాతం అధికం. ఈ సందర్భంగా దక్షి ణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఈ రికార్డు స్థాయి ఆదాయాలను

# 9న మాజీ సిఎం జగన్ చిత్తూరు, బంగారుపాళ్యం పర్యటన

### - వైసిపినేత పెద్దిరెడ్డి, అధ్యక్షుడు భూమన



**తిరుపతి, జులై 2ప్రభాత వార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లాలో మామిడి రైతు లను ఆదుకునేందుకు, వారి కష్టాలను తెలుసు కోవ డానికి మాజీ సిఎం, వైసిపి చీఫ్ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 9వతేదీ బంగారుపాళ్యం వస్తున్నట్లు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైసిపి ఉభయజిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. బంగారుపాళ్యంలో పర్యటించి మామిడి రైతులను పరామర్శిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లను, మామిడి రైతులను ఆదుకునే విషయంపై బుధవారం సాయంత్రం తిరుపతిలోని భూమన నివాసంలో వీళ్ళు మీడియాకు వివరాలు తెలిపారు. చిత్తూరుజిల్లాలో ప్రసిద్దిచెందిన మామిడిని కొనుగోలుచేసేవారు లేరని, తూతూమంత్రంగా ప్రభుత్వం 4రూపాయలు గిట్టుబాటు ధర ప్రకటించిందన్నారు.

# కళార్చనపేరుతో తప్పుడు ప్రచారం

### నిందితుని అరెస్టుచేసిన తిరుమల పోలీసులు

**తిరుమల,జులై 2ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ పేరును దుర్వినియోగం చేసుకుని, కళాకారుల నుండి లక్షలరూపాయలు మోసగించిన నిందితుడ్ని తిరుమల 1టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. అతని వద్ద నుండి 14లక్షలు రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా వరంగల్ జిల్లా ఖాజీపేటకుచెందిన సూత్రపు అభిషేక్(28)తిరుమలలోని ఆస్థానమండపంలో శ్రీనివాసకళార్చన పేరుతో రెండురోజుల నాట్యకార్యక్రమాన్ని నిర్వహిస్తానని కళాకారులను నమ్మించాడు. ఇందుకు టిటిడి నుండి, హెచ్‌డిపిపి నుండి కనీసం ఎలాంటి అనుమతిలేకుండా, వారి అధికారిక సమాచారం లేకుండానే ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళాబృందాల నుండి 2,900మంది కళాకారులను నమ్మించాడు.

# అపోలో ఆసుపత్రిలో మృతిచెందిన దుర్గ ఘటనపై చేతులెత్తేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ

**చిత్తూరు, జులై 2 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల చికిత్స పొంది మృతి చెందిన శ్రీదుర్గ మృతిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ చేతులు ఎత్తివేసింది. ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు ఇటు కట్టె విరగకూడదు అటు పాము చావకూడదు అన్న తరహాలో నివేదిక ఇవ్వడంతో ఈ వ్యవహారంపై మృతి చెందిన శ్రీదుర్గ తండ్రి, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం హైకోర్టును ఆశ్రయించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం తన కుమార్తె శ్రీదుర్గ మృతిపై ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేశారు. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదికపై ఆయన మాట్లాడుతూ తన కుమార్తె శ్రీదుర్గ తలకు జరిగిన విలక్షణమైన గాయం కేసుకు సంబంధించి ఆసుపత్రి అధికారులు అనేక విధాన పరమైన లోపాలు కలిగి వున్నాయని, ఫిర్యాదుదారుడు ఆరోపించినట్లు ఆసుపత్రి వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం నిరూపణ కాలేదని పేర్కొన్నట్లు తెలిపారు. అలాగే తన కుమార్తె శ్రీదుర్గకు వైద్యం చేసిన వైద్యురాలు డాక్టర్ సౌమ్య అనుభవరాహిత్యం వల్ల శ్రీదుర్గ మరణించివుండవచ్చునని అభిప్రాయంను ఎక్స్‌పర్ట్ కమిటీ వ్యక్తం చేసిందన్నారు. ఎక్స్‌పర్ట్ కమిటీ చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిలో విధానపరమైన లోపాలు వున్నాయని నివేదికలు పేర్కొన్నదని, మరోవైపు డాక్టర్ సౌమ్య అనుభవరాహిత్యంతో ఈ సంఘటన జరిగిందని పేర్కొంటున్నదన్నారు. అలాగే ఈ ఘటనలో ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం ఏమి లేదని ఎక్స్‌పర్ట్ కమిటీ పేర్కొంటున్నదన్నారు. ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన నివేదికను ఎవరైనా పరిశీలిస్తే ఇది ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక అని చెప్పరని, ఈ కమిటీని అపోలో యాజమాన్యం మేనేజ్‌మెంట్ కమిటీ అని ఆయన ఆరోపించారు. తన కుమార్తె శ్రీదుర్గ మృతిపై ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన నివేదికపై తాను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించి 17 మందిని ప్రతివా దులుగా పేర్కొని రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

BAJAJ FINSERV

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనవి బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(11-07-25) అక్కయ్యపాలెం జీఎల్: PI90SGL11917635, 11912771, 11924884, 11928124, 11943831, 11981073, 11981907, 12146713, 12148902, 12149091, 12173056, 12274058. అనంతపుర్ కల్యాణ్‌దుర్గ్ రోడ్ I; PIV9SGL11935726, 12057397. అనంతపుర్ సుభాష్ రోడ్ I; PGA7SGL11861336, 11874154, 11899538, 11947773, 11963408, 12033465, 12074621, 12079386, 12070599, 12070043, 12101694, 12110521, 12168575, 12170415, 12172883, 12181161, 12192974, 12195284, 12240586. బద్వేల్ ఫోర్ రోడ్ సర్కిల్ I; PJU6SGL11834006, 11952610, 12248825, 12272308, 12273641, 12299314. చిరాల సంత బజార్ I; PEJ9SGL11926000, 12000792, 12042254, 12126028, 12156663. దాబాగార్డెన్స్ జీఎల్; PI55SGL11934629. ద్వారకానగర్ జీఎల్; PI52SGL11862092, 11913616, 12067280, 12152622, 12196978, 12197540, 12196780, 12197226, 12196294, 12197097, 12240374, 12234261, 12235499, 12262577, 12275981. కంచర పాలెం జీఎల్; PI54SGL12037583, 12115007, 12114532, 12161544, 12172707, 12173202, 12196205, 12250526, 12275382. మర్రిపాలెం జీఎల్; PI94SGL12276423. (12-07-25) అనకపల్లి భార్గవి ప్లాజా జీఎల్; PBV8SGL11364508, 11838304, 11934209, 11992282, 12241434, 12297140. ఏలూరు వసంత మహల్ స్ట్రీట్ జీఎల్; PEG8SGL12139654, 12141851, 12150626, 12178903, 12171822, 12179292. గుడివాడ బిజీఎల్: P563SGL6282590, 11533468, 11936008, 11932377, 11928443, 12037615, 12052224, 12150653, 12200747, 12241524. గూడూర్; P5N7SGL10940907, 11077555. గుంతకల్ వెజిటేబుల్ మార్కెట్ జీఎల్; PBV9SGL12298880. గుంటూర్ అరుండేల్ పేట్ జీఎల్; PEK1SGL11944378, 12151889, 12239182, 12238617. హిందూపూర్ లక్ష్మి ఎన్‌క్లేవ్ జీఎల్; PEG4SGL11914075, 11966622, 11961983, 11991802, 12000400, 12069520, 12153331, 12150649. కూర్మన్నపాలెం జీఎల్; PI57SGL11836231, 11858804, 11858549, 11943999, 11984193, 12049815, 12049458, 12095769, 12178873, 12198620, 12231598. నర్సీపట్నం మైన్ రోడ్ I; PIW7SGL11743523, 11835738, 11983362, 12067161, 12093398, 12098311, 12272885. కొత్త గాజువాక జీఎల్; PI53SGL11853173, 11849210, 11911965, 11957638, 12007495, 12036854, 12035389, 12053917, 12101145, 12149737, 12298300. పాత గాజువాక జీఎల్; PB47SGL11855132, 11908325, 12076159, 12075750, 12100919, 12100588, 12130561. తుని సినిమా రోడ్ జీఎల్; PBW9SGL11854289, 11929919, 12251314. (14-07-25) బొబ్బిలి పెద్ద బజార్ మైన్ రోడ్ I; PKI4SGL11839068, 11838855, 11837248, 12058377, 12058676, 12115537, 12297843. కదిరి ఎన్‌టీఆర్ సర్కిల్ I; PIW8SGL11822803, 11929769, 11930447, 12001354, 12033070, 12074245, 12073848, 12089177, 12099586, 12094869, 12116928, 12260443, 12297471. కొత్తపేట గుంటూర్; P73FSGL12051719, 12154531, 12242503. కర్నూల్ గాంధీ నగర్ జీఎల్; PBW2SGL12033851, 12037758, 12032841, 12171694. మదనపల్లె ఎన్‌టీఆర్ సర్కిల్ I; PEG6SGL11857664, 11852816, 11880159, 11893925, 11894156, 11925413, 11952700, 11979985, 12039614, 12054966, 12048298, 12171314, 12195908, 12196068, 12195156, 12251219, 12284060, 12273824. శ్రీకాకుళం రాములక్ష్మణ జీఎల్; PBW5SGL11840568, 11943109, 12253514, 12250270, 12279201. విజయనగరం ఏ జీ రోడ్ జీఎల్; PBX1SGL10989129, 11579711, 11897469, 11897686, 11898398, 12113756, 12113654, 12113041, 12279603, 12276302, 12279232. విజయనగరం ఎంజీ రోడ్ జీఎల్; PCZ4SGL11842797, 12042727, 12192100. (15-07-25) మధురవాడ జీఎల్; PI93SGL11991820, 12060456, 12231851. మార్కాపూర్; PW03SGL10853131. నంద్యాల్ శ్రీనివాస్ నగర్ జీఎల్; PEO1SGL11838401, 11889850, 12088894, 12089694, 12232834, 12233837, 12261466, 12272553. నరసారావుపేట అరుండేల్ పేట్ జీఎల్; PEO2SGL11927999, 12134564. నెల్లూర్ బీజీఎల్; P468SGL12174254, 12177494. నెల్లూర్ జీఎల్; P19ISGL11855377, 11853279, 12033920, 12137503, 12194105, 12242051. నెల్లూర్ స్టోన్‌హౌస్‌పేట్ జీఎల్; PXB4SGL11875561, 11879928, 12000746, 12249935. పెందుర్తి జీఎల్; PI92SGL11812710, 11823728, 11890156, 11926022, 11969202, 11991673, 11991778, 11993232, 11983225, 12038121, 12053188, 12073164, 12095046, 12092031, 12091745, 12092316, 12109053, 12136900, 12177828, 12230634, 12280545, 12275638, 12295060, 12296980. శృంగవరపు కోట కస్పా వీధి జీఎల్; PBW6SGL11961188, 12033995, 12039416, 12052081, 12076218. తగరపువలస భీమిలి రోడ్ I; PIW6SGL11944865, 11963646, 12051660, 12079027, 12147355, 12188085. వైజాగ్ గోపాలపట్నం జీఎల్; PB91SGL11854401, 11895376, 12113468, 12153357. (16-07-25) హెచ్‌బీ కాలోనీ జీఎల్; PI58SGL11949102, 11981418. నెల్లూర్ వేదయపాలెం జీఎల్; PXB5SGL11918756, 11910953, 11910621, 11944790, 12012161, 12120520, 12131301, 12131797, 12172775, 12178368, 12240128, 12263819, 12263494. ఒంగోల కర్నూల్ రోడ్ జీఎల్; PEJ8SGL11930110, 11944562, 11948411, 12091034, 12091558, 12277793. పెద్దవాల్తేర్ జీఎల్; PI56SGL12009762, 12078764, 12119700, 12119457, 12261125, 12261473, 12299249. పీలేరు కడప రోడ్ జీఎల్; PEG3SGL11839294, 11934274, 12073254, 12110482, 12147461, 12159501, 12188314, 12194175, 12276032. రైల్వే కోడూరు నేతాజీ రోడ్ జీఎల్; PGC5SGL11918233, 11960907, 12050260, 12074983, 12088290, 12102301, 12111906, 12168651, 12234052, 12272682. రవీంద్ర నగర్ జీఎల్; PI95SGL11933161, 12282472. వైజాగ్ బీజీఎల్; P408SGL11813525, 11947331, 12002053, 12075898, 12071277. (17-07-25): జంగారెడ్డిగూడెమ్ ఏలూరు మైన్ రోడ్ జీఎల్; PGH1SGL12300054. కాకినాడ జగన్నాయిక్‌పూర్ జీఎల్; PBW1SGL12091907. రాజమండ్రి దేవీ చౌక్ జీఎల్; PBW3SGL12148404, 12291910. రాయచోటి బంగ్లో రోడ్ జీఎల్; PBW4SGL11686432, 11819380, 11818453, 11819197, 11870517, 11880031, 11925897, 11966491, 11983239, 11987161, 12005208, 12036436, 12036006, 12068556, 12067178, 12108835, 12111573, 12160286, 12149808, 12168001, 12196651, 12251901, 12275309, 12271334, 12302325. శ్రీకాళహస్తి మైన్ రోడ్ I; PGC6SGL11989636, 11990360, 12075198, 12087443, 12201019, 12199448, 12259424, 12258783, 12259064, 12259240, 12258532, 12295367, 12294897. సూళ్లూర్‌పేట పాండు రంగ స్ట్రీట్ జీఎల్; PBW7SGL11860481, 11952499, 12001779, 12029721, 12087409, 12088012, 12132307, 12194845, 12274668. తాడిపత్రి కృష్ణ పురం జీఎల్; PBW8SGL11899973, 11958504, 12035366, 12112058, 12112836. (18-07-25) తిరుపతి బైరాగి పట్టెడ జీఎల్; PMB8SGL12065865, 12241398, 12277582. తిరుపతి బీజీఎల్; P442SGL11839509, 11895972, 11951425, 11945326, 11968615, 11986266, 12003489, 12056263, 12055776, 12158687, 12253495, 12251860, 12254152, 12277613. తిరుపతి లీలమహల్ జీఎల్; PNB1SGL11873352. తిరుపతి ఆర్‌సీ రోడ్ జీఎల్; PNB2SGL12195530, 12239678. విజయవాడ అడిషనల్ గురునానక్ కాలోనీ జీఎల్; PGH4SGL11857637, 11898902, 12037288, 12276329. విజయవాడ అజిత్ సింహ్ నగర్ జీఎల్; PLB9SGL12099186, 12170034, 12230632. విజయవాడ భవానీపురం జీఎల్; PMB1SGL11694618, 11989848, 12156748, 12195298, 12239172, 12251477, 12257191, 12300473. విజయవాడ ఎలూరు రోడ్ జీఎల్; PMB2SGL11290616, 11898366, 11912437, 12138024, 12178700, 12192478, 12256029, 12257057. విజయవాడ గవర్నర్‌పేట్ జీఎల్; PMB7SGL 11988995, 12076181, 12077270, 12116396, 12259664. (19-07-25) విజయవాడ ఇబ్రాహింపట్నం జీఎల్; PMB6SGL11873287, 11873120, 12040654, 12035906, 12093361, 12095808, 12140124, 12278045, 12283162, 12292177. విజయవాడ లబ్బీపేట్ జీఎల్; PGA8SGL11860092, 11873641, 11986602, 12037820, 12154012, 12155751, 12154943, 12234774, 12235746, 12235281, 12272963. విజయవాడ పస్ టౌస్ జీఎల్; PMB3SGL11765649, 11842628, 11877295, 11950330, 11993793, 12071567, 12241516, 12242066, 12262370, 12281795. విజయవాడ రామవరపాడు జీఎల్; PMB5SGL12276073. విజయవాడ సత్యనారాయణపురం జీఎల్; PMB4SGL12235301, 12237510, 12274158.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

స్వార్థచింతన లేనప్పుడే ఘనకార్యాలు సాధించగలం, అప్పుడే మన ప్రభావం ఇతరులపై పడుతుంది.

-ఖలీల్ బిల్లింగ్

# 'బిగ్' ఫైట్

అంతర్జాతీయ వ్యవహారాల్లో కానీ, అంతర్గత వ్యవహారాల్లో కానీ శ్వేతసౌధాధి నేత ట్రంప్ వేలుపెట్టని చోటు లేదు. భంగపడని సందర్భం లేదు. అయినా ఆయన దూకుడు ఏమాత్రం తగ్గ లేదు. ఎన్నికల ముందుఎంతో పకడ్బందీగా వ్యూహాత్మకంగా ట్రంప్ గెలుపునకు కృషి చేసిన చెలికాడు ఎలాన్ మస్క్ ఇప్పుడు చేదయ్యాడు. ఇంత తీవ్రస్థాయిలో వారిద్దరి మధ్య విభేదాలు ముదురుతాయని ఎవరూ ఊహించి ఉండరు. ఇప్పుడు వారిద్దరి మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు మిన్నుముట్టుతున్నాయి. 'వన్ బిగ్‌బ్యూటీఫుల్' బిల్లు విషయంలో వీరిద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ బిల్లును సెనేట్ ఆమోదిస్తే అమెరికా అప్పును ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరుస్తుందని మస్క్ ఆది నుంచి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్, మస్క్‌ల వివాదానికి ఈ బిల్లు అగ్గికిఆజ్యం పోసిన చందాన మారుతోంది. అయితే అభ్యంతరాలున్నా ఈబిల్లు సెనెట్‌లో నెగ్గుకొచ్చింది. ఈ బిల్లులోని లోపాలు ఎత్తిచూపడమే మస్క్ ఎక్స్ వేదికగా వరుస మెస్సేజ్‌లు ట్రంపును మరింత ఆగ్రహోద్రుడ్ని చేసింది. చరిత్రలోనే ఎవరూ పొందలేనంతగా మస్క్ అమెరికా నుంచి సబ్సిడీలు పొందుతున్నారు. ఈసబ్సిడీలే లేకుండా రాకెట్ ప్రయోగాలూ ఉండవు. శాటిలైట్లూ ఉండవు, ఎలక్ట్రికల్ కార్ల ఉత్పత్తి ఉండదు. ఎలాన్ మస్క్ తన దుకాణాలన్నీ మూసుకుని దక్షిణాఫ్రికాకు పోవాల్సిందే'నని ట్రంప్ సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో పోస్టుపెట్టారు. అదే జరిగితే అమెరికాకుఎంతో సంపద మిగులుతుందని కూడా ఆ పోస్టులోవివరించారు. అంటే ట్రంప్‌కు తమ దేశంలోని అన్ని సమస్యల కన్నా ఎలాన్ మస్క్‌ను భంగ పరచడమే ప్రధాన కార్యక్రమంగా పెట్టుకున్నట్లుంది. అంతే కాదు ప్రప్రథమ ప్రాధాన్యతగా ప్రభుత్వ ఖర్చులను నియంత్రించే 'డోజ్' విభాగం ఎలాన్ మస్క్‌కు అమెరికా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సబ్సిడీల వివరాలను బయటికి తీయడంపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. ఇంతటి వివాదానికి కారణమైన 'వన్ బిగ్ బ్యూటీఫుల్ బిల్'యాక్ట్ అమెరికా ప్రభుత్వ వ్యయంలో కోత, వివిధపన్నుల్లో భారీస్థాయిలోమార్పులు తలపెట్టే లక్ష్యంతో చేపట్టిన ట్రంప్ ఆలోచన. ఇన్ని వైరుధ్యాలు బహిరంగం గా ఊపిరి పోసుకుంటున్న నేపథ్యంలోనూ ట్రంప్ మాటే నెగ్గింది. ఎందుకంటే ఈ బిల్లు ప్రస్తావన తలపెట్టినప్పటి నుంచి నాటకీయ పరిణామాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక దశలో ఎలాన్‌మస్క్ ఈ బిల్లుకు వ్యతిరేకమైన వ్యాఖ్యానాలు చేస్తూనే అవసరమైతే అమెరికాలో ఒకప్రత్యేక రాజకీయ పార్టీని కూడా స్థాపిస్తానని మస్క్ ప్రకటించారు. ఈఅంశం సహజంగానేట్రంప్‌కు కోపం తెప్పించింది. మస్క్ మరింత దూకుడుగా వెళ్తే రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయోనన్న భయంతోనే ట్రంప్ ఎలాన్ మస్క్ పట్ల పూర్తి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. 940 పేజీల 'వన్ బిగ్ బ్యూటీ ఫుల్ బిల్లు' అన్ని సంప్ర దాయ విధానాలను పూర్తి చేసుకొని నేడో రేపో ట్రంప్ సంతకంతో చట్టరూపం దాలుస్తుంది. ఆ తర్వాత ట్రంప్, ఎలాన్ మస్క్‌ల వైరం అసాధారణస్థాయికి వెళ్లిపోతుందనే ఊహాగానాలున్నాయి. ఈ బిల్లునుఅమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్) ఆమోదం ఏనాడో పూర్తయింది. గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహకాల రద్దు, వలస దారులను స్వదేశాలకు తిప్పిపంపే విషయంలో కఠిన చర్యలు తీసుకోవడం, ఆహార సబ్సిడీలకోత, రక్షణ రంగ వ్యయం భారీగా పెంపు, విద్యారుణాలసాయంలోనూ తగు కోతలు పెట్టడం, ఆరోగ్య రంగానికిస్తున్న నిధులలో బాగా కోతపెట్టే విషయం పరిశీలన వ్యయకర్తనం దిగుమతులపై ఆంక్షలు వంటి ఎన్నోఅంశాలు ఉన్నాయి. వీటన్నిటి విషయంలోనూ ఇప్పటికే ట్రంప్ కొన్ని ప్రతిపాదనలు, నిర్ణయాలు తీసేసుకున్నారు. తన చేతలకు, కోతలకు ఇంకా పని పెడితే అమెరికన్‌లందరి మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం పడుతుంది. ఈ బిల్లు ఉచితానుచితాలు, పర్యవసానాల విషయంలో బాగా చర్చ జరిగింది. ఈ బిల్లులోని అంశాల సంగతి గూర్చి ఎక్కడా చర్చించవద్దని మస్క్‌కు ఆదిలోనే ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ బిల్లులో ఉన్న అంశాలన్నిటినీ క్రోడీకరించుకుని చూస్తే తొలి బాధితుడు 'ఎలాన్ మస్క్' అవుతాడు. అందుకే ఆయన వీటిలోని అంశాల ప్రస్తావన తెస్తున్నట్లు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు అనుకూలంగానూ, వ్యతిరేకంగాను 50ఓట్లు చొప్పున రావడంతో ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ఓటుతో ఆమోదం లభించింది. ఎలాన్ మస్క్ కంపెనీలు టెస్లా, స్పేస్ ఎక్స్‌లకు లభించే సబ్సిడీల అంశాన్ని ట్రంప్ పదేపదే ప్రస్తావిస్తూ మస్క్ కోపకారణమయ్యాయి. మస్క్ ప్రపంచ కుబేరునిగా ఆయన వద్ద నున్న ఆయుధాలు ఆయనకున్నాయి. కాగా అతిపెద్ద దేశాధ్యక్షునిగా ట్రంప్ ఆలోచనలను కాదనలేని పరిస్థితి. ఇదంతా ఇలా ఉంటే ఎలాన్ మస్క్ కొత్త రాజకీయ పార్టీ ఆలోచన మానుకున్నట్లు లేదు. ఎక్స్‌లో తాను తాజాగా పోస్టుచేసిన నేను సూటిగా చెబుతున్నాను, నా కిచ్చే సబ్సిడీలన్నిటిని కోత పెట్టేసుకోవచ్చునని మస్క్ ట్రంప్‌కు సవాల్‌విసిరారు. ఆ వెంటనే 'అమెరికాలో ఏకపార్టీ పాలన ఉందనీ దేశంలో ప్రజాసంక్షేమాన్ని వాస్తవిక దృష్టితో పట్టించుకునేకొత్త రాజకీయ పార్టీరావాల్సిన సమయం ఆసన్నమైందనిమస్క్ తన మనసులోని ఉద్దేశాన్నిస్పష్టంగా ప్రకటించారు. మస్క్‌కిచ్చే సబ్సిడీల కోత విషయంలో ట్రంప్ ఎంత స్పష్టంగా ఉన్నారో అంతే స్పష్టంగా ట్రంప్‌కి కర్రు కాల్చి వాత పెట్టే ధోరణిలో కొత్త పార్టీ స్థాపించే 'యోచనలో ఎలాన్ మస్క్ కూడా ఉన్నారు. ఈమిత్రద్వయం భావావేశాల మధ్యమీడియా పలకరింపుల్లో డోనాల్డ్‌ట్రంప్ నడిగిన ప్రశ్నకు సమాధానంగామస్క్‌ను అమెరికా నుంచిపంపే విషయంపైదృష్టి పెట్టాల్సిందేనని కొసమెరుపు మెరిపించడం విశేషం.

అప్పు పుచ్చుకునేటప్పుడు ఉండే ఆనందం తిరిగి ఇచ్చేటప్పుడు కూడా ఉన్నవాడే నిజమైన గుణవంతుడు, ధనవంతుడు.



ఎమర్సన్

ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.



జార్జ్ వాషింగ్టన్

# ప్రజావాక్కు



## ఉపాధి హామీ పథకాన్ని పొడిగించాలి

వ్యవసాయ రంగం భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. జనాభాలో సగానికిపైగా ప్రజలు ఈ రంగంపై ఆధారపడుతున్నారు. అయితే, గతంలో ప్రకటించిన అనేక హామీలు ఇంకా అమలు కాలేదన్నది గమనార్హం. ప్రధానంగా, 2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతు ఉత్పత్తులకు అనుకూలమైన విధంగా మార్చాలి. ఉత్పత్తి ధరలకు మద్దతుగా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రైతుకు వాస్తవ లాభం చేకూరేలా చేయాలి. తెలంగాణలోని గట్టు ఎత్తిపోతల పథకానికి తగిన నిధులను కేటాయించి, పనులను వేగవంతంగా పూర్తిచేస్తే సాగునీరు అందుబాటులోకి వస్తుంది. జూరాల ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక తొలగించడంతో నీటి నిల్వ సామర్థం పెరుగుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ద్వంద్వ వైఖరి

లక్షలాది మంది జనం గుమిగూడే ప్రదేశాలలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. గోదావరి పుష్కరాలు, కుంభమేళా, ఢిల్లీ రైల్వేస్టేషన్, తిరుమల కొండ ఇంకా మరికొన్ని చోట్ల ఇదే కారణంతో తొక్కిసలాటలో ఎన్నో ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోయాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు ఆ సంఘనలను సీరియస్‌గా తీసుకోలేదు. తమ తప్పు అణువంతైనా లేదని చెప్పుకున్నాయి. పార్టీ వారు తమ ప్రభుత్వాలను సమర్థిస్తూ మాట్లాడారు. అదే బెంగళూరు విషయం వచ్చే సరికి మాటమార్చేశారు.

- మిథునం, హైదరాబాద్

## సిగాచి పరిశ్రమ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

ఇండస్ట్రియల్ పార్కులోని సిగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం ఒక్కసారిగా రియాక్టర్ పేలిపోవడం దీంతో భారీగామంటలు ఎగసి సజీవ దహనం అయ్యారు. ఈ ప్రమాదంలో సుమారు 45మంది కార్మికులు మరణించడం అనేక మంది గాయపడ్డారు. పరిశ్రమ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం. యాజమాన్యం మీద కఠిన చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## ప్రభుత్వ బడుల్లో పెరిగిన ప్రవేశాలు

ఒకప్పుడు ప్రభుత్వ బడులు అంటే చిన్నచూపు. నిరుపేద తల్లి దండ్రుల సైతం అప్పులుచేసి మరీ తమపిల్లలనుప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించేవారు. ఎపిలో ఈవిద్యా సంవత్సరం తీసుకువచ్చిన సంస్కరణలతో తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపుమళ్ళింది. ప్రతి పంచాయతీలో పాఠశాల ఉండడం, విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయుల నియామకం, తల్లికి వందనం అమలు చేయడం, నెలలో ఒకరోజు నోబ్యాక్‌డే, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పుస్తకాల భారాన్ని తగ్గించడం, పాఠశాల తెరిచిన రోజునే విద్యార్థి మిత్రకిట్లు అందజేయడం, బడిబాటతో ప్రభుత్వపాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## హడావిడి ఆదర్శం..అనుమానాస్పదం

ఎన్నికల కమిషన్ మంచి ఆలోచన చేస్తుంది అనుకున్నా దాని తొందరపాటు అనుమానం పెంచుతోంది, అసలు ఉద్దేశ్యం వేరే ఏమైనా ఉందా అని. బీహార్ రాష్ట్రఎన్నికలు కొద్ది నెలల్లో ఉన్నాయి. ఇప్పుడు హడావిడిగా రెండునెలల్లో అక్కడి ఓటర్ల జాబితాల్ని సమూలంగా ప్రక్షాళన చేయాలనుకుంటుంది. ప్రత్యేక ఇంటెన్సివ్ రివ్యూ పేరుతో. మన దేశపు ఎన్నికల ప్రక్రియ లో దొంగ వోట్లు ఒక రుగ్మత అయితే చాలామంది అర్హులకు ఓటు హక్కు లేకపోవడం, ఓటరుకార్డు ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేక ఆఖరులో వెనక్కి తిరగడం మరో రుగ్మత. సమగ్రమైన, ఖచ్చితమైన జాబితా తయారీ దేశంలో ఎక్కడైనా ఇప్పటికీ నెరవేరని ఆదర్శమే. లోపరహితంగా ఆ ప్రక్రియను చేపట్టాలనుకోవడం ఎన్నికల సంఘంకి మొదటి బాధ్యత. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అది పెద్దఆదర్శమే అనుకోవాలి. కానీ బీహార్ విషయంలో ఎందుకు ఆ ప్రయత్నాన్ని అభినందించలేకపో తున్నామంటే ఈ రివ్యూకి ఆ సంఘం కేటాయించిన సమయం.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## టీచర్ల అభిప్రాయంతోనే నిర్ణయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక చర్చల్లో భాగంగా ఎస్జిటి ఉపాధ్యాయులకు టీచర్ల బదలీలను మాన్యువల్ కౌన్సిలింగ్లో మిగతా వారికి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా జరుపుతామని హామీ ఇచ్చారు. అయితే వివిధ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులలో కొందరు మాన్యువల్ కౌన్సిలింగ్ కావాలని, మరికొందరు వెబ్ కౌన్సిలింగ్ కావాలని భిన్నాభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు.

-వి.సురేష్, నెల్లూరు జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్లాస్టిక్ నిషేధం..ప్రకృతి పరిరక్షణకు అంకితం

**ప్లాస్టిక్‌ను వదలడం కష్టంగా అనిపించినా, భవిష్యత్తు తరాల కోసం అది అత్యవసర మార్పు. ఈ మార్పు మన చేతుల్లోనే ఉంది. మన భూమి మన చేతుల్లో ఉంది. దానిని రక్షించడంలో ప్రతి చిన్న చర్యకూ విలువ ఉంది. ప్లాస్టిక్ బ్యాగ్‌ను తిరస్కరించడం అంటే భూమిని అంగీకరించడం. మానవతా దృష్టితో భావించి, ప్రకృతిని పరిరక్షించేదే నిజమైన పర్యావరణ భక్తి. ప్లాస్టిక్ బ్యాగ్ రహిత జీవితం ఒక సవాలుగా కనిపించినా, అది సాధ్యమే. దీనివల్ల మనకు కేవలం పర్యావరణ పరిరక్షణే కాక, భవిష్యత్తు తరాలకు ఒక ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని అందించగలుగుతాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని ఒక నాటి కార్యక్రమంగా కాకుండా, రోజువారీ జీవితంలో ఒక అలవాటుగా మలచుకోవాలి. ఒక్కొక్కరి చర్య ఒక విశ్వ విప్లవానికి నాంది కావచ్చు.**



రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పర్యావరణం మీద భయంకరమైన ఒత్తిడులు పెరిగిపోతున్నాయి. ఆ ఒత్తిడిలో ప్రధానంగా కనిపించే అంశం ప్లాస్టిక్ కాలుష్యం. సరుకులు కొనుగోలు చేసిన ప్రతిసారి ఒక ప్లాస్టిక్ బ్యాగ్ మన చేతిలోకి వస్తోంది. కానీ ఇది ఎంత సౌకర్యవంతమైందో అంతే ప్రమాదకరమైంది కూడా. ప్రత్యేకంగా ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ బ్యాగ్‌లు మన జీవితాలలో సౌలభ్యంగా అనిపించినా, భూమి జీవితానికి ముప్పుగా మారాయి. ఈ అంశంపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 3న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇది కేవలం ఒక రోజుకి పరిమితమైన వేడుక కాదు. ఇది ప్లాస్టిక్ ముప్పును గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునే ఒక బాధ్యతాయుతమైన సంకల్పానికి సూచిక. మన సమకాలీన జీవనశైలిలో ప్లాస్టిక్ ఒక భాగమైంది. నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయం అయ్యింది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం సర్వం ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ సొంతం. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు, నూనె, (లిక్విడ్) ద్రవాల ప్యాకెట్లు, పానీయాలు తాగే స్ట్రాలు, వాటర్ బాటిల్స్, సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల ఫర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970–1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది. వాడి పడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏళ్లు పడుతున్నది. సౌలభ్యానికి ప్రతీకగా మారిన ప్లాస్టిక్ బ్యాగ్‌లు అసలు తొలిసారి 1960వ దశకంలో ప్రవేశించాయి. 1980 నాటికి ప్రపంచవ్యాప్తంగా వాటి వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. భారతదేశం లో 1990 దశకానికి తరువాత ప్లాస్టిక్ బాగ్స్ అమితంగా విస్తరించాయి. తక్కువ ధర, తక్కువ బరువు, తడిసిపో కుండా ఉండే లక్షణాలు వీటి విపరీత వినియోగానికి దారి తీశాయి. కానీ ఇవే దీర్ఘ కాలంలో భూమి మీద విషపూరిత భారంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషం దాదాపు 10 లక్షల ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడుతున్నట్టుఅంచనా. వాటిలో 90 శాతం పైగా ఒక్కసారి వాడి పారేస్తున్నారు. ఈ సంచులు మానవ వినియోగంలో 12 నిమిషాలకే పరిమితమవుతాయి. కానీ ఇవి భూమిలో పూర్తిగా కలిసి పోవడానికి 400 నుంచి 500 సంవత్సరాలు పడుతుంది. సముద్రాల్లో సగటున



ప్రతి చతురస్ర మైలుకి 46,000 ప్లాస్టిక్ తుక్కులు కనిపిస్తున్నాయి. ఒక్క సంవత్సరం వ్యవధిలోనే సముద్రాల్లో పడే ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం 8 మిలియన్ టన్నులకుపైగా ఉండటం ఒక తీవ్రఆందోళనకర విషయం. ప్లాస్టిక్ బ్యాగ్‌లు పర్యావరణాన్ని కలుషితం చేయడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురిచేస్తున్నాయి. తాబేళ్లు, చేపలు, పక్షులు ప్లాస్టిక్ సంచులను ఆహారంగా తీసుకుంటూ మరణిస్తున్నారు. పశువులు పొలాల్లో మేత తింటూ ప్లాస్టిక్ తినడం వల్ల శరీరంలో అవి జీర్ణంకాకుండా పేరుకుపోతున్నాయి. మురుగు నీటి వ్యవస్థల్లో సంచులు అడ్డుపడటం వల్ల నగరాల్లో వరదలు సంభవిస్తున్నాయి. ప్లాస్టిక్ తగలబడి విడుదలయ్యే డయాక్సిన్, ఫ్యూరాన్ వంటి విష వాయువులు వాయు కాలుష్యానికి దారితీస్తూ, మానవ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నాయి. భారత దేశంలో కూడా ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. 2016లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు రూపొందించగా, 2022 జూలై 1 నుండి ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తులపై దేశవ్యా ప్తంగా నిషేధం అమలులోకి వచ్చింది. 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్‌లు నిషేధిత జాబితాలో ఉన్నాయి. ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్ట్రాలు, స్పూన్లు, కన్ఫెక్ష నరీ ప్యాకింగ్‌లు వంటి అనేక వస్తువులు ఈ నిబంధనల పరిధిలోకి వస్తున్నాయి. అయితే రాష్ట్రాల స్థాయిలో ఈనిషేధం అమలులో అసమానతలు ఉండడం, పరిశ్రమల ఒత్తిడి, ప్రజల అలవాట్లలో మార్పు లేకపోవడం వంటి అంశాలు పెద్ద సవాళ్లుగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న పర్యావరణహిత మార్గాలను ప్రజలు స్వీకరించడం అత్యవసరం. బట్ట సంచులు, జ్యూట్ బ్యాగ్‌లు, తాడిపత్రి సంచులు, పేపర్ బ్యాగ్‌లు వంటి పరిష్కారాలు మానవ అవసరాలను తీరుస్తూనే ప్రకృతిని రక్షించే మార్గాల్లో మిళితమవుతున్నాయి. అలాగే బియో డిగ్రేడబుల్ ప్లాస్టిక్‌లు, బంబూ ప్యాకింగ్ వంటి కొత్తపద్ధతులు కూడా ప్రయోగాత్మకంగా ముందుకు వస్తున్నాయి. ఈదిశగా మార్పు రావాలంటే ప్రభుత్వ చర్యలు సరిపోవు. ప్రతిపౌరుడు తన జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు తీసుకురావాలి. షాపింగ్‌కి వెళ్ళేటప్పుడు సొంత సంచి తీసుకెళ్లడం, ప్లాస్టిక్ తీసుకోకుండా తిరస్కరించడం, పిల్లలకు పర్యావరణ అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారాల్లో భాగస్వామ్యం కావడం వంటిచర్యలు పెద్ద మార్పుకునాంది పలుకుతాయి. పరిస్థితిని చూసి భయపడటంకంటే, పరిష్కారాల దిశగా అడుగులు వేయడం మేలైనమార్గం. ఒక బట్టసంచి తీసుకెళ్లడమే కాదు, అది ఒక ప్రకృతి నేస్తానికి అడ్డుగోడగా నిలవడమే. ప్లాస్టిక్‌ను వదలడం కష్టంగా అని పించినా, భవిష్యత్తు తరాల కోసం అది అత్యవసరమార్పు. ఈ మార్పు మన చేతుల్లోనే ఉంది. మన భూమి మన చేతుల్లో ఉంది. దానిని రక్షించడంలో ప్రతిచిన్న చర్యకూ విలువఉంది. ప్లాస్టిక్‌బ్యాగ్‌ను తిరస్కరించడం అంటే భూమిని అంగీకరించడం. మానవతా దృష్టితో భావించి, ప్రకృతిని పరిరక్షించేదే నిజమైన పర్యావరణ భక్తి. ప్లాస్టిక్ బ్యాగ్‌రహిత జీవితం ఒక సవాలుగా కనిపించినా, అది సాధ్యమే. దీని వల్ల మనకు కేవలం పర్యావరణ పరిరక్షణే కాక, భవిష్యత్తు తరాలకు ఒక ఆరోగ్యవంతమైన ప్రపంచాన్ని అందించగలుగుతాం. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్‌రహిత దినోత్సవాన్ని ఒకనాటి కార్యక్రమంగాకాకుండా, రోజువారీ జీవితంలో ఒకఅలవాటుగా మలచుకోవాలి. ఒక్కొక్కరి చర్య ఒక విశ్వ విప్లవానికి నాందికావచ్చు. ●

# ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఏ దేశం ఏం సాధించింది?

మహమ్మద్ ఆరిఫ్

పన్నెండు రోజులుగా కొనసాగిన ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం అమెరికా అధ్యక్షుడి ట్రూత్ మెస్సేజ్ తర్వాత నెమ్మదించింది. కొన్ని ఉల్లంఘనలు జరిగినా.. 2025 జూన్ 24 నుంచి సీజ్ ఫైర్ అమలులోకి వచ్చింది. అప్పుడు ఇరాన్‌లో అణు స్థావరాల ధ్వంసం తనకు దక్కిన గౌరవంగా ట్రంప్ ప్రకటించుకున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేశామని, బాలిస్టిస్ మిసైల్ సామర్థ్యాన్ని ధ్వంసం చేశామని, సైనిక నాయకత్వానికి తీవ్రనష్టం కలిగించామని, ఇది తమ విజయమని ఇజ్రాయెల్ ప్రకటించింది. గట్టిగా పోరాడడం వల్లే ఇజ్రాయెల్, అమెరికా దిగివచ్చాయని, సీజ్ ఫైర్ కోసం అమెరికా తమను బతిమాలిందని ఇరాన్ చెప్పింది. పన్నెండు రోజుల యుద్ధానికి విరామమిచ్చి ఒక వారం గడిచినా యుద్ధంలో ఎవరు ఏం సాధించారో గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇప్పటికీ దేనిపైనాస్పష్టత లేకుండాపోయింది. ఇజ్రాయెల్ ఇరాన్ వార్ మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందేమోననే ఆందోళనలు విశ్వవ్యాప్తంగా నెలకొనగా ట్రంప్ ప్రకటన తర్వాత ఒకటేసారి సీజ్ ఫైర్ నిర్ణయం జరిగింది. అయితే ఇందులో ఇరాన్, అమెరికా చాకచక్యంగా వ్యవహరించినట్టు అర్థమవుతున్నది. బంకర్ బస్టర్ బాంబులతో తమ అణుస్థావరాలపై దాడికి ప్రతిఘటనగా ఖతర్‌లోని అల్ ఉదెద్ ఎయిర్ బేస్‌పై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే దీనికి సంబంధించి ఖతార్, అమెరికాలకు ముందస్తు సమాచారమివ్వడంతో ఆ దేశాలు అప్రమత్తమై నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. ఆ తర్వాత ట్రంప్ ఇరాన్‌కు థాంక్యూ చెబుతూనే యుద్ధ విరమణకు ప్రయత్నాలు చేశారు. ఖతర్ సహకారంతో ఇరాన్ సీజ్ ఫైర్‌కు అంగీకరించేలా చేయగలిగారు. అయితే యుద్ధం వల్ల రోజుకు రూ. వేలకోట్లు ఖర్చు అవుతుండడం, ఆయుధ నిల్వలు తగ్గిపోతుండడం, అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు సీజ్‌ఫైర్‌కు ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. నోబెల్ శాంతి బహుమతి కావాలని ట్రంప్ బలంగా కోరుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ విరమణను ప్రయత్నించి విఫలమయ్యారు. భారత్‌పాకిస్థాన్ యుద్ధం తనవల్లే ఆగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఇరాన్ -ఇజ్రాయెల్ యుద్ధాన్ని తానే ఆపి



నట్లు కనిపిస్తే నోబెల్ శాంతి బహుమతి తనకు వచ్చే అవకాశముందని భావించే ట్రంప్ ఖతార్‌లోని అమెరికాకు చెందిన అల్ ఉదేద్ ఎయిర్ బేస్‌పై దాడి జరిగినా స్పందించకుండా యుద్ధ విరమణ ప్రయత్నాలు చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, ఇరాన్, ఇజ్రాయెల్ సీజ్ ఫైర్‌కు, ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఇప్పటికే జార్జియా రిపబ్లికన్ రిప్రజెంటేటివ్ బడ్డీ కార్టర్ ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించారు. అంతేకాకుండా మిడిల్ ఈస్ట్‌లో అమెరికా యుద్ధాలను గతంలో ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నష్టం చేయడమే తమ లక్ష్యమని, అది పూర్తయిందని ఇప్పటికే ట్రంప్ ప్రకటించడం గమనార్హం. ఈ యుద్ధంలో తమది చారిత్రాత్మక విజయమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ పరమాణు కార్యక్రమం, బాలిస్టిక్ మిస్సైల్ సామర్థ్యాలను గణనీయంగా నాశనం చేశామని ఇజ్రాయెల్ చెబుతున్నది. ఈ దాడులు ఇరాన్‌ను అణ్వాయుధ సామర్థ్యం నుండి సంవత్సరాల వెనక్కి నెట్టిందని వాదిస్తున్నది. 30 మంది ఇరాన్ ఉన్నతస్థాయి మిలటరీ నాయకులను, కీలక అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టామని చెబుతున్నది. అయితే తాము హతమార్చామని ఇజ్రాయెల్ చెబుతున్న ఇద్దరు కీలక వ్యక్తులు మళ్లీ ఇరాన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని కనిపించడం గమనార్హం. మరోవైపు ఈ యుద్ధంలో తామే విజయం సాధించామని ఇరాన్ ప్రకటించుకున్నది. దేశంలో పెద్దఎత్తున విజయోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నది. ఇరాన్ మిస్సైల్స్ ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని, టెల్‌అవీవ్, హైఫా వంటి నగరాల్లో భారీ నష్టాన్ని కలిగించాయని ఇరాన్ చెబుతున్నది. అంతేకాకుండా ప్రపంచానికి పెద్దన్నగా చెప్పుకునే అమెరికాకు సైతం భయపడలేదని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు అమెరికాకు సైతంజవాబు చెప్పామని, ఖతార్ లోని అమెరికా ఎయిర్ బేస్‌పై దాడి చేశామని పేర్కొంటున్నది. తమ పరమాణు కార్యక్రమం కొనసాగుతుందని, ఐఏఈఏ ఒప్పందంనుంచి బయటకు వస్తున్నట్లుఇరాన్ పేర్కొంటుండడం గమనార్హం. అయితే ఎవరి వాదనలు ఎలా ఉన్నా ఈ యుద్ధం మరింత పెరగకుండా మిడిల్ ఈస్ట్‌లో శాంతి నెలకొనేలా చేయడం ప్రపంచ దేశాలను ఊపిరిపీల్చుకునేలా చేసింది. అయితే గాజాలోని పాలస్తీనా పౌరులపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండను ఆపేందుకు నోబెల్ శాంతి బహుమతికి ప్రయత్నిస్తున్న ట్రంప్ సహకరిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ●

# వివక్ష తొలగితేనే మాతృత్వ హక్కులకు రక్షణ

డి జె మోహన రావు

మనదేశంలో ఉద్యోగినుల హక్కుల పరిరక్షణకు, ముఖ్యంగా మాతృత్వపు హక్కుల విషయంలో సుప్రీంకోర్టు మే23, 2025న ఇచ్చిన కె. ఉమాదేవి వెర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో చారిత్రాత్మక తీర్పుతో గణనీయమైన ముందడుగు పడింది. ప్రసూతి సెలవు అనేది కేవలం విధానపరమైన విషయం కాదని, రాజ్యాంగబద్ధమైన హక్కు అని ధృవీకరిస్తూ మద్రాస్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆర్థిక, మాతృత్వ హక్కుల పరిధిని నేరుగా ప్రస్తావించి విస్తరించింది. ఇది మహిళల పునరుత్పత్తి స్వేచ్ఛకు, కార్యాలయ గౌరవానికి పెద్దపీట వేసింది. ఈ కేసు కె. ఉమాదేవి అనే ఉద్యోగిని చుట్టూ తిరిగింది. ఆమె తన రెండవ వివాహం తర్వాత జన్మించిన మూడవ బిడ్డకు ప్రసూతి సెలవు కోరారు. తమిళనాడు ప్రభుత్వం ఆమె అభ్యర్థనను నిరాకరించింది. జనాభా నియంత్రణ లక్ష్యంగా మూడవ బిడ్డ పుట్టడానికి తమిళనాడు ప్రభుత్వ విధానం ప్రసూతి సెలవును అనుమతించడం లేదని మద్రాస్ హైకోర్టు గతంలో ఆ ఉపాధ్యాయురాలి సెలవును తిరస్కరించింది. సుప్రీంకోర్టు తన ఇటీవలి తీర్పులో శ్రీమతి ఉమాదేవికి స్పష్టంగా అనుకూలంగా నిలిచింది. అటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యానాలను కొట్టివేసింది. పిల్లల సంఖ్య లేదా వివాహ పరిస్థితుల ఆధారంగా ప్రసూతి సెలవును నిరాకరించడం లేదా పరిమితం చేయడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. ప్రసూతి ప్రయోజనాలు ఒక మహిళ పునరుత్పత్తి హక్కులలో, ప్రాథమిక గౌరవంలో, రాజ్యాంగంలోని అధికరణ 21 ప్రకారం హామీ ఇవ్వబడిన ఆరోగ్య హక్కులో అంతర్భాగమని నొక్కిచెప్పింది. అటువంటి వివక్షాపూరిత నియమాలు మహిళలపై 'అన్యాయమైన భారాన్ని' సృష్టిస్తాయని, వారి కెరీర్ లేదా కుటుంబం మధ్య ఎంపిక చేసుకోవలసి వస్తుందని, లేదా వారి పునరుత్పత్తి నిర్ణయాలు తీసుకునే హక్కును అణగదొక్కుతాయని తీర్పు నొక్కి చెప్పింది. ప్రసూతి ప్రయోజనాలను కేవలం సేవా నిబంధన నుండి ఒక మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛ ప్రాథమిక అంశంగా ఉన్నతీకరించింది. అధికరణలు 14 (చట్టం ముందు సమానత్వం) 21 (జీవించే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛ)తో దీనిని అనుసంధానించడం ద్వారా కోర్టు మాతృత్వ అర్హతలకు బలమైన రాజ్యాంగ ఆధారాలను అందించింది. ఇప్పటివరకు దేశంలో ప్రసూతి హక్కులు ప్రధానంగా 1961 నాటి ప్రసూతిప్రయోజన చట్టం ద్వారా నిర్వహించబడుతున్నాయి. ఇది మరింత సమగ్ర ప్రయోజనాలను అందించడానికి 2017లో సవరించబడింది. ఇది గర్భధారణ సమయంలో, తరువాత పని చేసే మహిళలకు కొన్ని రక్షణలు, ప్రయోజనాలను నిర్ధారిస్తుంది. ఈ చట్టం వేతనంతో కూడిన సెలవు, తొలగింపు నుండి రక్షణ, ప్రసవానికి సంబంధించిన ఇతర ప్రయోజనాలను అందిస్తుంది. సెలవు తర్వాత వారు అదే లేదా సమానమైన స్థానానికి తిరిగి రావడానికి హామీ ఇస్తుంది. కానీ



ఈ చట్టాలు సాధారణంగా 'ఇద్దరు కంటే తక్కువ మంది జీవించి ఉన్న పిల్లలు' ఉన్న మహిళలకు మాత్రమే ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేస్తున్నాయి. అనేక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సేవలలో సాధారణంగా ఉండే ఈవిధానం వివక్షాపూరితమైనదిగా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. ఈ తీర్పు భారత దేశంలో ఆర్థిక మాతృత్వ హక్కుల స్వరూపంపై లోతైన, తక్షణ ప్రభావాలను చూపుతుంది. 'ఇద్దరు పిల్లల నిబంధన' లేదా ఇలాంటి ఆంక్షల వల్ల గతంలో పరిమితులు ఎదుర్కొన్న ప్రభుత్వ ఉద్యోగినులపై దీని ప్రభావం చాలా ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ తీర్పు ఇప్పుడు వారికి జీవించి ఉన్న పిల్లల సంఖ్య లేదా వైవాహిక సందర్భంతో సంబంధం లేకుండా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అనుమతిస్తుంది. వారి జీవితంలో కీలకమైన సమయంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ నిర్దిష్ట కేసు ప్రభుత్వ ఉద్యోగినికి సంబంధించినది అయినప్పటికీ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన బలమైన రాజ్యాంగ సూత్రాలు ఇతర రంగాలలో, ప్రైవేట్ రంగంతో సహా ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను సవాలు చేయడానికి గణనీయంగా ఉపయోగపడతాయి. పిల్లల సంఖ్య ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేయడానికి ప్రయత్నించే ఏ సంస్థ అయినా ఇప్పుడు చట్టపరమైన సవాలును ఎదుర్కొంటుంది. కుటుంబ పరిమాణం ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను నిరాకరించడం అనేది తరచుగా మహిళలను, ముఖ్యంగా పునర్వివాహం చేసుకున్న లేదా వివిధ కారణాల వల్ల ఎక్కువమంది పిల్లలను కలిగి ఉన్న వారిని అసమానంగా ప్రభావితం చేస్తుంది. ఈ తీర్పు ఒక కీలకమైన అడ్డంకిని తొలగించి ఉద్యోగంలో ఎక్కువ లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. తల్లులుగా తమ పాత్రలను నిర్వర్తించినందుకు మహిళలు శిక్షించబడకుండా చూస్తుంది. ఈ తీర్పు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, అలాగే ప్రైవేట్ సంస్థలకు, సుప్రీంకోర్టు తీసుకున్న ప్రగతిశీల వైఖరికి అనుగుణంగా వారి ప్రస్తుత ప్రసూతి సెలవు విధానాలను సమీక్షించి, సవరించాల్సిన అవసరాన్ని ప్రభావ వంతంగా సూచిస్తుంది. పిల్లలసంఖ్య ఆధారంగా వివక్షచూపించే విధానాలు ఇప్పుడు రాజ్యాంగపరంగా దుర్బలమైనవి. అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలకు ఆర్థిక మాతృత్వ హక్కుల విస్తృత సమస్య ఇప్పటికీ ఉంది. వేతన చెల్లింపు ప్రసూతి సెలవు, వైద్య బోనస్‌లు లేదా క్రెచె సౌకర్యాలు వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలకు ప్రాప్యతలేదు. గర్భధారణ సమయంలో వారి దుర్బలత్వం తరచుగా వారిని ముందస్తుగా పనికి తిరిగి రావడానికి లేదా మరింత పేదరికంలోకి నెట్టడానికి బలవంతం చేస్తుంది. తదుపరి కీలకమైన చర్య ఏమిటంటే ఈ ప్రగతిశీల తీర్పు స్ఫూర్తిని ఉపయోగించుకుని మరింత సమ్మిళిత, సార్వత్రిక, సామాజిక భద్రతా చట్రాలను రూపొందించి తద్వారా ఆర్థిక మాతృత్వ సహాయాన్ని సంఘటిత రంగంతోపాటుగా అసంఘటితరంగానికి విస్తరించాలి. మే 23, 2025 నాటి ఈతీర్పుమహిళల హక్కులను మాతృత్వం ఉద్యోగానికి అడ్డంకి కాకూడదని, ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదని ధృవీకరిస్తుంది. ఇది ఆశకు ఒకమార్గదర్శిగా పనిచేస్తుంది. ప్రసూతి ప్రయోజనాల రక్షణ గొడుగును విస్తరిస్తుంది. ప్రతి తల్లి, ఆమెపనిరంగంతో సంబంధం లేకుండా, గౌరవంతో, ఆర్థిక భద్రతతో మాతృత్వాన్ని స్వీకరించగలదని నిర్ధారిస్తుంది. ఈ తీర్పు రాజ్యాంగపరమైన ప్రోత్సాహన్నిఅందిస్తుంది. ఇప్పుడు, శాసన, విధానపరమైన విభాగాలు దేశంలోని ప్రతిమహిళకు సమగ్ర ఆర్థికమాతృత్వ హక్కులను వాస్తవం చేయడానికి అనుసరించాలి. ●

# ఒకేసారి ఫెయిలైన రెండు ఇంజిన్లు

## అమ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదంపై దర్యాప్తు బృందం



**న్యూఢిల్లీ,జులై 2:** దేశవ్యాప్తంగా పెను విషాదాన్ని మిగిల్చిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. 241 మంది ప్రాణాలను బలిగొన్న ఈ దుర్ఘటనకు రెండు ఇంజిన్లు ఏకకాలంలో విఫలం కావడమే ప్రధాన కారణమా అనే కోణంలో అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) నేతృత్వంలో విచారణ కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా ఎయిర్ ఇండియా పైలట్లు, ఫ్లైట్ సిమ్యులేటర్‌లో ప్రమాదానికి గురైన విమాన పరిస్థితులను పునఃసృష్టించి పరీక్షించారు. ల్యాండింగ్ గేర్ తెరిచి ఉంచి, రెక్కల ఫ్లాప్స్‌ను ముడిచిన స్థితిలో విమానాన్ని నడిపి చూశారు. అయితే, కేవలం ఈ పరిస్థితుల వల్ల విమానం కూలిపోలేదని వారి సిమ్యులేషన్ పరీక్షల్లో తేలింది. దీంతో ప్రమాదానికి మరేదో బలమైన సాంకేతిక కారణం ఉండి ఉంటుందన్న వాదనకు బలం చేకూరినట్లయింది. ముఖ్యంగా, రెండు ఇంజిన్లు ఒకేసారి శక్తిని కోల్పోయి ఉండవచ్చని దర్యాప్తుతో సంబంధం ఉన్న వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ అనుమానాలకు మరిన్ని ఆధారాలు కూడా బలం చేకూరుస్తున్నాయి. విమానం నేలను ఢీకొట్టడానికి కొన్ని క్షణాల ముందు, అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్‌ను అందించే రామ్ ఎయిర్ టర్బైన్స్ (ఆర్ఏటీ) యాక్టివేట్ అయినట్లు గతంలోనే గుర్తించారు. విమానంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయినప్పుడు మాత్రమే ఈ టర్బైన్ పనిచేస్తుంది. ఇది ఇంజిన్లలో తీవ్రమైన సమస్య తలెత్తిందనడానికి స్పష్టమైన సంకేతమని నిపుణులు భావిస్తున్నారు. ప్రమాదానికి ముందు తీసిన వీడియో ఫుటేజీని పరిశీలించగా, టేకాఫ్ అయిన తర్వాత విమానం గాల్లోకి లేవడానికి తీవ్రంగా ఇబ్బంది పడినట్లు స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత నెమ్మదిగా కిందకు దిగివచ్చి నేలను ఢీకొని పేలిపోయింది. విమాన శిథిలాలను పరిశీలించినప్పుడు ల్యాండింగ్ గేర్ చక్రాలు పాక్షికంగా లోపలికి ముడుచుకుని ఉన్నట్లు తేలింది. దీన్ని బట్టి పైలట్లు చక్రాలను లోపలికి తీసుకునే ప్రక్రియను ప్రారంభించారని తెలుస్తోంది. కానీ, ల్యాండింగ్ గేర్ డోర్లు తెరుచుకోలేదు. ఇది విమానంలో పవర్ లేదా హైడ్రాలిక్ వ్యవస్థ ఫెయిల్ అయిందనడానికి మరో నిదర్శనమని పైలట్లు అభిప్రాయపడుతున్నారు. విమానానికి విద్యుత్‌ను, హైడ్రాలిక్ శక్తిని అందించేది ఇంజిన్లే కావడంతో అనుమానాలన్నీ వాటి వైఫల్యం చుట్టూనే తిరుగుతున్నాయి.

బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీకి చెందిన రెండు ఇంజిన్లు ఉన్నాయి. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్లు 'మేడే'అంటూ ఆపద సంకేతాలు పంపారు. ఈ సిగ్నల్ పంపిన కేవలం 15 సెకన్ల వ్యవధిలోనే విమానం కూలిపోయిందని దర్యాప్తు వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఘటనపై వ్యాఖ్యానించేందుకు బోయింగ్, జనరల్ ఎలక్ట్రిక్ సంస్థలు నిరాకరించాయి. ఎయిర్ ఇండియా, ఏఏఐబీ నుంచి కూడా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఫ్లైట్ రికార్డర్ల (బ్లాక్ బాక్సులు) నుంచి సేకరించిన డేటాను విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణ పూర్తయితే ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలిసే అవకాశం ఉంది. దశాబ్దాల తర్వాత భారత ఏవియేషన్ చరిత్రలో ఇదే అతిపెద్ద ప్రమాదం కాగా, బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ప్రమాదానికి గురై పూర్తిగా ధ్వంసం కావడం కూడా ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) బృందం కూడా ఈ దర్యాప్తులో భారత అధికారులకు సహకారం అందిస్తోంది.



### బంగ్లా మాజీ అధ్యక్షురాలు

# హసీనాకు జైలు శిక్ష

**ఢాకా,జులై 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసిటి), బుధవారం ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే మొదటిసారి. జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్ నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్‌కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండునెలల జైలుశిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. షేక్ హసీనా ప్రస్తుతం కేవలం కోర్టుధిక్కరణ కేసులోనే కాకుండా, అంతకంటే తీవ్రమైన ఆరోపణలను కూడా ఎదుర్కొంటున్నారు. గత ఏడాది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనల సమయంలో అమానవీయ రీతిలో నేరాలకు పాల్పడ్డారంటూ ఆమెపై అధికారికంగా అభియోగాలు నమోదయ్యాయి. నిరసనకారులపై షేక్ హసీనా పద్ధతి ప్రకారం దాడులు చేయించారని ఐసిటి చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు.


ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదిక ప్రకారం, 2024 జులై 15నుంచి ఆగస్టు 15 మధ్య జరిగిన ఆ హింసాత్మక ఘటనల్లో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, తనపై మోపిన అన్ని ఆరోపణలను హసీనా మొదటి నుంచి ఖండిస్తూ వస్తున్నారు. ఈ ఆరోపణలపై వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాది అమీర్ హుస్సేన్ మీడియాకు తెలిపారు. 2024 ఆగస్టులో దేశవ్యాప్త ఆందోళనలతో అవామీ లీగ్ ప్రభుత్వం అనూహ్యంగా కూలిపోవడంతో షేక్ హసీనా బంగ్లాదేశ్ విడిచిపెట్టి భారతదేశానికి చేరుకున్నట్టు కథనాలు వచ్చాయి.

## వర్జిన్ ఎయిర్‌లైన్స్ విమానంలో పాము

### రెండుగంటలపాటు ఆలస్యం

**మెల్‌బోర్న్,జులై 2:** ఆస్ట్రేలియాలో ఓ విమానంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. విమానం కార్గో హోల్డ్‌లో ఒక పాము ప్రత్యక్షం కావడంతో కలకలం రేగింది. దీంతో విమానం దాదాపు రెండు గంటలపాటు ఆలస్యంగా బయలుదేరింది. ఈ సంఘటన మంగళవారం మెల్‌బోర్న్ విమానాశ్రయంలో జరిగింది. వర్జిన్ ఆస్ట్రేలియాకు చెందిన వీఏ337 విమానం మెల్‌బోర్న్ నుంచి బ్రిస్బేన్ వెళ్లేందుకు సిద్ధమైంది. ప్రయాణికులు విమానంలోకి ఎక్కుతుండగా సిబ్బంది కార్గో హోల్డ్‌లో పామును గుర్తించి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు, పాములు పట్టడంలో నిపుణుడైన మార్క్ పెల్లీకి సమాచారం అందించారు. విమానాశ్రయానికి చేరుకున్న పెల్లీ, కార్గో హోల్డ్‌లోకి ప్రవేశించారు. అక్కడ ప్యానెల్ వెనుక సగం దాక్కుని ఉన్న పామును చూశారు. ఆ చీకటిలో అది విషపూరితమైన పాము అయి ఉంటుందని తాను మొదట భావించినట్టు పెల్లీ తెలిపారు. ఒకే ప్రయత్నంలో నేను దీన్ని పట్టుకోలేకపోతే, అది ప్యానెళ్ల లోపలికి జారుకుంటుంది. అప్పుడు మనం విమానాన్ని మొత్తం ఖాళీ చేయించి, దాన్ని వెతకాల్సి ఉంటుందని ఆయన విమాన సిబ్బందిని, ఇంజనీర్లను హెచ్చరించినట్టు వివరించారు. ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన పెల్లీ, మొదటి ప్రయత్నంలోనే ఆ పామును పట్టుకున్నారు. అదృష్టవశాత్తు నేను దాన్ని ఒకే ప్రయత్నంలో పట్టుకున్నాను. లేదంటే ఈ పాటికి మేమంతా బోయింగ్ 737 విమానాన్ని పూర్తిగా తనిఖీ చేయవలసి వచ్చేది అని ఆయన అన్నారు. పామును పట్టుకున్న తర్వాత అది హాని చేయని, 60 సెంటీమీటర్ల పొడవున్న 'గ్రీన్ ట్రీ స్నేక్' అని గుర్తించారు. ఈ పాము బ్రిస్బేన్ ప్రాంతానికి చెందినది కావడంతో, అక్కడి నుంచి మెల్‌బోర్న్‌కు వచ్చిన విమానంలో ప్రయాణికుల లగేజీ ద్వారా ఇది లోపలికి ప్రవేశించి ఉంటుందని పెల్లీ అనుమానం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం, ఈ పామును తిరిగి అడవిలో వదిలిపెట్టే అవకాశం లేదు. ఇది రక్షిత జాతికి చెందిన పాము కావడంతో, లైసెన్స్ ఉన్న సంరక్షకుడికి అప్పగించేందుకు దాన్ని ఒక జంతు వైద్యుడికి అందజేశారు.

## 80వ యేట 10వేల అడుగులఎత్తునుంచి స్కైడైవింగ్



**చండీగఢ్,జులై 2:** సాహస కృత్యాలకు వయసు అనేది అడ్డుకానేకాకూడదని హర్యానా డాక్టర్ శ్రద్ధా చౌహాన్ నిరూపించారు. తన 80వ పుట్టిన రోజు సందర్భంగా 10,000 అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమెచిరకాలకలను సాకారం చేయడంలో ఆమె కుమారుడు, రిటైర్డ్ బ్రిగేడియర్ సౌరభ్ సింగ్ షెకావత్ కీలకపాత్ర పోషించారు. గతేడాది కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ స్కైడైవింగ్ చేయడం చూసినప్పుడు శ్రద్ధా చౌహాన్‌కు ఈ ఆలోచన వచ్చింది. తాను కూడా చేయగలనా అని కుమారుడిని అడిగారు. అయితే,ఆమె భర్త, మరో కుమారుడు ఈ వయసులో ప్రమాదకరమని వద్దన్నారు. కానీ శ్రద్ధా చౌహాన్ మాత్రం తన నిర్ణయానికే కట్టుబడ్డారు. ఈ ఆలోచన వచ్చాక కచ్చితంగా చేయాలని నిర్ణయించుకున్నా. నిపుణుడైన నాకొడుకు, దేవుడు నాతో ఉన్నప్పుడు అంతా మంచే జరుగుతుందని చెప్పానని ఆమె గుర్తుచేసుకున్నారు. హర్యానాలోని నార్నౌల్ ఎయిర్‌స్ట్రిప్‌లో ఉన్న స్కైహై ఇండియాలో ఆమె ఈ ఫీట్ పూర్తిచేశారు. వెర్టిగో, మెడనొప్పి, వెన్నుపూస సమస్యలు ఉన్నప్పటికీ, రోజూ యోగా, ప్రాణాయామం చేస్తూ శారీరకంగా దృఢంగా ఉంటానని శ్రద్ధా చౌహాన్ తెలిపారు. స్కైడైవింగ్ అనుభవం గురించి మాట్లాడుతూ, గాలి వేగంగా వీచినప్పుడు నేను ఏమీ ఆలోచించలేని స్థితిలోకి వెళ్లాను. అయితే భయం మాత్రం కలగలేదని ఆమె వివరించారు. స్కైడైవింగ్ అనంతరం శ్రద్ధా చౌహాన్ భావోద్వేగానికి గురయ్యారు. "ఆకాశంలో విమానంలా ఎగరాలన్న నా కోరికను ఈ రోజు నా కొడుకు తీర్చాడు. ఇది చాలా గర్వించదగ్గ క్షణంఅని ఆమె అన్నారు. ఈ సాహసంతో, స్కైడైవింగ్ పూర్తి చేసిన అత్యంత పెద్ద వయస్కురాలైన భారతీయ మహిళగా డాక్టర్ శ్రద్ధా చౌహాన్ రికార్డు సృష్టించారు

## థాయిలాండ్‌లో ఒక్కరోజు ప్రధానిగా రవాణా మంత్రి!



**బ్యాంకాక్,జులై 2:** థాయ్‌లాండ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. దేశ ప్రధానిని రాజ్యాంగ న్యాయస్థానం సస్పెండ్ చేయడంతో, ఆమె స్థానంలో కేవలం ఒక్క రోజు పదవిలో ఉండేలా మరో నేత తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రవాణా శాఖ మంత్రిగా ఉన్న సూర్య జుంగ్‌రంగ్‌రింగ్‌కిట్ బుధవారం ఒక్క రోజుకు తాత్కాలిక ప్రధానిగా వ్యవహరించనున్నారు. ప్రధాని పేతోంగ్టార్న్ షినవత్రాపై కోర్టు వేటు వేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయితే, గురువారం జరగనున్న క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణతో సూర్య స్థానంలో మరొకరు తాత్కాలిక ప్రధానిగా రానుండటం గమనార్హం. ప్రధాని పేతోంగ్టార్న్ షినవత్రా (38) ఓ ఫోన్ కాల్ సంభాషణలో దేశ సైన్యాన్ని విమర్శించారని, సరిహద్దు వివాదంలో కంబోడియాకు అనుకూలంగా మాట్లాడారని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ ఫోన్ కాల్ లీక్ కావడంతో దేశవ్యాప్తంగా దుమారం రేగింది. ఇది రాజ్యాంగంలోని ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని ఫిర్యాదులు అందడంతో, రాజ్యాంగ న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ ఆరోపణల్లో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించిన కోర్టు, విచారణ పూర్తయ్యేవరకు పేతోంగ్టార్న్‌ను ప్రధాని పదవి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు ఆమెకు 15 రోజుల గడువు ఇచ్చింది.

మంగళవారం పేతోంగ్టార్న్ సస్పెన్షన్‌కు గురైన వెంటనే, వారసత్వ క్రమంలో ఉప ప్రధానిగా ఉన్న సూర్య జుంగ్‌రంగ్‌రింగ్‌కిట్ (70) చేతికి అధికార పగ్గాలు వచ్చాయి. ఆయన బుధవారం ఉదయం బ్యాంకాక్‌లో ప్రధాని కార్యాలయం 93వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం ద్వారా తన బాధ్యతలను ప్రారంభించారు. అయితే, ఆయన పదవీకాలం కేవలం ఒక్క రోజుకే పరిమితం కానుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గురువారం క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ జరగనుంది.

## ట్రంప్‌రాకతో పూర్తిగా తగ్గిన అక్రమవలసలు

**వాషింగ్టన్,జులై 2:** అధ్యక్షుడుగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అమెరికాలో అక్రమ వలసలు పూర్తిస్థాయిలో కట్టడి చేస్తున్నారు. దీనితో అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించే భారతీయుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి అక్రమ వలసలు దాదాపు 70 శాతం తగ్గినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ హయాంలో సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేయడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే, ఈ ప్రమాదకర ప్రయాణాల్లో విషాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్య కాలంలో అమెరికా సరిహద్దుల్లో 10,382 మంది భారతీయులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తల్లిదండ్రుల తోడు లేని 30 మంది మైనర్లు కూడా ఉన్నారు. గత ఏడాది ఇదేసమయంలో పట్టుబడిన భారతీయుల సంఖ్య 34,535గా ఉండగా, ఈఏడాది ఆసంఖ్య భారీగా తగ్గింది. ఒకప్పుడు బైడెన్ హయాంలో రోజుకు సగటున 230 మంది భారతీయులు పట్టుబడితే, ప్రస్తుతం ఆ సంఖ్య 69కి పడిపోయింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మార్పులు ఖాయమని తేలడంతో మానవ అక్రమ రవాణా ముఠాలు కూడా తమ కార్యకలాపాలను తగ్గించినట్లు ఒక ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. ఈ అక్రమ వలసల ప్రయాణం ప్రాణాలకే ముప్పుగా మారుతోంది. మే 9న కాలిఫోర్నియాలోని డెల్ మార్ తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో 14 ఏళ్ల బాలుడు, 10 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ భారత్‌కు చెందిన అన్నాచెల్లెళ్లుగా గుర్తించారు. మెక్సికో తీరం నుంచి చిన్న పడవల ద్వారా అమెరికా జలాల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఇలా తల్లిదండ్రుల నుంచి వేరైన 500 మంది మైనర్లను అధికారులు రక్షించారు. వీరిలో ఎక్కువగా 12 నుంచి 17 ఏళ్ల వయసు వారే ఉంటున్నారు. ట్రంప్ ప్రభుత్వం ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) ఏప్రిల్ 2024నాటి లెక్కల ప్రకారం, అమెరికాలో ఎలాంటి అధికారికపత్రాలు లేకుండా సుమారు 2.2లక్షలమంది భారతీయులు నివసిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 332 మందిని అధికారులు గుర్తించి తిరిగి భారత్‌కు పంపించారు.

## మైనర్ విద్యార్థిపై టీచర్ లైంగిక వేధింపులు



**ముంబయి,జులై 2:** దేశ ఆర్థిక రాజధానిలో ఓ మహిళా ఉపాధ్యాయురాలు మైనర్ విద్యార్థిపై లైంగిక వేధింపులకు పాల్పడింది. నలభై ఏళ్ల వయసున్న ఆ టీచర్ పదహారేళ్ల బాలుడిపై ఈ అమానుషానికి పాల్పడింది. బాలుడి స్నేహితురాలితో రాయబారం నడిపి, తనతో సన్నిహితంగా మెలిగేలా ప్రోత్సహించింది. ఈ ఘటన తర్వాత బాలుడు యాంగ్జైటీతో బాధపడగా ఉపాధ్యాయురాలు తనకొచ్చిన సొంత వైద్యం చేసింది. యాంగ్జైటీ తగ్గేందుకు టాబ్లెట్లు ఇచ్చింది. బాలుడి ప్రవర్తనలో మార్పుగమనించి కుటుంబ సభ్యులు కొన్ని రోజులు గడిస్తే చదువు పూర్తవుతుంది, టీచర్ వేధింపులు తప్పుతాయని ఆలోచనతో విషయాన్ని బయటపెట్టలేదు. స్టడీ పూర్తిచేసుకుని ఆ స్కూలు నుంచి బయటకు వచ్చేసినా ఆ టీచర్ వేధింపులు ఆగకపోవడం, ఇంట్లో పని మనిషితో రాయబారం పంపడంతో బాధితుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఆ టీచర్‌కు వివాహం జరిగిందని, పిల్లలు కూడా ఉన్నారని బాలుడి పేరెంట్స్ చెప్పారు. వారి ఫిర్యాదుతో పోలీసులు సదరు టీచర్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితుడు పదకొండో తరగతి చదువుతున్నప్పటి నుంచే ఉపాధ్యాయురాలి వేధింపులు మొదలయ్యాయని పోలీసులు తెలిపారు. అప్పటి నుంచే బాలుడితో అసభ్యకరంగా ప్రవర్తించేదని, పలు సందర్భాల్లో లైంగిక సంబంధం కోసం సైగలు చేసిందని వివరించారు.

12వ తరగతిలోకి వచ్చాక బాలుడు తనను దూరం పెడుతుండడంతో ఉపాధ్యాయురాలు మరో పన్నాగం పన్నిందన్నారు. తనతో సన్నిహితంగా మెలగాలని బాలుడి స్నేహితురాలితో చెప్పించిందని తెలిపారు.పెద్ద వయసు మహిళలతో బాలుర రిలేషన్‌షిప్ ఇటీవలి కాలంలో సాధారణంగా మారిందని, మీరిద్దరూ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని బాలుడి స్నేహితురాలు ప్రోత్సహించింది. దీంతో బాలుడు కూడా టీచర్‌కు దగ్గరయ్యాడని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి టీచర్‌తో పాటు ఆమెకు సహకరించిన బాలుడి స్నేహితురాలిపైనా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## దేశ ప్రజలకు కాంగ్రెస్ డయల్ - అప్ సౌకర్యం కూడా అందించలేకపోయింది

### కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య

**న్యూఢిల్లీ, జులై2:** ప్రధాని మోడీ హయాంలో డిజిటల్ ఇండియా అంటే నెరవేర్చని హామీలేనని కాంగ్రెస్ చేసిన విమర్శలకు కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తిప్పికొట్టారు. భారత్‌లో 'బఫరింగ్ యుగం' కాంగ్రెస్‌తోనే ముగిసిపోయిందని, ప్రధాని మోడీ పాలనలో దేశం 5జి వేగంతో వెళుతోందని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి జ్ఞానోదయం కలిగించే మరో అవకాశం తమకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేతలు తమను ప్రశ్నించిన ప్రతిసారీ తగిన ఆధారాలతో జవాబు చెప్పామని పేర్కొన్నారు. దేశ ప్రజలకు కాంగ్రెస్ డయల్ - అప్ సౌకర్యం కూడా అందించలేకపోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం ప్రపంచస్థాయి టెలికాం నెట్‌వర్క్, యుపిఐ, భారత్ నెట్ వంటి సేవలను దేశ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. దాదాపు 18 ఏళ్ల తర్వాత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వరుసగా లాభాలు ఆర్జించడం, రెండు లక్షలకుపైగా గ్రామ పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానించడం వంటి విషయాలను సింధియా ఉదహరించారు. యుపిఐ వంటి వేదికల వల్ల ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగం మనదేశంలోనే జరుగుతున్నాయని, వ్యాపారాల్లో దళారుల ప్రమేయాన్ని తొలగించి ప్రత్యక్ష నగదు బదిలీ చేయడం వల్ల రూ.3.48 లక్షల కోట్ల డబ్బు ఆదా అవుతోందని అన్నారు.

## ఆయనకు మద్దతివ్వడం తప్ప వేరే దారిలేదు!

### కర్ణాటక రాజకీయాలపై డి.సిఎం డికెశివకుమార్

**బెంగళూరు,జులై 2:** కర్ణాటక రాజకీయాల్లో గత కొద్ది రోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన నాయకత్వ మార్పు అంశానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా తెరదించారు. ఐదేళ్ల పూర్తి కాలం తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ఆయన బుధవారం స్పష్టంగా ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు ఖాయమంటూ సాగుతున్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పడినట్లయింది. బుధవారం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య, ముఖ్యమంత్రి మార్పు గురించి వస్తున్న వార్తలపై స్పందించారు. ఐదేళ్ల పాటు నేనే ముఖ్యమంత్రిగా ఉంటాను. ఈ విషయంలో మీకెందుకు అనుమానాలు వస్తున్నాయని ఆయన ఎదురు ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని మారుస్తారంటూ బిజెపి, జెడిఎస్ వంటి ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వారు కాంగ్రెస్ అధిష్ఠానమా? మా పార్టీ అంతర్గత విషయాల గురించి మాట్లాడటానికి వాళ్లెవరని ఆయన కొట్టిపారేశారు. ఈ పరిణామాలపై ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ కూడా స్పందించారు.

## ఢిల్లీ సిఎం నివాస ఆధునీకరణకు రూ.60 లక్షలు!

### శీష్‌మహాల్ అని విమర్శించిన సిఎం ఇపుడేంచేస్తున్నారని ఆప్ ధ్వజం



**న్యూఢిల్లీ,జులై 2:** ఆప్ హయాంలో ఆనాటి సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసం శీష్ మహల్‌పై తీవ్ర విమర్శలు చేసిన ఢిల్లీ కొత్త సీఎం రేఖాగుప్తా, ఇప్పుడు తన అధికారిక నివాసం కోసం భారీగా ఖర్చు చేయడం చర్చనీయాంశమైంది. ఆమె నివాసం ఉండబోయే రాజ్ నివాస్ మార్గ్ లోని ఒకటో నంబర్ బంగ్లా నవీకరణ పనుల కోసం ప్రభుత్వం రూ. 60 లక్షలు కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ పనుల విభాగం (పీడబ్ల్యూడీ) టెండర్ నోటీసు జారీ చేసింది. పీడబ్ల్యూడీ గతనెల 28న జారీ చేసిన టెండర్ ప్రకారం ఈ నిధులను ప్రధానంగా ఎలక్ట్రికల్ పనుల ఆధునికీకరణ కోసం వినియోగించనున్నారు. ఇందులో భాగంగా రూ. 9.3 లక్షలతో ఐదు టీవీలు, రూ. 7.7 లక్షలతో 14 ఏసీలు, రూ. 5.74 లక్షలతో 14 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు రూ. 2 లక్షలతో నిరంతర విద్యుత్ సరఫరా కోసం యూపీఎస్ వ్యవస్థను కూడా అమర్చనున్నారు. ఇవే కాకుండా రిమోట్ కంట్రోల్‌తో పనిచేసే 23 సీలింగ్ ఫ్యాన్ల కోసం రూ. 1.8 లక్షలు, ఒక ఓవెన్ టోస్ట్ గ్రిల్ కోసం రూ. 85,000, ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ కోసం రూ. 77,000, డిష్‌వాషర్ కోసం రూ. 60,000, గ్యాస్ స్టవ్ కోసం రూ. 63,000, మైక్రోవేవ్‌ల కోసం రూ. 32,000, ఆరు గీజర్ల కోసం రూ. 91,000 ఖర్చు చేయనున్నట్లు టెండర్‌లో వివరించారు.

అదనంగా రూ. 6 లక్షలకు పైగా ఖర్చుతో 115 దీపాలు, వాల్‌లైటర్లు, హ్యాంగింగ్ లైట్లు, మూడు పెద్ద షాండ్లియర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సిఎం రేఖా గుప్తాకు ఒకటి, రెండు నంబర్ల బంగ్లాలను కేటాయించింది. రాజ్ నివాస్ మార్గ్‌లోని ఒకటో నంబర్ బంగ్లాను ఆమె నివాసం కోసం, రెండో నంబర్ బంగ్లాను క్యాంపు కార్యాలయం కోసం వినియోగించనున్నారు. ఈ నెల 4న టెండర్ల బిడ్లు తెరుస్తామని, 60 రోజుల్లోపు పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రేఖా గుప్తా తన సొంత నివాసమైన షాలిమార్ బాగ్‌లోనే ఉంటున్నారు. ఫిబ్రవరిలో సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో కేజ్రీవాల్ నివాసం ఉన్న 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని వివాదాస్పద బంగ్లాలో తాను నివసించనని రేఖా గుప్తా స్పష్టం చేశారు.

బిజెపి షీష్‌మహల్ అని పిలిచిన ఆ బంగ్లాను మ్యూజియంగా మారుస్తామని ఆమె ప్రకటించారు. మేం షీష్ మహల్‌ను మ్యూజి యంగా మారుస్తాం.

ప్రధాని మోడీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. నన్ను ఈ పదవికి ఎంపిక చేసి నందుకు ఆయనకు ధన్యవాదాలని ఆమె ఆనాడు వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ తన అధికారిక నివాసంపై భారీగా ఖర్చు చేశారని బిజెపి తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఆ రాజకీయ ఒత్తిడి నేపథ్యంలోనే కేజ్రీవాల్ ఆ బంగ్లాను ఖాళీ చేశారు.

## కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధమే..

### హమాస్ అధికారి తాహెర్ అల్ - నును



**హమాస్, జులై 2:** గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ చేయడానికి అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై హమాస్ స్పందిస్తూ తాము కూడా కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధమే అని పేర్కొంది. కానీ 60 రోజుల కాల్పుల విరమణ కాకుండా యుద్ధానికి శాశ్వత ముగింపు పలికితేనే వారి ఒప్పందాలకు అంగీకారం తెలుపుతామని హమాస్ అధికారి తాహెర్ అల్ - నును స్పష్టం చేశారు. యుద్ధాన్ని పూర్తిగా ముగించడానికి ఇజ్రాయెల్‌తో ఉపయోగపడేఎటువంటి ఒప్పందం అయినా చేసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. గాజా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా వెనక్కు వెళితే దానికి బదులుగా మిగిలిన 50 మంది బందీలను విడుదల చేస్తామన్నారు. ఈ ప్రతిపాదనపై చర్చించడానికి హమాస్ ప్రతినిధి బృందం బుధవారం కైరోలో ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తులతో సమావేశం కానుందని ఈజిప్టుకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. అయితే హమాస్ లొంగిపోతేనే యుద్ధాన్ని ముగించడానికి అంగీకరిస్తామని ఇజ్రాయెల్ పేర్కొంటోంది. ట్రంప్ ప్రకటించిన తాజా ప్రతిపాదన ప్రకారం 60 రోజుల ఒప్పందం కుదిరిందని, ఇందులో గాజా నుంచి ఇజ్రాయెల్ దళాలను పాక్షికంగా ఉపసంహరించుకోవడం, పాలస్తీనియన్లకు మానవతా సహాయం పెంచడం వంటి చర్యలు తీసుకోనున్నామని ఇజ్రాయెల్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ విషయంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ చేయడానికి అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే షరతులు ఎలాంటివనేది మాత్రం పేర్కొనలేదు. గాజాకు సంబంధించి ఇజ్రాయెల్‌తో తమ ప్రతినిధులు సుదీర్ఘ, ఫలవంతమైన చర్చలు జరిపారని అన్నారు. ఈ ప్రాంతంలో శాంతికోసం కృషి చేస్తున్న ఖతార్, ఈజిప్టులు తుది ప్రతిపాదన చేస్తాయని, ఇది మధ్య ప్రాచ్యానికి మంచిదని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మోసపూరిత మేనిఫెస్టోతోనే అధికారంలోకి చంద్రబాబు!

## - జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి

**ఉరవకొండ, జూలై 2 ప్రభాతవార్త** 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ప్రకటించి ప్రచారం చేసుకున్న మోసపూరిత మ్యానిఫెస్టోతోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌రెడ్డి అన్నారు. జనం చంద్రబాబు కల్లబొల్లి మాటలు నమ్మి ఓట్లు వేసి మోసపోయి ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. ఉరవకొండ పట్టణంలోని వీరశైవ కళ్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్‌సీపీ, అనుబంధ విభాగాల బాధ్యుల అభినందన సభ, నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన అట్టహాసంగా జరుగగా ఆయనతోపాటు అనంతపురం పార్లమెంటు పరిశీలకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఎస్.వి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుది మోసపూరిత మ్యానిఫెస్టో అని ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని నాడే వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చెబితే జగన్‌కు సంపద సృష్టి తెలియదని తాను సంపదను సృష్టించి హామీలన్నింటినీ అమలు చేస్తానని చంద్రబాబు నిసిగ్గుగా చెప్పారన్నారు. అధికారంలోకివచ్చి ఏడాది పూర్తి కాగా చంద్రబాబు ఎంత సంపద సృష్టించారో ప్రజలకు తెలియజేయాలన్నారు. కేవలం ఒక్క ఏడాదిలోనే తాము చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు చెబుతున్నారన్నారు. నాడు హామీలు అమలు చేయకుంటే కాలర్ పట్టుకొని ప్రశ్నించమన్న చంద్రబాబు నేడు సూపర్ సిక్స్ అమలు చేయలేదని ఎవరైనా అంటే వారి నాలుక మందమని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ చేసిన పోరాట ఫలితంగానే విధిలేని పరిస్థితుల్లో తల్లికి వందనం అమలు చేస్తున్నారని అయితే రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులకు 12వేల కోట్లు అవసరంకాగా 8వేల కోట్లతో 67 లక్షల మందికి మాత్రమే ఇస్తున్నారన్నారు. రీ కాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**జగన్‌ను చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోంది:**

ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అడుగు బటయపెట్టారంటేచాలు కూటమి ప్రభుత్వం భయపడుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టకుండా కక్షలను ప్రేరేపిస్తూ అలజడిని సృష్టిస్తున్నారన్నారు. పోరాటాల పార్టీ వైఎస్సార్‌సీపీ అని పార్టీను, జగన్‌ను భయపెట్టడం ఎవ్వరి తరం కాదన్నారు. అనుబంధ సంఘాలు ఆయా సమస్యలపై ప్రజల పక్షాణ పోరాటాలు చేయాలన్నారు.

**మోసం, కుట్రలే చంద్రబాబు నైజం:**

చంద్రబాబు నైజమే మోసం, కుట్రలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులుపెట్టి అరెస్టులు చేస్తే ఎవరూ భయపడవద్దని పార్టీ అండగా ఉంటుందని అవసరమైతే పోలీసులపై ప్రైవేటు కేసులు పెడదామన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 2వేల మందికి పార్టీ, అనుబంధ సంఘాల్లో బాధ్యులుగా అధినేత నియమించారని బూత్‌స్థాయి నుండి పార్టీను బలోపేతం చేద్దామన్నారు. దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి చలువతోనే అనంతపురం జిల్లాకు క్రిష్ణా జలాలు వచ్చాయన్నారు. హంద్రీనీవాను 5 టీఎంసీల తాగునీటి పథకంగా కుదించిన చంద్రబాబుకు హంద్రీనీవా గూర్చి మాట్లాడే అర్హతేలేదన్నారు.

**ఏడాదిలోనే చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత:**

కేవలం ఏడాది కాలంలోనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంటు పరిశీలకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ ఏలాగైనా అధికారంలోకి రావాలని గత నాలుగు ఎన్నికల్లో చంద్రబాబు అలవిగాని హామీలను గుప్పిస్తూనే వస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మోసపూరితమైనవని చెప్పినా ప్రజలు నమ్మి ఓట్లువేసి నేడు బాధపడుతున్నారన్నారు.

**ఓపికతో ఉండండి మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే:**

బాధలు, కష్టాలు వచ్చినా కొంచెం ఓపికతో ఉండాలని మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఇప్పుడెవరెవరు ఇబ్బందులు పెడుతున్నారో వారికి బుద్ధి చెప్పే సమయంలో ఎంతో దూరంలో లేదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇంచార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగా 5న ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనేక మందిపై భౌతిక దాడులు జరిగాయన్నారు.

**రీ కాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ:**

అభినందన సభా కార్యక్రమంలో పార్టీ, అనుబంధ సంఘాల బాధ్యులకు నియామక పత్రాలు పంపిణీ చేసి ప్రమాణం చేయించిన అనంతరం నాయకులు 'రీ కాలింగ్ బాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఎం.నరసింహులు, నారాయణరెడ్డి, కరణం పుష్పావతి, రమావత్ దేవిబాయి, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, సర్పంచ్ మీనుగ లలిత, మాజీ ఎంపీపీ చందా చంద్రమ్మ, జిల్లా అధికార ప్రతినిధి సి.పి.వీరన్న, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, నాయకులు ఎం.అశోక్‌కుమార్, ఎం.బసవరాజు, ఈడిగ ప్రసాద్, రాయంపల్లి ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, కె.గోవిందు, జోగి వెంకటేష్, అడ్వకేట్ ఉమాపతి, అనుబంధ సంఘాల బాధ్యులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల దేవస్థానాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలి : పివిఎన్ మాధవ్ ఉద్ఘాటన

**విజయవాడ, జూలై 2, ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. విజయవాడలోని హోటల్ ఐలాపురంలో బుధవారం శ్రీనివాసనంద సరస్వతి స్వామీజి అధ్యక్షతన జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సు కార్యక్రమంలో మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ భారతీయ అత్యుత్తమ విలువలను ఇప్పటికి కూడా ప్రపంచంలో 80శాతం ప్రజలు తెలుసుకోలేకపోతున్నారన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారతదేశం ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ద్వారా భారతీయ ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి చాటిచెప్పామన్నారు. భారతదేశం విశ్వగురు అయ్యే రోజు దగ్గర్లోనే వుందన్నారు. ఈ సదస్సులో సాధుపరిషత్ గౌరవాధ్యక్షుడు అట్లూరి నారాయణరావు పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. దేవాలయాలపై ఇచ్చిన వివాదాస్పద జివో రద్దు చేయాలని, దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో ధార్మికులను మాత్రమే నియమించాలని, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా ప్రకటించి మద్యం, మాంస రహితం చేయాలని, హిందువుల పండుగలు, ఊరేగింపులకు ప్రభుత్వ రక్షణ కల్పించాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, అయోధ్య, కాశీ యాత్ర చేసే భక్తులకు ఆర్థిక సాయం చేయాలని, ప్రతి ఆలయార్చకుడికి రు.10వేలు ఇవ్వాలని, దేవాలయ భూముల్లో గోశాలలు ప్రతి గ్రామంలోనూ నిర్వహించాలని, బంజర్ భూములలో గోశాలలోని గోవులకు గడ్డి పెంచేందుకు వాడాలని, టిటిడి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ నూతన విద్యాలయాలు ఏర్పాటు చేయాలని, దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని ప్రతి దేవాలయం యొక్క ఆదాయ వ్యయాలు, ఆభరణాల వివరాలు, భూముల, ఆస్తుల వివరాలు ఆన్‌లైన్లో వుంచాలని, అశ్రమాల నిర్వహణకు నిధులు కేటాయించాలని, రిజర్వేషన్ల ఆధారంగా ఉద్యోగాలు పొంది మతం మారిన వారిని వెంటనే ఉద్యోగాల నుండి తొలగించాలన్నారు.

## రెరా న్యాయ సలహాదారుగా ధీరజ్

**విజయవాడ జులై 02 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర స్థిరాస్తి వ్యాపార ప్రాధికార సంస్థ న్యాయసలహాదారు గా న్యాయవాది అప్పసాని రామ్ ధీరజ్‌ను ప్రభుత్వం మంగళవారం నియమించింది. ఆయనకు నెలకు రూ.25 వేల చొప్పున గౌరవ వేతనం అందించాలని రెరాను ఆదేశిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## లోపభూయిష్టంగా క్రీడా విధానం

### ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా, కోచ్‌ల నియామకంపై స్పష్టత కరవు

### స్టేడియాలు, స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై దృష్టి పెట్టండి

### శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త స్పోర్ట్స్ పాలసీ లోపభూయిష్టంగా ఉందని స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్)మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు అవసరమైన హైపెర్ఫామెన్స్ అకాడమీల స్థాపనపై స్పోర్ట్స్ పాలసీలో కనీస ప్రస్తావన లేదని ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు, ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన వారికి నేరుగా ఉద్యోగాలిచ్చే విధానంపై పాలసీలో కానరాకపోవడం విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం శాట్స్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కోచ్‌ల క్రమబద్ధీకరణ, కొత్త కోచ్‌ల నియామకం గురించి ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కోచింగ్ వ్యవస్థను బాగు చేయకుండా రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేయలేరని స్పోర్ట్స్ యూనివర్సిటీ అనే అంశం ఐరావతంలా మారిందని, విశ్వవిద్యాలయం ఏర్పాటుపై ఒక బ్లూ ప్రింట్ తయారు చేయకుండా ప్రకటనలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. క్రీడలకు భారీ బడ్జెట్ కేటాయించామని ప్రచారానికే పరిమితం కాకుండా రాష్ట్రంలోని స్టేడియాలు, స్పోర్ట్స్ స్కూళ్ల ఆధునీకరణపై తక్షణమే దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. మండల స్థాయిలో టాలెంట్ హంట్ నిర్వహించి, వారిలో ప్రతిభావంతులను జిల్లాల్లోని ఫీడర్ సెంటర్లలో ప్రాథమిక తర్ఫీదు ఇచ్చి, హైదరాబాద్‌లోని హైపెర్ఫామెన్స్ సెంటర్లలో పెట్టి ఇంటెన్సివ్ ట్రైనింగ్ ఇచ్చేలా ఒక కోచింగ్ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ఈ మూడంచెల కోచింగ్ విధానంతో రాష్ట్రం స్పోర్ట్స్ హబ్ గా మారుతుందని అన్నారు. పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెరిగినందున స్పోర్ట్స్ స్కూల్‌లో సీట్లు పెంచే ఆలోచన కూడా చేయాలని వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు.

## డాక్టర్లు యేడాదిలో నెల రోజులు

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయాలి

### డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి భారతరత్న ఇవ్వాలి, ప్రభుత్వం తరపున కృషి చేస్తాం

### బంజారాహిల్స్‌లోని ఏఐజీ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి




బుధవారం హైదరాబాద్‌లో ఎఐజి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై2:** రాష్ట్రంలోని వైద్యులందరికీ ఒక విజ్ఞప్తి చేస్తున్నా. సామాజిక బాధ్యతగా ఏడాదిలో ఒక్క నెల ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేయాలని కోరుతున్నా. మీకు ఇష్టం వచ్చిన ఆసుపత్రిని ఎంచుకుని, నెల పాటు పని చేయాలి. నిమ్స్, ఉస్మానియాలో పని చేస్తే చాలా అనుభవం వస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మధ్య ప్రాచ్యదేశాల నుంచి నేరుగా రోగులు హైదరాబాద్ వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జపాన్‌లో వృద్ధులు బాగా పెరుగుతున్నారు. జపనీస్ భాష వచ్చిన నర్సులకు చాలా డిమాండ్ ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొని ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, జినోం వ్యాలీ హైదరాబాద్‌కు చాలా కీలకమని అన్నారు.డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి హైదరాబాద్, తెలంగాణకు గొప్ప పేరు తీసుకొచ్చారని ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చింది ఆయన భారతరత్నకు అర్హులు ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి నా వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. మొత్తం నాలుగు కరోనా టీకాల్లో మూడు మనమే అందిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో తయారయ్యే బల్క్ డ్రగ్‌లో 35 శాతం హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతుందని రేవంత్ వెల్లడించారు. ఐడిపిఎల్ మాజీ ఉద్యోగుల కృషితోనే ఫార్మారంగం అభివృద్ధి చెందిందని ప్రశంసించారు.ఏఐజీ ఆసుపత్రి సేవలు ఇంకా విస్తరించాలన్నారు.తెలంగాణ రాష్ట్రం హెల్త్ టూరిజం హబ్‌గా మారిందని, ప్రభుత్వానికి సహకరించాలని నాగేశ్వర్‌రెడ్డిని కోరామని వివరించారు. 66 దేశాల నుంచి వచ్చే రోగులకు వైద్య సేవలందించే స్థాయికి ఎఐజి చేరుకుందని ప్రశంసించారు.అలాగే క్యాన్సర్ చికిత్సలో నోరి దత్తాత్రేయుడు సలహాలు,సూచనలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. మహిళలకు హెల్త్ ప్రొఫైల్ రికార్డు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. క్యాన్సర్ వల్ల మహిళలే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని, వారి ఆరోగ్య వివరాలు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.జనని మిత్ర యాప్ పేద రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీల ద్వారా మన నగరం గొప్పతనం చాటి చెప్పామన్నారు. మిస్ వరల్డ్ పోటీదారులకు ఏఐజీ ఆసుపత్రి చూపించాలని తానే చెప్పానని గుర్తు చేశారు. నిమ్స్‌లో అదనపు బ్లాక్, ఎల్బీనగర్, సనత్ నగర్‌లో ఆసుపత్రులు నిర్మిస్తున్నామని వివరిం చారు. ప్రభుత్వ ఆసుపత్రులపై పేదలకున్న అభిప్రాయం మారేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నా మన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అంది స్తామని, వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని చెప్పారు. రూ.21500 కోట్లు విద్యారంగం అభివృద్ధికి కేటాయించామన్నారు. సాంకేతికరంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని,మిడిల్‌ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెం చేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లా డు తున్నామని,దీంతో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

## చెత్త సేకరణకు 2260 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి

**విజయవాడ జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** నగరాలు పట్టాణాల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరణకు 2260 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయనున్నారు. స్వచ్ఛాంధ్ర సంస్థ నిధుల్లో నుంచి వీటి కొనుగోలుకు అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ప్రజల నుంచి వసూలు చేసిన వినియోగ రుసుమును కూటమి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. పాత వాహనాలు నిర్వహణ పుర , నగరపాలక సంస్థలకు ఆర్థికంగా భారమవుతుందన్న అధికారుల సమాచారంపై చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై స్వచ్ఛాంధ్ర సంస్థ ఇటీవల ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు ఆహ్వానించింది. ఈ మేరకు ముందుకొచ్చిన సంస్థలతో సంప్రదింపులు చేసి ధర ఖరారు చేయనుంది.

## విక్రాంత్‌రెడ్డిపై ఎల్‌ఓసి కేసులో హైకోర్టు స్టే

**విజయవాడ జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** కాకినాడ పోర్టు వాటాలు అరబిందో సంస్థకు బదలా యింపు చేసిన వ్యవహారంపై నమోదు చేసిన కేసులో నిందితుడు ,వైకాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డికి హై కోర్టులో ఊరట లభించింది. మంగళగిరి సీఐడీ అధికారులు ఆయనపై జారీచేసిన లుక్‌ఔట్ సర్క్యులర్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. న్యాయ మూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఇదే కేసులో పిటిషనర్ ఇప్పటికే బెయిల్ పొందారని గుర్తుచేశారు. వ్యాజ్యంపై విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు. అంతకుముందు జరిగిన విచారణలో విక్రాంత్‌రెడ్డి తరపున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు.సీఐడీ తరపున సహాయ పీపీ నీలోత్పల్ వాదనలు వినిపిస్తూ కేసు వివరాలను తెప్పించుకోవాల్సి ఉందన్నారు. కొంత సమయం కావాలని కోరారు.

## 'పద్మా' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం!




**న్యూఢిల్లీ,జులై 2:** కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం పద్మ అవార్డులు. 2026 సంవత్స రానికి ఈ పద్మ అవార్డుల కోసం దరఖాస్తులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. మార్చి 15 నుంచే ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ జులై 31తో గడువు ముగియనుంది. నామినేషన్లు లేదా సిఫార్సులు రాష్ట్రీయ పురస్కార పోర్టల్ అవార్డ్స్.జివొవిడాట్ఇన్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలి.పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ అవార్డులు దేశంలో ఇచ్చే అత్యున్నత పౌర పురస్కారాలు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డులను కేంద్ర ప్రభుత్వం 1954 నుంచి ప్రధానంచేస్తోంది. ఈ పురస్కారాలను ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం, పరిశ్రమలు వంటి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి వారికి ఈ అవార్డులు ఇస్తారు. వృత్తి, హోదా, లింగం, జాతి వంటి విభేదాలు లేకుండా ప్రతి వ్యక్తి ఈ అవార్డులకు అర్హులే. కానీ, డాక్టర్లు, శాస్త్రవేత్తలు మినహా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసేవారు ఈ పద్మ అవార్డులకు అర్హులు కారు.

## యువ ఐపిఎస్‌లతో డిజిపి భేటీ

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** రాష్ట్రపోలీసుశాఖలో ఇటీవల చేరిన అసిస్టంట్ సూపరింటెండెంట్స్, ప్రొబేషనరీ అసిస్టంట్ సూపరింటెండెంట్స్‌తో డిజిపి జితేందర్ బుధవారం భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో యువ ఐపిఎస్‌ల విధుల గురించి ఆయ న సుధీర్ఘంగా వివరించారు. తెలంగా ణ పోలీసు శాఖ గడచిన కొన్నేళ్లుగా సాధించిన ఫలితాలు, జాతీయ స్థాయిలో అందుకున్న అవార్డుల గురించి కూడా డిజిపి వారికి విశదీకరించారు. యువ పోలీ సులు విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను ఎలా అధిగమించాలనే దానిపైనా డిజిపి వివరించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డి జి మహేష్ భగవత్, మల్టీ జోన్ ఐజి 1 చంద్రశేఖర్ రెడ్డి, మల్టీ జోన్ 2 ఇంఛార్జి ఐజి తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యూరియా లోటు

### 1.94 లక్షల టన్నుల కొరత

### కేటాయింపుల మేర సరఫరా చేయండి

### కేంద్రానికి మరోసారి వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** నెలవారి కేటాయించిన విధంగా ఎరువులు పంపిణీ చేయకపోవడం వల్ల రాష్ట్రంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా రాష్ట్రంలో యూరియా కొరత ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి కేటాయించిన విధంగా తక్షణమే యూరియాను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి తుమ్మల కేంద్ర మంత్రి జె.పి నడ్డాకు మరోసారి లేఖ రాశారు. యూరియా కేటాయింపులు మరియు సరఫరాలో తేడాలు ఏర్పడటం ద్వారా రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. తెలంగాణలో ఖరీఫ్ మొదలై, పంటల సాగు ఊపందుకుంటున్న సమయంలో కేంద్ర అలసత్వం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ సీజన్ లో రైతులకు అత్యవసరంగా అవసరమయ్యే యూరియా ఎరువుల సరఫరాలో నెలవారి లోటు ఉందన్నారు. ఏప్రిల్, మే, జూన్‌లో రాష్ట్రానికి కేటాయించిన యూరియా మొత్తం 5 లక్షల టన్నులు కాగా, కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. దీని ఫలితంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడింది. ముఖ్యంగా దిగుమతి ద్వారా వచ్చే యూరియాలోనూ పెద్ద లోటు ఉందని ఎప్పారు. ఏప్రిల్‌లో కేటాయించిన 1.70 లక్షల టన్నులకు 1.22 లక్షల టన్నులు, మేలో 1.60 లక్షల టన్నులకు 88 వేల టన్నులు, జూన్‌లో 1.70 లక్షల టన్నుల యూరియా కేటాయించగా 96 వేల టన్నులు మాత్రమే అందిందని వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్ లో ముఖ్యమైన జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో యూరియా వినియోగం అత్యధికంగా ఉంటుందనీ, అందువల్ల అది అందకపోతే రైతుల పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందనీ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రానికి రవాణా సౌలభ్యం కలిగిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీకి సంబంధించిన యూరియా కేటాయింపును 30,800 టన్నుల నుండి 60,000 టన్నులకు పెంచాలని కోరారు. ఏప్రిల్-జూన్ మధ్యలో వచ్చిన లోటును పూడ్చడానికి అదనపు సరఫరా ప్రణాళిక మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సాగు ఇప్పటికే ప్రారంభమై రైతులు పెద్దఎత్తున యూరియాపై ఆధారపడుతున్నారని వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పంటల సాగు నిరంతరంగా కొనసాగేందుకు తక్షణ చర్యల్లో భాగంగా యూరియా సరఫరా నిలకడగా ఉండేలా చూడాలని కేంద్రానికి రాసిన లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాజీ సిఎం వైయస్ జగన్‌ను కలిసిన చీలి సింగయ్య భార్య లూర్ధు మేరి ఇతర కుటుంబసభ్యులు



**విజయవాడ, జూలై2, ప్రభాత వార్తప్రతినిధి:** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాల యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్‌ను కలిసిన చీలి సింగయ్య భార్య లూర్ధు మేరి, కుమారులు, కుటుంబ సభ్యులు ఇటీవల వైయస్ జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ళ పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కొల్పోయిన చీలి సింగసింగయ్య ప్రాణాలు కొల్పోయారు.ఆయన కుటుంబానికి అండగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పటికే రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందజేసింది.సింగయ్య కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వైయస్ జగన్ భరోసాఇచ్చారు. బుధవారం జగన్ కలిసిన సింగయ్య కుటుంబం తాము ఆయన పట్ల పూర్తి విశ్వాసం నమ్మకంతో ఉన్నామని స్పష్టం చేసారు.ఈ విషయంలో టీడీపీ తప్పుడు ప్రచారాలను నమ్మమని తెల్చిచెప్పారు. వైయస్ జగన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఉన్నారు.వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను కలిసిన సత్తెనపల్లికి చెందిన పాపసాని వెంకట జయవర్ధన్ రెడ్డి తల్లిదండ్రులు సావిత్రి, భాస్కర్ రెడ్డి, సోదరుడు మణికంఠ రెడ్డి, కుటుంబ సభ్యులు ఇటీవల వైయస్ జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ళ పర్యటన సందర్భంగా సత్తెనపల్లిలో గుండెపోటుకు గురై ప్రాణాలు కొల్పోయిన జయవర్ధన్ రెడ్డిజయవర్ధన్ కుటుంబానికి అండగా నిలిచిఇప్పటికే రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందజేజయవర్ధన్ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు.

## అలకనంద ఆసుపత్రి కిడ్నీ రాకెట్ కేసులో మరో దళారి అరెస్టు

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** గత జనవరి నెలలో నగరంలో వెలుగుచూసిన అలకనంద ఆసుపత్రి కిడ్నీ రాకెట్ కేసులో మరో దళారి అరెస్టయ్యాడు. దీంతో ఈ కేసులో అరెస్టయిన నిందితుల సంఖ్య 17కు చేరింది. సరూర్‌నగర్‌లో గల చిన్నపాటి ఆసుపత్రి అలకనందలో సాధారణ వైద్య సేవలకు మాత్రమే అను మతి వుంది. అయితే ఇక్కడ అక్రమంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయడం సంచలనం రేపింది. దీనిపై పక్కా సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్య శాఖ, పో లీసు విభాగాలు దాడిచేసి ఆసుపత్రి నిర్వాహకులతో పాటు దళారులను అరెస్టు చేయడం తెలిసిందే.

ఈ సందర్భంగా కిడ్నీ ఆపరేషన్లు చేయించుకుని కదలలేనిస్థి తిలో వున్న వారిని గాంధీ ఆసుపత్రికి తరలించడం విదితమే. దీని తరవాత ఈ కేసు విచారణను సిఐడికి బదలాయించారు. ఈ క్రమంలో ఈ కేసు విచారణను సిఐడి వేగవంతం చేసి ఇందులో వున్న నిందితులను వరుసగా అరెస్టు చేయసాగింది. ఇదే కేసులో విజయనగరంలో వున్న దళారి కొండగొర్రి మురళి కృష్ణను మంగళవారం నాడు సిఐడి అధికారులు అతని నివాసంలో అరెస్టు చేశారు. కిడ్నీ ధాతలకు ఇతను మాయమాటలు చెప్పి వారిని కిడ్నీ దానం చేసేలా ఒప్పించేవాడు. ఇందుకుగానూ వారికి తలా నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయలు అందేలా చూసేవాడు.

ఈ క్రమంలో ఇతను పలువురు కిడ్నీ ధాతలను అలకనంద ఆసుప త్రికి తరలించి వారి నుంచి కిడ్నీలను తీసుకునేందుకు సహకరించేవాడు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయించుకున్న వారి నుంచి పది లక్షల రూపాయల నుంచి 25 లక్షల రూపాయల వరకు వసూలు చేసేవారు. కొన్నిసార్లు 50 లక్షల రూపాయల వరకు కూడా వసూలు చేసేవారు.

కాగా ఈ కేసులో పరారీలో వున్న మిగతా నిందితుల గురించి గాలిస్తు న్నారు. సిఐడి చీఫ్ చారు సిన్హా ఈ కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## రూ.1,500 కోట్ల రుణం సేకరించిన సర్కార్

**హైదరాబాద్, జూలై 2, ప్రభాతవార్త:** రిజర్వు బ్యాంక్ నుంచి మరో రూ.1,500 కోట్ల రుణాన్ని తెలంగాణ సర్కార్ సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో బహిరంగ మార్కెట్‌లో జరిగిన వేలం ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభు త్వం సమీకరించింది. ఈ మేరకు దీనికి సంబంధించి 24 ఏండ్ల కాల పరిమితితో 7.14 శాతం వార్షిక వడ్డీకి రూ.800 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో 7.14 శాతం మేర వడ్డీకి మరో రూ.700 కోట్లు రుణం తీసుకున్నట్టు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల ద్వారా రూ.64,539 కోట్లు సమీకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ వరకూ తొలి క్వార్టర్‌లో రూ.14 వేల కోట్ల రుణం కోసం ఆర్బీఐకి ప్రతిపాదనలు పంపించింది. అయితే అంతకంటే రూ.3,400 కోట్లు ఎక్కువగా మొదటి క్వార్టర్‌లో మొత్తం రూ.17,400 కోట్ల మేర రుణాలను సమీకరించింది. ఇక ప్రస్తుత జూలై నుండి సెప్టెంబర్ వరకూ రెండో క్వార్టర్‌లో రూ.12 వేల కోట్ల రుణ సమీకణ కోసం గత నెల 27న రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఇందులో భాగంగానే ఇప్పుడు ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రూ.1,500 కోట్ల రుణాన్ని సేకరించింది.

## స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదిక సిద్ధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై2:** రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ (ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్-ఐఇ డబ్ల్యుజి) తన నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించడానికి సిద్ధం చేస్తోంది. బుధవారం నాడు కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల సంస్థలో జరిగిన కమిటీ సమావేశంలో నివేదికకు తుది మెరుగులు దిద్దారు.

## సాంస్కృతిక శాఖకు అంబేద్కర్ స్మృతివనం నిర్వహణ బాధ్యత

**విజయవాడ జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని మహాత్మా గాంధీ రోడ్డులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణ బాధ్యతను సాంఘిక సంక్షేమ శాఖ నుంచి సాంస్కృతిక శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాఖ మార్పుపై ఇటీవల మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఈ స్మృతివనం బాధ్యతను ఇకపై సాంస్కృతిక శాఖ నిర్వహిస్తుంది.

## 4 నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

**విజయవాడ జులై 2 ప్రభాతవార్త ప్రతినిధి:** బీటెక్ రెండో ఏడాదిలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈసెట్ కౌన్సెలింగ్ ఈ నెల 4 నుంచి ప్రారంభిస్తున్నట్లు కన్వీనర్ గణేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 4-8 వరకు ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ , 4-9 వరకు ఆన్‌లైన్ సర్టిఫికెట్ల అప్‌లోడ్, 7-10 వరకు కళాశాలలు, కోర్సుల ఎంపికకకు వెబ్‌ఐచ్ఛికాల ఎంపిక, 11న ఐచ్ఛికాల మార్పు, 13న సీట్ల కేటాయింపు చేయనున్నట్లు ప్రకటించారు. సీట్లు పొందిన విద్యార్థులు 14 నుంచి 17 లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# పథకాల ఫలితాలు పేదలకు చేరాలి

## ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి అమలుకు కలెక్టర్లే మార్గదర్శకులు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్ జూలై 2 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలు, పేదల కలలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి వాటి ఫలితాలు పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొం గులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆలో చనలు,ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ పథకాలను విజయవంతంగా అమలు చేయ డానికి జిల్లా కలెక్టర్లు నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం సచివాల యంలోని తన కార్యాలయంలో నిర్మల్, నారా యణపేట్, జోగులాంబగద్వాల్, ములుగు, జయ శంకర్‌భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మంచి ర్యాల, వనపర్తి జిల్లాల కలెక్టర్లతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడితే స్వరాష్ట్రంలో పదేళ్లలో ఎదుర్కొ భూసమస్యలకు విముక్తి లభిస్తుందని,సొంతింటి కల నెరవేరుతుందని తెలంగాణ ప్రజానీకం అత్యంత నమ్మకంతో మాకు అధికారం అప్ప గించారు. వారి నమ్మకాన్నిఏమాత్రం వమ్ము చేయకుండా సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా భూభారతి చట్టానికి, అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. చట్టాన్ని రూపొందించడం ఒక ఎత్తైతే దాన్ని అమలు చేయడం మరో ఎత్తు. ఈ చట్టం ఫలితాలు ప్రతి పేదవానికి అందినప్పుడే చట్టం సార్థకత నెరవేరుతుందన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్యుడుసైతం సంతోష పడేలా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలి. ఇంది రమ్మఇండ్ల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిఆర్థిక ఇబ్బందులు ఉన్నా దాని ప్రభావం ఇందిరమ్మ ఇండ్లపై పడకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. మీరు చేయా ల్సింది లబ్దిదారుల ఎంపిక, ఇండ్ల మంజూరు, నిర్మాణ పనుల పర్యవేక్షణ. ఈ మూడు అంశాలను పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలిం చాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ఈ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నా కూడా

రద్దు చేయడానికి వెనుకాడ వద్దన్నారు. ప్రతి ఇల్లు అర్హులకే అందాలి. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక అందేలా పర్యవేక్షించాలన్నారు.

# దార్శనిక ప్రణాళికలపై స్పష్టమైన అవగాహన ఉండాలి

## - ఎన్టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, జూలై 2, ప్రభాతవార్త ప్రతినిధి: నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలోని ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహన ఉండాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆయా నియోజకవర్గాల బలాలు, బలహీనతల విశ్లేషణ ద్వారా, వృద్ధికి అవకాశమున్న అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, వారి బృంద సభ్యులకు సూచించారు. జిల్లా, నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళికలపై కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, ప్రణాళికల రూపకల్పన బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047లక్ష్యసాధనకు నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు దోహదం చేస్తాయని, ఆయా నియోజకవర్గాల గ్రాస్ కన్‌స్టిట్యుయెన్సీ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీసీడీపీ)తో పాటు నియోజకవర్గ స్థూల విలువ జోడింపు, తలసరి ఆదాయాలను పెంచేందుకు వీటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం దార్శనిక ప్రణాళికల లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న రూ. 3.52 లక్షల జిల్లా తలసరి ఆదాయాన్ని 2047 నాటికి రూ. 55 లక్షలకు చేర్చాలనేది లక్ష్యమని.. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే స్పష్టమైన ప్రణాళికలతో పాటు వాటి అమలుకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. ఉదాహరణకు పశు పోషణ రంగంలో అధిక వృద్ధికి అవకాశముందని.. ఈ నేపథ్యంలో ఓ నియోజకవర్గంలో ప్రస్తుత పాల ఉత్పత్తి, పాల ఉత్పత్తిని పెంచడానికి ఉన్న అడ్డంకులు, వాటిని అధిగమించేందుకు అందుబాటులో ఉన్న పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా జరిగే అదనపు సంపద సృష్టి.. ఇలా ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో సేవా రంగంపై ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరముందని.. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పశు పోషణ, ఉద్యాన, ఆక్వా కల్చర్, పరిశ్రమలు తదితరాలపై దృష్టిపెట్టాల్సిన అవసరముందని సూచించారు. బంగారు కుటుంబానికి పీ4తో ఉన్నత భవిష్యత్తును నిర్మిద్దాం: రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఎక్కడాలేని విధంగా వినూత్నంగా పీ4 విధానాన్ని అమలుచేస్తోందని.. ఈ విధానాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. దశల వారీగా అభివృద్ధి ప్రణాళికలను అమలుచేయడం ద్వారా బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేలా చేయొచ్చని, ఇందుకు మార్గదర్శులను ప్రోత్సహించాలని సూచించారు. కేవలం డబ్బే కాకుండా ఓ మంచి సూచన, చేయిపట్టి నడిపించే సేవా తత్పరత, సమాజం మనకెంతో ఇచ్చింది.. మనమూ సమాజానికి తిరిగి ఎంతో కొంత చేయాలనే మంచి ఆలోచనలు.. బంగారు కుటుంబాల అభివృద్ధికి ఉపయోగపడతాయని వివరించారు. తాజాగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు రోటరీ క్లబ్ సభ్యులు ముందుకొచ్చారని.. ఇదే స్ఫూర్తితో మిగిలిన వారు ఓ మంచి చొరవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 9లక్షల మంది యోగాకు చేరువ యోగాంధ్ర2025 ద్వారా జిల్లాలో తొమ్మిది లక్షల మందికి యోగాను చేరువచేశామని.. సమష్టి కృషి ఫలితమైన ఈ విజయంలో అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ కీలక భాగస్వామ్యం అందించిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు ఉచిత వేసవి యోగా శిక్షణ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పాల్గొన్న 108 మందికి సర్టిఫికెట్లు అందించే కార్యక్రమం బుధవారం ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించడంలో అమరావతి యోగా కీలకపాత్ర పోషించిందన్నారు.

# సంస్కృతి, జీవన విధానంపై పరిశోధనలు: మంత్రి జూపల్లి



హైదరాబాద్,జూలై 2 ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతి, జీవన విధానంపై పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని పర్యాటక, సాం స్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆర్ట్స్ సోషల్ సైన్సెస్‌లో 'విభిన్న అంశాల సంవాదం, సంభాషణ'అనే అంశంపై ఏర్పాటు చేసిన 2 రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశోధనలకు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తమశాఖ ద్వారా కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రక టించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవన విధానం గతితప్పడం ఎన్నో సమస్యలకు కారణ మవుతుందన్నారు. సామాజిక రుగ్మతలు, దురలవాట్లు, తాహతుకుమించిన ఆడంబరాలతో కుటుంబాలు చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, పరిశోధ కులు, అధ్యాపకులు తెలంగాణ జీవన విధానంపై పరిశోధనలు జరిపి మార్పు తీసుకొచ్చేదిశగా బాధ్యత తీసుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వ నుంచి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్ర మానికి చీఫ్ ప్యాట్రన్‌గా వ్యవహరించిన ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లా డుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విభిన్న అంశాల్లో ప్రావీణ్యం పొందాల్సిన అవసరం ఉంద న్నారు. ఇందులో భాగాంగానే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం మాటా ్లడుతూ సామాజికార్థిక విషయాలే కాకుండా విజ్ఞాన శాస్త్రాంశాలను కూడా సాహిత్యం సృజనాత్మకంగా చిత్రించిందని అన్నారు. డార్విన్ థియరీ, భారత స్వాతంత్ర్యోద్యమం కాలం నాటి డ్రెయిన్ థియరీ లను దాశరథి, చిలకమర్తి లక్ష్మీనరసింహం లాంటి కవులు సృజనాత్మకంగా వ్యక్తం చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూజిసి డీన్ ప్రొ. లావణ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డా. కొండా నాగేశ్వర రావు, డా. బాలు నాయక్, పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద యెత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారు. ఆరువందల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధకులు వచ్చి వారి పరిశోధన పత్రాలను సమర్పించారు.

## వచ్చే జనవరి 28 నుంచి 31 దాకా

# మేడారం మహా జాతర

## తేదీలను ప్రకటించిన పూజారులు

హైదరాబాద్ జులై 2 ప్రభాతవార్త: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం మహా జాతర తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తేదిలను ప్రకటించిన పూజారుల సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. కోట్లమంది భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా విస్తృ త ఏర్పాట్లు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మహాజాతర తేదీలను ప్రకటించిన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రూ.110 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులు కొనసాగు తున్నట్లు తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31వరకు జాతర జరగనుంది. 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలకు వస్తారు. 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. 31న సాయంత్రం 6 గంట లకు అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగు స్తుంది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహా జాతర ఏర్పాట్లను మంత్రి సీతక్క పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహిస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు. మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతు న్నాయని మంత్రి తెలిపారు.

# బడుగు,బలహీనులకు ఆత్మగౌరవం కల్పించేదే కాంగ్రెస్

## పశుసంవర్ధక, క్రీడలు యువజన సర్వీసుల మంత్రి శ్రీహరి

హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త:అధికారం ఉన్నా లేకపోయిన్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందని పేదల ఆకలి తీర్చడం బడుగు బలహీనులకు ఆత్మగౌరం కల్పించడం మా నాయకత్వ లక్ష్యం అని పశుసంవర్ధకం క్రీడలు యువజనసర్వీసుల మంత్రి శ్రీహరి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేషన్ చైర్మన్లు మన్నె సతీష్, ఐతే ప్రకాష్ రెడ్డిలతో కలిసి మంత్రి శ్రీహరి ప్రజల నుంచి వినతులు స్వీకరించినారు. పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులతో మంత్రి, కార్పొరేషన్ చైర్మన్లు మాట్లాడినారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు ప్రతి బుధవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం జరుగుతోందని ఆయన వివరించారు. ప్రజా వినతులు స్వీకరించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగిందని విలేఖరులకు తెలిపారు. దాదాపు 90 వరకు ప్రజా వినతులు రావడం జరిగిందని చెప్పారు. ఎక్కువ శాతం ధరణి బాధితులు ఉండటం గమనార్హమని వివరించారు. ఓ పేదవాడు నేరుగా మంత్రిని కలిసి సమస్య విన్నవించడం కాంగ్రెస్ ప్రభుత్వంలో చూస్తున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతోందని ఆయన చెప్పారు. బనకచర్ల విషయంలో హరీష్ రావు కొంత తడబడినట్లు స్పష్టంగా అర్థమవుతోంది అని చెప్పారు. చేపల పులుసు తిని రాయలసీమ రత్నాల సీమగా మారు స్తామని 1000 టిఎంసిల నీరు వృథాగా పట్టుకు పోయారు, బనకచర్ల మీద ఎక్కడైనా మాట్లా డానికి రెడీ వచ్చే వారం కృష్ణ నది జలాల మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉందని ఆయన తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలో బిసిల పట్ల బిజెపి వైఖరి మరోసారి తేటతెల్లమైంది.. గతంలో బండి సంజయ్ తొలగించి కిషన్ రెడ్డికి పదవి కట్టబెట్టారు. కుల గణన సర్వే జరిగాక కూడా బిసిలపట్ల బిజెపి పక్షపాత వైఖరి చూపిం దని అన్నారు. బిఆర్ యస్ పార్టీలో బిసిలకు వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా అధ్యక్ష పదవి ఇస్తే సంతోషమని కవితకు సూచించారు. కవిత రైల్ రోకో కార్యక్రమం చేపట్టే ముందు పార్టీలో బిసికి కీలక పదవి గురించి ఆలోచించాలని ఆయన కోరారు. రాహుల్‌గాంధీ మాటకుకట్టుబడి ఎవరి వాట వారికే నినాదం పేరుతో పారదర్శకంగా కులసర్వే నిర్వహించడం జరిగిందని చెప్పారు.

# కెసిఆర్ అసెంబ్లీలో కృష్ణ, గోదావరి జలాలపై మాట్లాడాలి

## పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త: బిఆర్ఎస్ తరఫున అసెంబ్లీ సమావేశాల కోసం లెటర్ ఇవ్వమని అడిగితే నోరు విప్పడం లేదు కానీ బయట ఎక్కడో హరీష్‌రావు మాట్లాడుతున్నా రని ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో కెసిఆర్ స్వయంగా వచ్చి కృష్ణా, గోదావరి జలాలపై మా ట్లాడాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిఎల్పీ మీడియా సెంటర్‌లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ హరీష్ రావుకు దమ్ముంటే స్పీకర్ దగ్గరకు వచ్చి బిఆర్ఎస్ తరపు ప్రత్యేక అసెంబ్లీ కోరుతూ లేఖ ఇవ్వాలనిసవాల్ చేశారు. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చర్చకు రమ్మని చేసిన సవాల్ స్వీకరించకుండా సిగ్గులేకుండా హరీష్‌రావు ప్రెస్‌మీట్‌లో గంట న్నరసేపు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బనకచర్ల పైన పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో కెసిఆర్ హరీష్ రావు బట్టలు విప్పాడని అన్నారు. టిఆర్ఎస్ పాలకులు ఇద్దరు కలిసి తెలంగాణ కు చేసిన జల ద్రోహాన్నిముఖ్యమంత్రి సవివరంగా చెప్పారని అన్నారు., రాయలసీమను రతనాల సీమ చేయడానికి కెసిఆర్ చేసిన కుట్రలను, హరీష్ రావు చేసిన కుతంత్రాలను కళ్లకు కట్టేలా చూపించారు. చేపల పులుసు కోసం తెలంగాణ రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టిన పాపాత్ముల బండారాన్ని మా ముఖ్యమంత్రి బయటపెట్టారు. బనకచర్ల లో కెసిఆర్, హరీష్ రావు తెలంగాణ ప్రజలకు దొరికిపోయారు. మహబూబ్ నగర్ జిల్లాలను సస్యశ్యామలం చేశామని హరీష్ రావు గప్పాలు కొడుతున్నాడు. 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని అంటుండు ఎక్కడ ఇచ్చాడో చూపాలని అన్నారు. జగన్, కెసిఆర్ ఆడిన డ్రామ ఫలితంగా నార్జునసాగర్ సెంట్రల్ ఫోర్సు చేతిలోకి పోయిం దని దీనితో ఆప్రాజెక్టు నిర్వహణ కూడాకష్టంగా మారిందని అన్నారు.

# తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

## ప్రధాన కాంట్రాక్టులన్నీ వాళ్లకే

## కాంట్రాక్టర్లకు కరెంటు, బిల్లులు ఆపేయండి

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 2 ప్రభాతవార్త : తెలంగాణ ప్రాంతానికి శాపంగా మారనున్న ఏపీ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలంటే లేఖలు రాసినంత మాత్రాన సరిపోదని, తెలంగాణలో ఉన్న చంద్రబాబు కోవర్టులను టైట్ చేస్తేనే ఆ ప్రాజెక్టు ఆగే అవకాశం ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి రాష్ట్ర సాగునీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘనపూర్ గ్రామంలో బుధవారం ముడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసారు. అలాగే గ్రామంలో సిఎస్ఆర్ నిధుల ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు ఈరోజు తెలంగాణలో ఉన్నారని తెలంగాణలో పెద్ద కాంట్రాక్టులన్నీ వాళ్లే చేస్తున్నారని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు, రోడ్డు కాంట్రాక్టులు, హైదరాబాద్ లో దందాలు కూడా వాళ్లే చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ కోవర్టులకు మొత్తం నల్లా కలెక్షన్లు కట్ చేయండి, కరెంటు కనెక్షన్లు కట్ చేయండి, ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒక్క రుపాయి లేకుండా వాళ్లను కట్ చేయండి అని సూచించారు. అప్పుడు వాళ్లే వెళ్లి చంద్రబాబు కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ చేయిస్తారని అనిరుధ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మంచిగా చెబితే ఆంధ్రోళ్లు వినరని, ఈ పని చేస్తే వారం రోజుల్లో బనకచర్ల బంద్ అవుతుందని చెప్పారు. తాను ఈ విషయంగా చేస్తున్న సూచనను గమనించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిను కోరారు.

# ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదువందల మంది తరలిరావాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

హైదరాబాద్,జూలై 2,ప్రభాతవార్త: ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు వందలకు మించి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం సభకు రావలని ఆసభలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, రవాణా బిసిసంక్షేమశాఖ మంత్రిమంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, మం త్రిమండలి,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , ఎంపీలు, డిసిసి అధ్యక్షులు,కార్పొరేషన్ చైర్మన్లు , పార్టీ ముఖ్యనేతలు ఈ సమావేశంలో పాల్గొన బోతున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో సౌకర్యాలు భేష్: ఇఒకు మెట్రో బృందం అభినందనలు

ఇంద్రకీలాద్రి, జూలై 2, ప్రభాతవార్త

దుర్గమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఇటీవల ఇఒ వికె శీనా నాయక్ చేపట్టిన సంస్కరణలు, మార్పులను కల్పించిన సౌకర్యాలపై రాజధాని మెట్రో డిపిఆర్ బృందం అభినందనలు తెలిపారు. బృందం జయదీప్ జాయింట్ సెక్రటరీ టు సెంట్రల్ గవర్నమెంట్, ఏపి రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు బుధవారం దుర్గమ్మవారిని దర్శించుకోటానికి ఆలయానికి వచ్చారు. అనంతరం వారు ఇఒకు రాజధాని మెట్రో ప్రాజెక్టు గురించి వివరించారు. ఇఒ వారికి ఆలయంలో ఇటీవల చేపట్టిన సంస్కరణలు తెలిపారు. ఈ సందర్భంగా బృందం ఇఒకు అభినందనలు తెలిపారు.



-దుర్గమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఆషాడం సారె సమర్పణ :

దుర్గమ్మ వారికి పలువురు భక్తబృందాల వారు బుధవారం ఆషాడం సారెను సమరి ్పంచారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన 300 బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా వారు సమర్పించిన సారె ను చీరల గురించి ఇఒ శీనా నాయక్ సిబ్బందిని వివరణ కోరారు. భక్తులు అందించే చీరల వివరాలను కంప్యూటర్లో నమోదు చేస్తున్నట్లు ఇఒకు సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా భక్తబృందాల వారికి ఉచిత అన్నప్రసాదం, సామూహిక ఆశీర్వచనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఇఒ ఆదేశించారు.

- ఇంద్రకీలాద్రిపై ప్రతి అడుగు భక్తుల సేవకు చెందాలి : ఇఒ

దుర్గమ్మవారి ఆలయంలోని ప్రతి అడుగు దుర్గమ్మను దర్శించుకునే భక్తుల సేవలకోసం మాత్రమే వినియోగించాలని ఇఒ వికె శీనా నాయక్ ఆదేశాలిచ్చారు. బుధవారం నాడు ఇఒ మహామండపంలోని 1, 2, 3 అంతస్థుల్లో వినియోగంలోకి రాని ఖాళీ గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు దుర్గమ్మవారికి సమర్పించిన చీరె ముక్కలు వుంచిన గోడౌన్ పరిశీలించి వాటిని వెంటనే అక్కడినుండి క్లియర్ చేసి భక్తుల సేవకోసం వినియోగించాలని ఆదేశాలిచ్చారు. గతంలో ఎందరో త్యాగాలు చేస్తే వచ్చిన కనకదుర్గానగర్, మహామండపం ప్రాంతాలు దేవస్థానం ఆధీనంలోకి వచ్చాయని వాటిని వెంటనే భక్తులకోసం వినియోగించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వివాహాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలించిన ఇఒ దేవస్థానం నుండి చేస్తున్న ఏర్పాట్లు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఖాళీ ప్రదేశాలు ఆలయంలో ఎక్కడా వుండకూడదని అన్ని ప్రాంతాలు భక్తుల సేవకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఇఇ రాంబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో అందిస్తున్న నిత్యాన్నదానంలో అన్నప్రసాదం పెళ్లి భోజనంలా వుందని భక్తులు ఇఒ వికె శీనా నాయక్‌కు తెలిపారు. ఇఒ బుధవారం మెట్ల మార్గం గుండా నిత్యాన్నదానం జరుగుతున్న అన్న ప్రసాదశాలకు చేరుకుని భక్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆలయ అన్నప్రసాద విభాగం ఎఇఒ, సూపరిటెండెంట్లు ప్రతిరోజూ అన్నప్రసాదం స్వీకరించి రుచి, క్వాలిటీ లపై భోజనాలు పూర్తయ్యేలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఇఇ రాంబాబు పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జూలై 8 నుండి 10 వరకు జరుగుతున్న శాకంబరి ఉత్సవాలకు కూరగాయల వితరణకు పలువురు రైతులు, వ్యాపారులు సానుకూలంగా స్పందించారు. దుర్గమ్మవారి ఆలయం నుండి కూరగాయల వితరణకోసం ప్రత్యేకబృందం పలు ప్రాంతాలు పర్యటించారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

## సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌లకు లేఖ రాసిన ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, జూలై 2 ప్రభాతవార్త : ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా కొన్ని కళాశాలలు బిసి,ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డిలకు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6.వేల కోట్ల వరకు ఫీజు బకాయిలు ఉన్నవని, వీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలు సర్కారు ఇవ్వకపోవడం వల్లనే కళాశాలలు పేద విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దోస్తు ద్వారా సెలెక్ట్ అయిన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకూడదని జీవో తెలుపుతున్నా కళాశాలల యాజమాన్యాలు లెక్క చేయడం లేదన్నారు. పేద విద్యార్థుల పెద్ద చదువులు చదువాలని అనేక ఉద్యమాలు చేసి ఫీజు రియంబర్స్‌మెంట్ పతకంను అమలు చేయించామని, దీని ద్వారా లక్షలాది మంది బిసి,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు బాగుపడ్డారన్నారు. ఇప్పుడు సవ్యంగా ఈ పతకం అమలు చేయకపోవడం వలన చాలా మంది విద్యార్థులు మళ్లీ మధ్యలోనే ఉన్నత చదువులను మానుకొని కూలీలుగా మారే ప్రమాదం ఏర్పడు తుందన్నారు. ఇది చాలా బాధాకరమైన విష యమని, ఇప్పటికైనా సర్కారు వెంటనే స్పందించి ఫీజు రియంబర్స్‌మెంట్ నిదులను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల నుంచి బలవం తంగా ఫీజులు వసూలు చేసే కళాశాలలపై కఠి నమైన చర్యలు తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలి

## కార్మిక సంఘాల నేతల పిలుపు

హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 2, ప్రభాతవార్త: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 9వ తేదీ చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పలు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో హైదరాబాద్ పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టియూసీ నాయకులు ఆర్‌డి చంద్రశేఖర్, ఎఐటియూసీ ఎస్.బాల్‌రాజ్, హెచ్ఎంఎస్ నాయ కులు రెబ్బ రామారావు, బిఆర్‌టియూ నాయ కులు జి.రాంబాబు యాదవ్, సీఐటియూ నేతలు బోస్, జె.వెంకటేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ ప్రాజెక్టును (ఎన్ఎంపీ) తక్షణమే ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికుల కనీస వేతనాలు 26వేలుగా నిర్ణయించాలని, ఎన్‌పిఎస్, యూపీఎస్‌ను రద్దుచేయాలని, పాత పెన్షన్ విధా నాన్ని పునరుద్ధరించాలని, అసంఘటిత కార్మికు లకు యూనివర్సల్ సోషల‌సెక్యూరిటీ స్కీమ్‌నప్రవేశపెట్టాలన్నారు.

# కన్న తండ్రిని హాతమార్చిన కుమారుడు

మోతె, జూలై 2 ప్రభాత వార్త: కన్న తండ్రిని దారి కాచి మరి గొడ్డలితో దారుణంగా నరికి చంపిన ఘటన మోతె మండలంలోని విభలాపురం గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని నాగయ్య గూడెం గ్రామానికి చెందిన వెంకన్న (60) కు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కొడుకు గంగయ్యతో గత కొంతకాలంగా ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. వీటిని మనసులో పెట్టుకున్న పెద్ద కుమారుడు తండ్రిని అడ్డు తొలగించాలని నిర్ణయించు కున్నాడు. తండ్రి వెంకన్న ఓ పని నిమిత్తం మామిళ్ళగూడెం వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా పథకం ప్రకారం కాపు గాసిన నిందితుడు విభలాపురం శివారుకు రాగానే ద్విచక్ర వాహనంపై వస్తున్న తండ్రిని వెంబడించి వెంట తెచ్చుకున్న గొడ్డలితో తలపై వేటు వేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావానికి గురైన తండ్రి రహదారిపై కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు పోలీ సులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న మోతె ఎస్సై యాదవేందర్ రెడ్డి క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. తండ్రిని చంపిన గంగయ్య పోలీస్ స్టేషన్‌లో లొంగి పోయినట్లు పోలీసులు తెలిపారు.

కూతురు స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# 5న 'టిక్ టాక్ చేద్దామా' విడుదల



మాస్ బంక్ మూవీస్ పతాకంపై కొండా వెంకట రాజేంద్ర, మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మీ గణేష్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. లోపలికి రా చెప్తా చిత్రం ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది. తాజాగా ఈ సినిమా నుంచి నాలుగవ పాట టిక్ టాక్ చేద్దామా..ను యంగ్ టాలెంటెడ్ హీరో శ్రీ విష్ణు చేతుల మీదుగా రిలీజ్ చేశారు. టిక్ టాక్ చేద్దామా.. పాట ఈ సినిమాకు ఆకర్షణ కాబోతోంది. టైటిల్ అనౌన్స్ మెంట్ నుంచే లోపలికి రా చెప్తా సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన ప్రతి కంటెంట్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాండ్ కంపోజ్ చేసిన పాటలన్నీ ఛాట్ బస్టర్స్ అయ్యాయి. రీసెంట్‌గా ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా రిలీజ్ చేసిన లోపలికి రా చెప్తా ట్రైలర్‌ను ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. హారర్ కామెడీ జానర్‌లో ఈ సినిమా ఓ కొత్త ట్రెండ్ క్రియేట్ చేస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. ఈ నెల 5న థియేటర్స్‌లోకి గ్రాండ్ రిలీజ్ కు వస్తున్న లోపలికి రా చెప్తా సినిమా విజయంపై మూవీ టీమ్ పూర్తి నమ్మకంతో ఉన్నారు. నటీనటులు: కొండా వెంకట రాజేంద్ర, మనీషా జష్నాని, సుస్మిత ఆనాల, సాంచిరాయ్, అజయ్ కార్తీక్, ప్రవీణ్ కటారి, రమేష్ కైగూరి, వాణి ఐడా, తదితరులు టెక్నికల్ టీమ్: మ్యూజిక్: దేవ్ జాండ్ డిఓపి: రేవంత్ లేవాక, అరవింద్ గణేష్, ఎడిటర్: వంశీ, పి ఆర్ ఓ: బి. వీరబాబు ప్రొడ్యూసర్స్: లక్ష్మీ గణేష్ చేదెళ్ళ, కొండ వెంకట రాజేంద్ర కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: కొండా వెంకట రాజేంద్ర.

సరికొత్త హారర్ కామెడీ మూవీగా ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. లోపలికి రా చెప్తా సినిమా. ఈ చిత్రాన్ని

# లాంఛనంగా 'ప్రొడక్షన్ నం.2' షురూ

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెం.2గా నిహారిక కొణిదెల నిర్మిస్తున్న చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించనున్నారు. ఈ చిత్రానికి కథను మానస శర్మ అందించగా, స్క్రీన్ ప్లే, డైలాగ్స్‌ను మానస శర్మ, మహేష్ ఉప్పాల అందించారు. ఈ మూవీకి మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాల్ని బుధవారం నాడు అన్నపూర్ణ స్టూడియోస్ గ్లాస్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్, కళ్యాణ్ శంకర్, మల్లిది వశిష్ట వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఇక ముహుర్తపు సన్నివేశానికి నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టగా, వశిష్ట కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి సన్నివేశానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ జూలై 15 నుంచి హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జరగనుంది. ఫ్యాంటసీ, కామెడీ జోనర్ తెరెకెక్కనున్న ఈ మూవీకి అనుదీప్ దేవ్ సంగీతాన్ని అందిస్తుండగా, అన్వర్ అలీ ఎడిటర్‌గా పని చేయనున్నారు. రాజు ఎదురోలు సినిమాటోగ్రఫర్‌గా, పుల్లా విష్ణు వర్ధన్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, యాక్షన్ కొరియోగ్రఫీగా విజయ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఇతర విషయాల్ని ప్రకటించనున్నారు.



నటీనటులు: సంగీత్ శోభన్, నయన్ సారిక, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శీను, సుఖ్వీందర్ సింగ్, అరుణ భిక్షు, రమణ భార్గవ్, వాసు ఇంటూరి, రోహిణి(జబర్దస్త్), రోహన్. సాంకేతిక బృందం: బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, కథ మానస శర్మ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్: మానస శర్మ మహేష్ ఉప్పాల, ప్రొడ్యూసర్: నిహారిక కొణిదెల, దర్శకత్వం: మానస శర్మ, మ్యూజిక్: అనుదీప్ దేవ్, సినిమాటోగ్రాఫర్: రాజు ఎదురోలు, యాక్షన్ కొరియోగ్రాఫర్: విజయ్, ఎడిటర్: అన్వర్ అలీ, ప్రొడక్షన్ డిజైనర్: రామాంజనేయులు, ఆర్ట్ డైరెక్టర్: పుల్లా విష్ణు వర్ధన్, కాస్ట్యూమ్ డిజైనర్: సంధ్య సబ్బావరపు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేష్, ఈవెంట్ పార్టనర్: యు వి మీడియా, డిజిటల్ మార్కెటింగ్: టికెట్ ఫ్యాక్టరీ, పి.ఆర్.ఒ: సురేంద్ర కుమార్ నాయుడు, ఫణి కందుకూరి (బియాండ్ మీడియా).

# 'వార్2' ప్రమోషన్లకు యష్ రాజ్ ఫిల్మ్స్ న్యూ స్ట్రాటెజీ..

వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ సినిమాలను యష్ రాజ్ ఫిల్మ్స్ ఎప్పుడూ కూడా ప్రత్యేకంగా ప్రమోట్ చేస్తుంటాయి. ఈ మేరకు వైఆర్ఎఫ్ ప్రత్యేకమైన వ్యూహాలను అమలు చేస్తుంటుంది. వార్ 2లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ తొలిసారిగా తెరపైకి కలిసి రాబోతోన్నారు. ఈ క్రమంలో వైఆర్ఎఫ్ ప్రమోషన్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటోంది. ఇద్దరితో సపరేట్‌గా ప్రమోషన్స్ చేయించాలని టీం భావిస్తోంది. హృతిక్, ఎన్టీఆర్ కలిసి వార్ 2ని ప్రమోట్ చేయరు. ఏ ఈవెంట్‌లో గానీ ఈ ఇద్దరూ కలిసి కనిపించరు. అసలు వార్ 2 చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ ఆ ఇద్దరు. అలాంటిది ఆ ఇద్దరినీ ఒకేసారి చూడాలంటే అది తెరపైనే చూడాలి. అంతే గానీ ప్రమోషన్స్‌లో ఏ ఒక్క చోట కూడా ఈ ఇద్దరూ కలిసి కనిపించరు. నేరుగా తెరపైనే ఆ ఇద్దరినీ ఒకే సారి చూస్తేనే ఆ థ్రిల్ ఉంటుంద్ది అని యష్ రాజ్ ఫిల్మ్స్ టీం అనుకుంటోందని ఓ సీనియర్ ట్రేడ్ అనలిస్ట్ చెప్పుకొచ్చారు. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ ఎప్పుడూ కూడా తమ సినిమాలను ప్రత్యేకంగా ప్రమోట్ చేస్తుంటుంది. వార్ విషయంలోనూ ఇలాంటి ఓ స్ట్రాటజీనే ఫాలో అయింది. సినిమా రిలీజ్‌కు ముందు ఎక్కడా కూడా ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. హీరోలిద్దరూ కలిసి కనిపించలేదు. వార్ సక్సెస్ సెలెబ్రేషన్స్‌లోనే హీరోలిద్దరూ కనిపించారు. పఠాన్ విషయంలో షారుఖ్ ఖాన్ ఇదే పద్దతిని ఫాలో అయ్యారు.



# 'ప్రేమిస్తున్నా' ఫస్ట్ లుక్



వరలక్ష్మీ పప్పుల ప్రజెన్స్‌లో కనకదుర్గారావు పప్పుల నిర్మాతగా భాను దర్శకత్వంలో సరికొత్త ప్రేమకథతో రాబోతున్న సినిమా ప్రేమిస్తున్నా. సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్, ఫస్ట్ సాంగ్‌ను చిత్ర యూనిట్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకులు భీమ్స్, దర్శకులు అశోక్.జి, అనుదీప్ కె.వి, భాను బోగవరపు, కాసర్ల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐబిఎమ్ మెగా మ్యూజిక్ ఆడియో కంపెనీను లాంచ్ చెయ్యడం విశేషం. ఈ సందర్భంగా నిర్మాత కనకదుర్గారావు పప్పుల మాట్లాడుతూ, అన్ని ప్రేమకథల్లోనూ ప్రేమ ఉంటుంది, కానీ ఈ ప్రేమకథలో ఆకాశమంత ప్రేమ అనంతమైన ప్రేమ ఉంటుంది, లవ్‌లో ఇదివరకు ఎవ్వరూ టచ్ చెయ్యని ఒక డిఫరెంట్ పాయింట్‌తో ప్రేమిస్తున్నా సినిమాను తెరకెక్కించారు దర్శకుడు భాను. యంగ్ జనరేషన్ మళ్ళీ మళ్ళీ చూడాలనుకునే అనేక ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉండబోతున్నాయి. ఈ చిత్రం నుండి అరెరె సాంగ్‌ను భీమ్స్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. సుద్దాల అశోక్ తేజ అద్భుతంగా రాశారు, అనురాగ్ కులకర్ణి ఈ పాటను తనదైన శైలిలో పాడడం జరిగింది, సిద్ధార్థ్ సాలూర్ మంచి సంగీతం అందించారని తెలిపారు. దర్శకుడు భాను మాట్లాడుతూ, ఎన్నో చిత్రాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించిన సాత్విక్ వర్మ ప్రేమిస్తున్నా సినిమాతో హీరోగా లాంచ్ అవుతున్నారు. అలాగే తెలుగమ్మాయి ప్రీతి నేహా హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఇద్దరూ పోటీపడి బాగా నటించారు. నిర్మాత కనకదుర్గారావు సినిమాను ప్రేమించే మంచి టేస్ట్ ఉన్న మనిషి, మమ్మల్ని నమ్మి ఈ సినిమాను ముందుకు తీసుకొని వెళ్లారు. మంచి లవ్ స్టోరీతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాము. ప్రేమిస్తున్నా అందరికి కనెక్ట్ అయ్యే సినిమా అవుతుందని తెలిపరు. సాలూరి రాజేశ్వర రావు కుటుంబం నుండి వస్తోన్న సిద్ధార్థ్ సాలూరి ఈ సినిమాకు అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఇదొక మ్యూజికల్ లవ్ స్టోరీ కాబోతోంది. భాస్కర్ శ్యామల ఈ సినిమాకు తనదైన స్టైల్‌లో సినిమాటోగ్రఫీ అందించారు, అనిల్ కుమార్ అచ్చు గట్ల ఈ సినిమాకు ఆలోచింపజేసే విధంగా సంభాషణలు రాయడం జరిగింది, ఈ సినిమాకు నిర్వహణ మర్రి రవికుమార్, ఎడిటర్ శిరీష్ ప్రసాద్. సంగీతమే ప్రధానంగా సాగే ఈ ప్రేమకథలో వచ్చే సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా, నెక్స్ట్ ఏం జరుగుతుందో అనే సస్పెన్స్‌తో దర్శకుడు భాను రూపొందించారు.

# 'శశివదనే'లో కోమలి ప్రసాద్ హీరోయిన్



కోమలి ప్రసాద్ నటిగా తెలుగు తెరపై తనకు వచ్చి అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి నటిగా పేరు సంపాదించుకున్నారు. ఇక త్వరలోనే శశివదనే చిత్రంతో తెరపైకి రాబోతోన్నారు. ఈలోపు కోమలి ప్రసాద్ మీద సోషల్ మీడియా, మీడియాలో ఓ అసత్య ప్రచారం మొదలైంది. యాక్టింగ్ కెరీర్‌ను వదిలి పెట్టారని, డాక్టర్ వృత్తిలోకి వెళ్లారని కోమలి ప్రసాద్ మీద రూమర్లు క్రియేట్ చేశారు. దీంతో ఈ వార్తల్ని ఖండిస్తూ కోమలి ప్రసాద్ సోషల్ మీడియాలో పోస్ట్ వేశారు. అందరికీ నమస్కారం. నేను డాక్టర్ అయ్యానని, నటనకు పూర్తిగా దూరం అయ్యానంటూ అసత్య ప్రచారాలు, తప్పుదోవ పట్టించే వార్తల్ని ప్రచురిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు కూడా ఈ రూమర్లను నిజం అన్నట్టుగా ప్రచారం చేస్తున్నాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని అందరికీ స్పష్టంగా తెలియజేయాలని అనుకుంటున్నాను. ఎన్నో కష్టాలు ఎదుర్కొని, ఎంతో కష్టపడి ఇప్పటి వరకు సినిమాల్లో కెరీర్‌ను కొనసాగిస్తూ ఈ స్థాయి వరకు వచ్చాను. ఆ శివుని ఆశీస్సులతో నా కెరీర్‌ను ముందుకు సాగిస్తున్నాను. నాలో, నా శ్రేయోభిలాషులలో అనవసరమైన ఆందోళనలను రేకెత్తించేలా ఈ రూమర్లను ప్రచారం చేస్తున్నారు. ఇలా తప్పుదారి పట్టించే సమాచారం వ్యాప్తి చెందకూడదని నేను కోరుకుంటున్నాను. అందుకే ఈ స్పష్టతనిస్తూ పోస్ట్ వేస్తున్నాను. ఆ విధే నన్ను ఈ మార్గంలోకి తీసుకు వచ్చిందని నేను భావిస్తుంటాను. చివరి శ్వాస వరకు నటిగా నా బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ ప్రయాణంలో నా వెన్నంటే ఉన్న నా శ్రేయోభిలాషు లందరికీ, నా కంటే నన్ను ఎక్కువగా నమ్మిన వారందరికీ ధన్యవాదాలు. నేను ప్రస్తుతం నా స్క్రిప్ట్‌లను జాగ్రత్తగా ఎంచుకుంటున్నాను.

## స్నేహా నయా లుక్



# 'హిరణ్యకశిపు' ప్రోమో రిలీజ్

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ హోంబాలే ఫిల్మ్స్ క్లీమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి ప్రతిష్టాత్మకమైన, సెన్సేషనల్ వెంచర్ మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ (వీఎఫ్ఎక్స్) కోసం



చేతులు కలిపింది. ఈ విజనరీ యానిమేటెడ్ ఫ్రాంఛైజీ విష్ణువు దశ అవతారాల పురాణ గాథను జీవం పోస్తుంది. ఇది అత్యాధునిక యానిమేషన్, భారతీయ పురాణాల బెస్ట్ కంటెంట్‌లో ఇంతకు ముందు ఎన్నడూ ప్రయత్నించని సినిమాటిక్ స్కేల్‌తో అలరించబోతోంది. దర్శకుడు అశ్విన్ కుమార్ దర్శకత్వంలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మాతలు నిర్మిస్తున్న మహావతార్ నరసింహ, మొదటి భాగం జూలై 25, 2025న ఐదు ప్రధాన భారతీయ భాషలలో అత్యాధునిక 3డి ఫార్మాట్‌లో విడుదల కానుంది. తాజాగా విడుదలైన ప్రోమో ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టే ప్రమాదం ఉన్న హిరణ్యకశిపును పరిచయం చేస్తుంది. కళ్లు చెదిరే విజువల్స్, అద్భుతమైన సంగీతం, కాలాన్ని ప్రతిధ్వనించే పౌరాణిక వైభవంతో ఈ ప్రోమో అధర్మం రాజ్యమేలుతున్న యుగం యొక్క తీవ్రతను ప్రజెంట్ చేస్తోంది. అత్యాధునిక వీఎఫ్ఎక్స్, 3డి విజువల్స్, పవర్ ఫుల్ బీజీఎంతో, మహావతార్ నరసింహ భారతీయ సినిమాలో పౌరాణిక కథ చెప్పే స్కేల్‌ని రీడిఫైన్ చేస్తోంది. ఇది డివైన్ యూనివర్స్, విష్ణువు దశ అవతారాల అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.

# 'తమ్ముడు'లో పవర్‌ఫుల్ వుమెన్ క్యారెక్టర్స్

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా ఈ నెల 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌తో పాటు రత్న క్యారెక్టర్‌లో నటించిన తన ఎక్స్‌పీరియన్స్ తెలిపారు హీరోయిన్ సప్తమి గౌడ. కాంతార సినిమా తర్వాత దర్శకుడు శ్రీరామ్ వేణు దగ్గర నుంచి తమ్ముడు మూవీ కోసం కాల్ వచ్చింది. హైదరాబాద్ వచ్చి లుక్ టెస్ట్ ఇచ్చాను. లుక్ టెస్ట్‌లో ఒకే అయ్యాక, డైలాగ్ వెర్షన్ చెప్పారు. అప్పటికే రత్న క్యారెక్టర్ గురించి కంప్లీట్‌గా స్క్రిప్ట్ ఉంది. హార్స్ రైడింగ్ నేర్చుకోమని చెప్పారు. అరకులో షూటింగ్ చేశాం. నితిన్ భుజానికి గాయం వల్ల షూటింగ్ కొంత ఆలస్యమైంది. తమ్ముడు మూవీకి వర్క్ చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. అంబరగొడుగు అనే ఊరిలో ఉండే రత్న అనే అమ్మాయి క్యారెక్టర్ నాది. తను పవన్ కల్యాణ్ అభిమాని. నా క్యారెక్టర్ కు ఒక డిఫరెంట్ లవ్ స్టోరీ కూడా ఉంటుంది. కాంతారతో చూస్తే లుక్ వైజ్ నా క్యారెక్టర్ ఒకేలా ఉంది అనిపించవచ్చు కానీ క్యారెక్టర్‌గా చూస్తే పూర్తిగా భిన్నమైనది. తమ్ముడు కాస్త సీరియస్ సబ్జెక్ట్..ఇందులో నా క్యారెక్టర్ ద్వారా ఫన్ క్రియేట్ అవుతుంది. లయ, నితిన్ కొన్ని పరిస్థితుల్లో అంబరగొడుగు అనే ఊరికి వస్తారు. వారి జర్నీలో రత్న ఎలా భాగమైంది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. నితిన్, లయ ఉన్న సిచ్యువేషన్ తెలియకుండా వారితో నా తరహాలో జోవియల్‌గా ఉంటాను. అది ఆడియెన్స్‌కు హ్యూమర్‌ఇస్తుంది. రత్న రేడియో జాకీ కాదు. తను పాత్ర ఎలా ఉంటుందో మూవీలో చూడాలి. కొండలు, గుట్టల్లాంటి ప్రాంతంలో హార్స్ రైడింగ్ చేయాల్సివచ్చింది. రోజూ మూడు, నాలుగు గంటలు హార్స్ రైడింగ్ చేయడంతో ఇబ్బందిపడ్డాను. కానీ ఆ సన్నివేశాలన్నీ బాగా వచ్చాయనే సంతృప్తి ఉంది.పవన్ కల్యాణ్ తమ్ముడు సినిమా గురించి నాకు ఐడియా ఉంది. వేణు చెప్పారు. ఆ సినిమాతో పవన్ ఎంత పెద్ద సక్సెస్ ఇచ్చారో మనందరికీ తెలుసు. నేను కంప్లీట్ మూవీ చూడలేదు. మా మూవీ రిలీజ్ లోపు పవన్ తమ్ముడు మూవీ చూస్తాను.



హీరోయిన్ సప్తమి గౌడ

# 'సోలోబాయ్' ప్రీరిలీజ్

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై శ్రీమతి వినాద్రి, బేబీ నేహా శ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో జూలై 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. బిగ్ బాస్ సీజన్ 7 ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటిస్తూ అనిత చౌదరి, పోసాని కృష్ణ మురళి, అరుణ్ కుమార్, భద్రం, షఫీ, ఆర్కే మామ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. త్రిలోక్ సిద్దు ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేశారు. జుడా సంధ్య ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. జూలై 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వివి వినాయక్ ముఖ్య అతిథిగా హాజరు కాగా రఘు కుంచే, కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ తదితరులు హాజరై సోలో బాయ్ చిత్ర రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్ సక్సెస్ చేశారు. ఈ సందర్భంగా వివి వినాయక్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఈ చిత్ర నిర్మాత సతీష్ ఒక దర్శకునిగా ఇండస్ట్రీకి వచ్చి బట్టల రామస్వామి బయోపిక్ ద్వారా నిర్మాతగా మారారు. చాలా సాధారణ స్థాయి నుండి ఈరోజు నిర్మాతగా మారడానికి ఎంతో కష్టపడి సతీష్ ఇక్కడ వరకు వచ్చారు. ఈ చిత్రంలో నటించిన గౌతమ్ కృష్ణకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను. అలాగే చిత్ర బృందం అందరికీ ఆల్ ద బెస్ట్. ఈ సినిమా మంచి విజయం సాధించి సతీష్ ప్రయాణానికి తోడ్పడాలని కోరుకుంటున్నాను అన్నారు. రఘు కుంచే మాట్లాడుతూ, చిత్ర ఈవెంట్‌కు వచ్చిన అందరికీ నమస్కారం. నిర్మాత సతీష్ నాకు ఎంతోకాలంగా పరిచయంఉన్నారు. దర్శకుడుకావాలని వచ్చి నిర్మాతఅయ్యారు. ఆయన ఓటిటి ద్వారా విడుదల చేసిన బట్టల రామస్వామి బయోపిక్ ఎంతో మంచి విజయాన్ని సాధించింది. ఆ తర్వాత ఆర్పి పట్నా యక్ గారితో కలిసి చేసిన కాఫీ విత్ ఎ కిల్లర్ ఎంతో పాపులర్ అయింది. ఇప్పుడు సోలో బాయ్ ద్వారా వెండిస్తల పైకి రానున్నారు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. చిత్ర బృందం అందరికీ ఆల్ ది బెస్ట్. సినిమాలు అందరూ ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను అన్నారు. కె ఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, నాకు ఈరోజే సతీష్ దర్శకుడు కావాలని వచ్చి నిర్మాత వేయాలని తెలిసింది. ఇటువంటిది వినడం ఇదే మొదటిసారి. ప్యాషన్‌తో వచ్చి సినిమాలు చేసే అతి తక్కువ మందిలో సతీష్ ఒకరు.






ఆమె స్టేజ్ ఎక్కిందంటే చాలు... ఓ పక్క ర్యాప్‌తో రప్పాడిస్తుంది... మరోవైపు హిప్‌హాప్ అదరగొట్టేస్తుంది. తను మరెవరో కాదు... తెలుగమ్మాయి శ్వేతారావు ఎల్లాప్రగడ ఉరఫ్ రాజకుమారి. తాజాగా అమెరికన్ మ్యూజిక్ అవార్డును గెలుచుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ అమెరికన్

# అమెరికన్ మ్యూజిక్ అవార్డు గ్రహీత

నుదుట బొట్టు .... భారతీయత ఉట్టిపడేలా కట్టు... పాశ్చాత్య ప్రపంచాన్ని ఉర్రూతలూగించే అమెరికన్ యాస... ఇవీ రాజకుమారి ప్రత్యేకతలు! తెలుగు అమ్మాయే అయినా పుట్టిపెరిగిందంతా అమెరికాలోనే కానీ, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను మాత్రం వదల్లేదు. ఏటా హైదరాబాద్‌లోని ఆమె నానమ్మ దగ్గరికి వచ్చి కొన్నాళ్లు గడిపి వెళ్లేదట. ఈ క్రమంలోనే ఐదేళ్ల వయసు నుంచే కూచిపూడి, కథక్, భరతనాట్యం.. వంటి నృత్యరీతుల్లో ప్రావీణ్యం సంపాదించిన ఆమె... దేశవిదేశాల్లో ప్రదర్శనలిచ్చింది. ఏడోతరగతిలో ఉండగా... అమెరికాలోని హిప్‌హాప్ గ్రూప్ 'ఫ్యూజ్' చేసిన 'ది స్కోర్' ఆల్బమ్ చూసి ఆసక్తి పెరిగింది. 14 ఏళ్లు వచ్చేసరికి హిపోప్ డ్యాన్సర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. మరోపక్క ర్యాపర్‌గా పాటలు రాస్తూ, పాడుతూ పాపులారిటీ సంపాదించుకుంది. శ్వేత సృజనను గుర్తించిన స్నేహితులు ఆమెను 'ది ఇండియన్ ప్రిన్సెస్'గా పిలిచేవారట. దానర్థం తెలుగులో రాజకుమారి కాబట్టి ర్యాపర్‌గా మారాక దాన్నే తన పేరుగా మార్చుకుంది. ఆపై కొన్నాళ్లకే తన ప్రతిభతో సంగీతంలో నోబెల్ సమానమైన గ్రామీ అవార్డుకు నామినేట్ అయ్యింది. ఆపై పాటల రచనకు ప్రతిష్టాత్మక బీఎంఐ పాప్ అవార్డునూ అందుకుంది. ఎంటివి యూరోపియన్ మ్యూజిక్ అవార్డుకు మూడుసార్లు నామినేట్ అయ్యింది. ఎంటీవీ హాజిల్ సీజన్ 1కు జడ్జిగా వ్యవహరించింది. 2023లో 'ఆల్‌ఫాల్ డౌన్‌'కోసం పనిచేసింది. గత ఏడాది ఆర్కేన్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సీజన్2 కోసం పాడిన 'రెనెగేడ్' పాటతో తాజాగా అమెరికన్ మ్యూజిక్ అవార్డుని గెలుచుకుంది. సంగీత రంగంలో వివక్షను ఎదుర్కొంటోన్న గాయనులకు అవకాశాలు కల్పించేందుకు 'గాడ్‌మదర్ రికార్డ్స్' పేరుతో లేబుల్‌ని ఏర్పాటు చేసింది. ఇక, బాలీవుడ్‌ల జోయా అక్తర్ తీసిన 'గల్లీబాయ్' చిత్రంలో జడ్జిగా కనిపించడంతో పాటు జవాన్, 'బేబీజాన్' వంటి చిత్రాలకు తన గాత్రాన్నీ అందించింది. పలు ఆల్బమ్‌లూ తీసుకొచ్చింది. 'కాశీ టూ కైలాశ్' ఆమె తాజా ఆల్బమ్. రాజకుమారికి చిన్నప్పటి నుంచి సేవాగుణం ఎక్కువే. తన ప్రదర్శనల ద్వారా వచ్చిన ఆదాయంతో అనేక దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అలా బెంగళూరులో ఓ హాస్పిటల్‌నీ నిర్మించడంతోపాటు హైదరాబాద్‌లో దివ్యాంగ విద్యార్థులకోసం ఓ ధ్యాన కేంద్రాన్నీ ఏర్పాటు చేసింది ఇండియన్ హిప్‌హాప్ క్వీన్.

# పాడి పరిశ్రమకు మహిళ వెన్నెముక

మనదేశంలో పాడి పరిశ్రమకు మహిళ వెన్నెముక. ఆమె లేకుండా పాల కేంద్రాల్లేవు. సహకార పాల సంఘాలు. గుజరాత్‌లోని ఆనంద్ నుంచి చిత్తూరులోని శ్రీజ, కరీంనగర్‌లోని ముంకమారుల వరకూ రోజూ వెల్లువెత్తుతున్న లక్షల లీటర్ల పాల వెనకున్నది ఆడవాళ్లే మరి.



ఇంట్లో పాడి ఉంటే అన్ని ఉన్నట్లే పంచభక్ష్య పరమాన్నాలకీ లోటుండదు. దీన్ని బలంగా నమ్మేది ఆ ఇంటి ఇల్లాలే. చనుబాలిచ్చి పెంచే ఆ తల్లికే తెలుసు... డెయిరీ పాలల్లోని పోషకాల విలువ... అందుకే పశువుల్నీ ప్రేమగా సాకుతుంది. ఆ పాలతో పిల్లల్ని ఆరోగ్యంగా పెంచుతుంది. ఇంటి యజమాని పట్టించుకున్నా లేకున్నా ఒకటి రెండు ఆవులు లేదా గేదెలతోనే కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటుంది. తద్వారా దేశ జీడీపీ వృద్ధికి సాయపడుతోంది. అక్షరం తెలియకున్నా అలవోకగా వేళ్లమీద లెక్కలుగట్టి పాల వ్యాపారం చేయగల సమర్థత మహిళలకే చెల్లు మరి. కాబట్టి మనదేశంలో పాడి పరిశ్రమలో స్త్రీల వాటా 70 శాతం పైనే పశువులకు మేత వేయడం, నీళ్ల పట్టడం, వాటి శుభ్రత, పాలు పితకడం.. వాటితోపాటు పాల నుంచి నెయ్యి, పెరుగు, వెన్న వంటి ఉత్పత్తుల తయారీలోనూ ప్రధాన పాత్ర వాళ్లే వాటి పాలన, పోషణలో సంప్రదాయ విధానాలతోపాటు అధునాతన టెక్నాలజీని అందజేస్తున్నారు. నాణ్యత, పరిశుభ్రత, సరైన ప్రణాళిక డిజిటల్ పరిజ్ఞానం, మార్కెటింగ్ చొరవలతో పాడి పరిశ్రమ తమకంటూ ప్రత్యేక "స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఫలితమే పాడి ద్వారా ఆదాయాన్ని సాధికారత సాధిస్తోంది. ఉత్తమ మహిళా డెయిరీ రైతులుగా అవార్డుల్నీ గెలుస్తున్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (ఐడిఎ) ఇటీవల నిర్వహించన దక్షిణాది సదస్సులో రాష్ట్రాల వారీగా నిలిచారు.



**27 మందితో మొదలై..**

'సాగులో నష్టపోయాం దీనితో ఆవులనే నమ్ముకుని బతకాల్సిన పరిస్థితి ఇక్కడ శ్రమంతా ఆడవాళ్లదే తీరా ప్రైవేట్ డెయిరీలకి ఎంత నాణ్యంగా పాలు పోసినా వాళ్లెంత ఇస్తే అంతే తీసుకోవాలి. ఇది గమనించిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డిడిబి)' తిరుపతిలో 'మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' సంస్థని పెట్టారు. 'మహిళలే ఉత్పత్తిదారులు... మహిళలే యజమానులు' అంటూ పాల విక్రయాలపై గ్రామాల్లో అవగాహనా కల్పించారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లాలోని మా రెడ్డికోటకు వచ్చారు. ఆసక్తి కలిగి చేరా. మా పాలను మేమే అమ్ముకుని డబ్బులు తీసుకునేలా ఏర్పాటు చేశారు. అలా నాతో కలిపి 27 మందితో సంస్థ ఏర్పాటైంది. ప్రతి ఒక్కరినీ యజమానులను చేయాలని లీటర్‌కి రూపాయి చొప్పున పెట్టుబడి పెట్టించి వారికి యాజమాన్య హక్కులు కల్పించారు. 15 రోజులకోసారి మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేశారు ఎక్కువ పాలు పోసినవారికి ఏటా బోనస్ ఉంటుంది. ఈ సేవలతో ఎన్నో అవార్డుల్నీ అందుకున్నాం. ఒకప్పుడు పిల్లలను చదివించే స్తోమత లేదు ప్రస్తుతం మా పాప విదేశాల్లో ఎంఎస్ చేస్తోంది.. ఫౌండర్ మెంబర్‌గా చేరిన నేను ఛైర్మన్‌ని అయ్యా అంటారు శ్రీదేవి బోర్డులో అత్యధికంగా 11 మంది మహిళలే, రోజుకు 7.5 లక్షల లీటర్ల పాలను సేకరిస్తారు. ఇటీవల ముఖ్యమంత్రి కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు సొంత యూనిట్ ఏర్పాటుకు స్థలం కావాలనడిగితే 40 ఎకరాలు కేటాయించారు. ఈ రూ.283 కోట్ల ప్రాజ్ ద్వారా 4 వేల మందికి ఉపాధి కల్పించనున్నాం. 'ఓనర్స్ యాప్' రూపొందించి ఎన్ని పాలు, ఎంత నాణ్యతతో పోశారు? వచ్చిన మొత్తం వంటివన్నీ చెక్ చేసుకునేలా చూస్తున్నాం త్వరలో రోజుకి పది లక్షల లీటర్ల పాలు సేకరించాలి. టాప్ 10 డెయిరీల్లో శ్రీజ ఒకటిగా నిలిచేలా చేయాలన్నది మా ఆశయం అంటారు శ్రీదేవి ఉద్యోగులు 600 మందికి పైనే ఉన్నారు.

# ఈ తరం మెచ్చే నగలు



ఫ్యాషన్ దుస్తులతోపాటూ జ్యువెలరీలోనూ కొత్త ట్రెండ్స్ ఫాలో అవ్వాలనుకుంటున్నారా.. అయితే మార్కెట్లో మెరిసిపోతున్న ఈ సరికొత్త నగల్ని ప్రయత్నించి చూడండి. అద్భుతమైన నగిషీలతో దేవుడి ఉంగరాలూ, అదిరిపోయే డిజైన్లతో పూసల పెండెంట్లూ ఆకట్టుకునే మెడల్లతో రుద్రాక్షల బ్రేస్‌లెట్లూ.. ఈ తరం మనసును దోచేస్తున్నాయి.

## దేవుళ్ల ఉంగరాలు..

**అమ్మమ్మల** నుంచి అమ్మాయిల వరకూ అందర్నీ మెప్పించే నగలేవైనా ఉన్నాయా అంటే.. అవి కచ్చితంగా టెంపుల్ జ్యువెలరీనే. హారాల దగ్గర్నుంచి గాజుల వరకూ



ప్రతిదాంట్లోనూ కనిపించిన ఈ టెంపుల్ థీమ్. నగల ప్రియుల్ని బుట్టలో పడేస్తూ ఈ మధ్య చేతి ఉంగరాల్లోకీ చేరిపోయింది. అప్పట్లో చిన్న డిజైన్లలో కనిపించే దేవుళ్ల చిత్రాలు.. ఇప్పుడు చక్కటి నగిషీలూ, రత్నాల మెరుపులతో అచ్చంగా దేవుడి విగ్రహ రూపాల్లా వస్తున్నాయి. లక్ష్మీదేవి, వేంకటేశ్వరస్వామీ, శివపార్వతులూ.. ఇలా ఎందరో దేవుళ్ల రూపాలతో వజ్రాలూ, కెంపులూ, పచ్చలూ, నీలాల రాళ్ల చమక్కుల్ని జత చేసుకుని కనువిందు చేస్తున్నాయి. ఆడవాళ్లతోపాటు మగవాళ్లకూ వీటిల్లో రకరకాల డిజైన్లు దొరుకుతున్నాయి. అనుక్షణం తమ ఇష్టదైవాన్ని స్మరించుకునేవాళ్లు ఈ టెంపుల్ థీమ్ ఉంగరంతో ఆ దేవుడి రూపాన్ని కళ్లముందుకు తెచ్చుకోవచ్చు.

## రుద్రాక్షల బ్రేస్‌లెట్ !

**భగవంతుడికి** ప్రతిరూపమని చెబుతూ కొందరూ, వాటిని ధరించడం వల్ల ఆరోగ్యమంటూ మరికొందరూ.. ఇలా రకరకాల నమ్మకాలతో రుద్రాక్షల్ని ధరిస్తారు. అలాంటివారిని దృష్టిలో పెట్టుకుని ఎంతో పవిత్రంగా భావించే ఆ రుద్రాక్షల్ని- మామూలు దారానికి కట్టుకునే బదులు విలువైన బంగారు నగల్లో తీసుకొస్తే ఎలా ఉంటుంది. అనుకున్నారేమో తయారీదారులు చిన్న చిన్న బంగారు రుద్రాక్షల లాకెట్లతోపాటూ బ్రేస్‌లెట్లనీ తీసుకొచ్చేశారు. ఈ తరానికి నచ్చేలా ట్రెండీ డిజైన్లలో వీటిని తయారుచేస్తున్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా స్వస్తిక్, ఓం, త్రిశూలం లాంటి గుర్తుల్నీ బ్రేస్‌లెట్లకి జత చేస్తున్నారు. మిగతా వాళ్ల సంగతేమోకానీ దైవభక్తి ఉన్నవాళ్లకు బహుమతిగా ఈ రుద్రాక్షల బ్రేస్‌లెట్‌ని అందించారంటే కచ్చితంగా అది వారికి అపురూపమైన కానుకే అవుతుంది.



## పూసల పెండెంట్లు!

**బంగారమేంటీ..** రత్నాలేంటీ. పూసలేంటీ.. అన్నీ నగల్లో భాగం కావాల్సిందే, అమ్మాయిల మెడని చుట్టి అందాల ఆభరణంగా మారాల్సిందేనంటూ డిజైనర్లు సరికొత్త జ్యువెలరీని తీసుకొస్తుంటారు. అందులో భాగంగా కొత్తగా డిజైన్ చేసినవే ఇక్కడున్న ఈ పూసల పెండెంట్లు. అందమైన బంగారు డిజైన్ల వెనక రంగు రంగుల పూసల వరసల్ని జోడిస్తూ.. లాకెట్టునే చక్కని కళా చిత్రంలా తీర్చిదిద్దుతున్నారు. రాధాకృష్ణులూ, నెమళ్లూ, పువ్వులూ, చెట్లూ.. ఇలా బోలెడన్ని డిజైన్లతో ఉండే ఈ లాకెట్లకు బ్యాక్‌గ్రౌండ్‌లో మెరిసే రాళ్ల పూసలు సరికొత్త అందాన్ని తీసుకొస్తున్నాయి. కొంచెం సంప్రదాయంగానూ, మరికొంచెం ట్రెండీగానూ కనిపించే ఈ పెండెంట్లని ఎక్కువగా బీడ్స్ హారాలకు వేసుకుంటున్నారు. అటు బంగారమూ ఇటు పూసలూ కలగలిసి పోతూ మెరిసే ఈ నగలు- తక్కువ బంగారం తోనే ఓ చక్కని ఆభరణం చేసు కోవాలను కునేవారికి తప్పక నచ్చేస్తాయి.













# మహిళలే త్వరగా కోలుకుంటారు !



ఏదైనా చిన్న దెబ్బతగిలినా పట్టించుకోకుండా పనిచేసే అమ్మని మనం చాలా సార్లే చూసుంటాం. తనే కాదు, మహిళలు చాలామంది ఇలానే చేస్తుంటారు. ఈ విషయాన్ని సాదాసీదాగా చెప్పడం లేదు. మగవారితో పోలిస్తే, ఆడవాళ్లు వేగంగా గాయల నుంచి కోలు కోగలుగు తారని పలు అధ్య య నాలు వెల్లడి స్తున్నాయి. అందుకు కారణం మనలోని హార్మోనులే. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, గాయాలు త్వరగా మానేలాచేస్తాయట.

# చికెన్ డోనట్స్



సాయంత్రం వేళ చికెన్ డోనట్స్ తింటే బాగుంటుంది కదూ! ఇవి పార్టీ స్టార్టర్స్ కూడా. ఈ డోనట్స్‌ను సులభంగా తయారు చేసే విధానం తెలుసుకుందాం.

**కావలసినవి :** చికెన్ కీమా-పావుకిలో, వెల్లుల్లి తరగు- చెంచా, బంగాళదుంప- ఒకటి ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు-పావు కప్పు, చొప్పున, క్యారెట్లు-2, చిల్లీ ఫ్లేక్స్, జీలకర్ర పొడి, బ్లాక్ పెప్పర్ పౌడర్-పావు చెంచా చొప్పున, కారం-అర చెంచా, ఉప్పు-తగినంత, మైదా పిండి, బ్రెడ్ పౌడర్-2 టేబుల్ స్పూన్లు చొప్పున, గుడ్డు-ఒకటి, నూనె-వేయించేందుకు సరిపడా.

**తయారీ :** ముందుగా బంగాళదుపంలు ఉడికించాలి. కారెట్లను తురమాలి. చికెన్, వెల్లుల్లి, బ్రెడ్ పొడి, ఉల్లిపాయ ముక్కలు, క్యారెట్ తురుము, కారం, చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు జీలకర్ర పొడి, బ్లాక్ పెప్పర్‌పొడి, కొత్తిమీరలను బ్లెండర్ జార్‌లోకి తీసుకుని మెత్తని పేస్టుగా చేసుకోండి. ఒక ప్లేట్‌లో నూనె రాసి.. చికెన్ పేస్ట్‌ను వడల ఆకృతిలో చేసి.. 3 గంటలు ఫ్రీజర్‌లో ఉంచండి. ఒక గిన్నెలో గిలకొట్టిన గుడ్డు, మరో గిన్నెలో మైదాపిండిని సిద్ధంగా ఉంచండి. కడాయిలో నూనె వేడి చేయండి. ఫ్రీజ్ చేసిన చికెన్ డోనట్స్‌ను ఒక్కొక్కటిగా ముందు గుడ్డు సొనలో, తరువాత మైదాపిండిలో ముంచి.. ఆపై నూనెలో వేయిండి. మీడియం మంట మీద బంగారు రంగులోకి మారాక తీస్తే.. రుచికరమైన చికెన్ డోనట్స్ రెడీ వడ్డించి ప్రశంసలు అందుకోండి.

# వ్యథ: ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపండి

**ప్రశ్న :** మా అమ్మాయికి ఎనిమిదేళ్ళు మూడవ తరగతి చదువు తోంది. స్కూలుకువెళ్ళడానికి మారాం చేస్తోంది. బలవంతంగా తీసుకెళ్ళి క్లాస్‌రూంలో కూర్చోబెట్టాల్సి వస్తోంది. ఒక్కోరోజు బాగానే ఉంటుంది. ఒక్కో రోజు ఏడ్చి నానాహాగమా చేస్తుంది. స్కూలు అంటే భయం వల్ల అన్నం తినడం కూడ బాగా తగ్గించి వేసింది. దీనితో తన ఈడు పిల్లలకంటే బలహీనంగా తయారు అయ్యింది. తరచు కడుపు నొప్పి అంటుంది. అన్నం తినమంటే ఆకలి వేయడం లేదంటుంది. తరచు జలుబు, జ్వరం వస్తోంది. కొన్ని సార్లు దగ్గు వస్తుంది. స్కూలులో టీచర్లు బాగా చూసుకుంటారు. కొట్టడం, తిట్టడం, భయపెట్టడం చేయరు. అయినా స్కూలుకు వెళ్ళడానికి ఎందుకు మొండికి వేస్తున్నదో తెలియడం లేదు. నేను, మావారు ఇద్దరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచర్లుగా పని చేస్తున్నాము. మా అమ్మాయిని పేరున్న ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాము. నేను టీచర్ ట్రైనింగ్ కూడా చేశాను. మాకున్న మానసిక శాస్త్ర పరిజ్ఞానంతో కౌన్సెలింగ్ చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. మా పాప స్కూలు ఫోబియాతో బాధపడుతున్నదని ఆమె స్కూలు హెడ్‌మిస్ చెప్పారు. కాబట్టి సైకాలజిస్టు ద్వారా కౌన్సెలింగ్ చేయించమని సలహా ఇచ్చారు. మేము కూడా పాపకు ఎన్నో బుద్ధిమాటలు చెపుతున్నాము. గొప్పగా చదివితే వచ్చే ప్రయోజనాలు చెప్పి ప్రేరణ కలిగించే ప్రయత్నం చేస్తున్నాము. గొప్ప లక్ష్యం పెట్టుకోవాలని సూచిస్తున్నాము. అయినా ఆమెలో ఎందుకు మార్పురావడం లేదో అర్థం కావడం లేదు. సైకాలజిస్టు అయినా మాలాగే కదా మాటలు చెపుతారు. మేము చెపితే మారని అమ్మాయి సైకాలజిస్టు చెపితే ఎలా మారుతుందన్న అనుమానం ఉంది. మా అమ్మాయి లాంటి వారు అక్కడక్కడ ఉన్నారు. కాబట్టి పిల్లలకు స్కూలు ఫోబియా పోవాలి అంటే ఏమి చేయాలో తగిన సూచనలు చేయండి. **- ఒక సోదరి, చిత్తూరు.**





ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**జవాబు :** అమ్మా, బాల్యం నుంచే పిల్లల్ని మేధావుల్ని చేయాలన్న భావన ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తోంది. పేరున్న పాఠశాలల్లో చదివిస్తే గొప్పవారవుతారన్న నమ్మకం కూడ ఎక్కువ మందిలో ఉంది. అయితే పిల్లల శారీరక, మానసిక, సామాజిక ఎదుగు దలను గూర్చి పట్టించుకునే వారి సంఖ్య తగ్గిపోతున్నది అనిపిస్తోంది. పిల్లలు బాగా చదవాలి అంటే శారీరక ఆరోగ్యం, శక్తి, సామర్థ్యం బాగుండాలి అన్న విషయంన గుర్తు పెట్టుకోవాలి. ఇంగ్లీషులో 'సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ' అంటారు. అంటే శక్తివంతమైన శరీరంలో సమర్థవంతమైన మేదస్సు ఉంటుందని అర్థం. సహజంగా కొందరు పిల్లల్లో ఆరోగ్య సమస్యలు ఉంటాయి. వాటిని సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోతే దాని ప్రభావం చదువుపై ఉంటుంది. కంటి సమస్యలు ఉన్నవారి సరిగా చదవలేరు. కళ్లల్లో నీరువస్తుంది. కొద్దిసేపు చదవగానే తలనొప్పి, విసుగు చిరాకు కలుగుతుంది. కడుపులో నులిపురుగులు ఉంటే తరచు కడుపునొప్పి వస్తుంది. దీనివల్ల తలనొప్పి,కోపం వచ్చి ఏకాగ్రత దెబ్బతింటుంది. కొందరు పిల్లల్లో ఆకలి లేదా జీర్ణసమస్యలు ఉంటాయి. వీరు తగినంత ఆహారం తీసుకోకపోవడం వల్ల నీరసం, నిస్సత్తువ ఆవహించి చదవాలన్న ఉత్సాహం తగ్గిపోతుంది. అలాగే పలు శారీరక సమస్యల వల్ల సరిగా చదవలేక భయం పెంచుకుంటారు. కొందరిలో భయం, ఆందోళన ఫోబియా, సిగ్గు, బిడియంలాంటి సమస్యలు ఉంటాయి. సంపూర్ణ శారీరక ఆరోగ్యం ఉండి, మానసిక సమస్యలు ఉన్నప్పుడు వాటికి కారణాలు గుర్తించి పరిష్కార మార్గాలు పరిశీలించాలి. మీ అమ్మాయి లక్షణాలను బట్టి ఆమెకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. కాబట్టి డాక్టరును సంప్రదించి చికిత్స చేయించండి. తరవుఆత కూడ మార్పు రాకపోతే సైకాలజిస్ట్‌ను సంప్రదించండి. రోజు ఆడించడం పిల్లలతో కలిసి తిరగడానికి అవకాశం కల్పించండి.

# భోళా సాయి !






ఆధ్యాత్మికం

**గతంలో సాయిబాబా** పేరు వినని వారు, సాయిభక్తులుగా మారటం సాయి సాహిత్యంలో గమనించదగిన అంశం. శ్రీ జగదీశ్ మున్షీ బొంబాయిలో అడ్వకేటు, ఘనత మహించిన శ్రీ కె.యం, మున్షీ కుమారుడు. జగదీశ్ మున్షీ ఆయన కుటుంబంతో ఒకసారి ప్రయాణం చేస్తుంటే (1948)లో రజాకర్లు ఆయన ప్రయాణం చేస్తున్న రైలును సర్వనాశనం చేయటం, తాము ఉన్న పెట్టె మాత్రం సురక్షితంగా ఉండటం, కేవలం సాయినాథతుని కృప అని గ్రహించాడు. అంతమాత్రాన ఆయన సాయి భక్తుడు కాలేదు. 1053లో కుటుంబంలోని కలతల వలన, ఆ కలతలను సాయి బాబా తొలగించగలడని, సాయి బాబా ఫొటోను తెచ్చి పూజించసాగాడు. ఆయన ఆర్తిని, నమ్మకమును సాయి గమనించాడు. చిక్కులు తొలగినవి. సాయి బాబా భక్తుడైనాడు జగదీశ్ మున్షీ. కాకతాళీయంగా చిక్కులు తొలగినవేమో అని శంకించుట మానలేదు. ఆయన ఇంకో రెండోండ్లు గడిచాయి. ఆయనలో ఏ మార్పు రాలేదు. మే నెలలో ఒకనాడు ఆయన సూరత్ నుండి బొంబాయికి రైలులో బయలుదేరాడు మొదటి తరగతిలో, రైలు ప్రయాణిస్తోంది. జగదీశ్ ఉదరంలోని రాళ్ళు ఆయనను బాధపెట్టసాగాయి. నిలబడకలేక, పరుండలేకపోయాడు. ఏమి చేయాలో అర్థంకాని అయోమయంలో ఉన్నాడు. అర్ధరాత్రి సమయానికి నొప్పి ఎక్కువైంది. మూత్రముతోపాటు రక్తం కూడా వస్తోంది. తట్టుకోలేక, ప్రక్కనే నిద్రిస్తున్న తోటి ప్రయాణికుడిని లేపి తన పరిస్థితి చెప్పి, గార్డును తీసుకురమ్మన్నాడు. గార్డు రైలులో ఎవరైనా డాక్టరు ఉన్నాడేమో అని ప్రయత్నించాడు. ఎవరూ లేరు. వచ్చే పాల్ఘాట్ స్టేషన్‌లో దిగి, అక్కడ ఉండే డాక్టర్లచే చికిత్స పొందమన్నాడు. జగదీశ్ దిగాడు. స్టేషన్‌లో డాక్టరు లేదు. జగదీశ్ బాధతో మెలికలు తిరిగిపోసాగాడు. డాక్టరుకు కబురు పంపితే రానన్నాడు. కారులాంటి ప్రయాణ సాధనంలేదు. చివరకు ఒంటెద్దు బండిలో డాక్టరు వద్దకు బయలుదేరాడు. దారిలో ఇక ఎవ్వరూ ఏమీ చేయలేరని గ్రహించి బాబాను ప్రార్థించాడు జగదీశ్. అదృష్టం బాగుంది. డాక్టరు ఇంట్లో ఉన్నాడు. చికిత్స చేశాడు. జగదీశ్ కోలుకున్నాడు. తనను శరణంటే చాలు, సాయిబాబా తనను నమ్మిన వారిని, నమ్మని వారిని కూడా కాపాడతాడు భోళా శంకరుని వలె. సాయి భోళా సాయిబాబా.

**- యం.పి.సాయినాథ్**

ఆట



# వింబుల్డన్ నుండి జ్వెరెవ్ ఔట్

## ఒలింపిక్ ఛాంపియన్ క్విన్వెన్ సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** అలెగ్జాండర్ జ్వెరెవ్ 2019 తర్వాత తొలిసారి గ్రాండ్ స్లామ్ నుంచి నిష్క్రమించాడు. వింబుల్డన్ తొలి రౌండ్‌లో జర్మన్ మూడో సీడ్ ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెచ్ చేతిలో ఓడిపోయాడు. జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్న జ్వెరెవ్, ఆట ప్రారంభమైన టైబ్రేక్‌లో తన తాజా వింబుల్డన్ పరాజయాన్ని చవిచూశాడు. మూడుసార్లు గ్రాండ్ స్లామ్ రన్నరప్ అయిన జ్వెరెవ్, ఫెడరల్ కోర్టులో నాలుగు గంటల 40 నిమిషాల పాటు జరిగిన మారథాన్ పోరులో ప్రపంచ 72వ ర్యాంకర్ చేతిలో 7-6 (7/3), 6-7 (8/10), 6-3, 6-7 (5/7), 6-4 తేడాతో ఓటమి పాలయ్యాడు. 28 ఏళ్ల ఈ వ్యక్తి ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో ఈ సంవత్సరం పురుషుల సింగిల్స్‌లో ఇప్పటివరకు అత్యధిక ర్యాంక్ పొందిన సీడ్‌గా ఉన్నాడు. కాగా ప్రపంచ 81వ ర్యాంక్ క్రీడాకారిణి కాటెరినా సినియకోవా చేతిలో చైనా ఒలింపిక్ ఛాంపియన్ జెంగ్ క్విన్వెన్ మొదటి రౌండ్ వింబుల్డన్ ఓటమి పాలైంది. కోర్ట్ త్రీలో జరిగిన రెండు గంటల 25 నిమిషాల తీవ్రమైన వేడిలో జెంగ్ 7-5, 4-6, 6-1 తేడాతో అనూహ్యమైన చెక్ క్రీడాకారిణి చేతిలో ఓడిపోయి వరుసగా మూడో సంవత్సరం తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఆమె గత ఆరు గ్రాండ్ స్లామ్ మ్యాచ్‌లలో జెంగ్ మూడో రౌండ్ దాటలేకపోవడం ఇది నాల్గవసారి, 2024 యుఎస్ ఓపెన్ మరియు ఈ సంవత్సరం ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్ పరుగుల కారణంగా ఆమె పరుగులకు అంతరాయం కలిగింది.

# మహిళల టి20లో భారత్ హ్యాట్రిక్ విక్టరీ



## 24 రన్స్ తేడాతో ఇంగ్లండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన మహిళల రెండో టీ20లో టీమిండియా 24 పరుగుల తేడాతో హ్యాట్రిక్ విక్టరీ సాధించింది. బ్రిస్టల్‌లోని కౌంటీ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించడంలో భారత్ బ్యాట్స్‌మన్ జెమిమా రోడ్రిగ్స్, ఆల్ రౌండర్ అమన్‌జోత్ కౌర్ కీలకంగా వ్యవహరించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తిరిగి రావడంతో భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి వెళ్లడానికి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (3) మరియు స్మృతి మంధాన (13) విఫలమవడంతో జట్టుకు అత్యుత్తమ ఆరంభాలు లభించలేదు. హర్మన్‌ప్రీత్ కూడా ఒక్క పరుగు మాత్రమే చేసి 5.1 ఓవర్లలో 31/3కి తీసుకురావడంతో పరిస్థితి మరింత దిగజారింది. క్రీజులో ఉన్న జెమీమాతో అమన్‌జోత్ సహకరించడంతో నాల్గవ వికెట్‌కు 9.1 ఓవర్లలో 93 పరుగులు జోడించారు. జెమిమా 41 బంతుల్లో 63 పరుగులు చేసి తొమ్మిది బౌండరీలు, ఒక సిక్సర్ తోడుగా నిలిచి భారత్‌ను ఇబ్బందుల నుంచి బయటపడేసింది. అమన్‌జోత్ మరో ఎండ్ 40 బంతుల్లో తొమ్మిది బౌండరీలతో 63 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. అమన్‌జోత్‌కు రిచా ఘోష్ జత కావడంతో ఆమె 20 బంతుల్లో 32 ఆజేయంగా ఆజేయంగా నిలిచి భారత్ 181/4 పరుగులు చేయడంలో సహాయపడింది. గట్టి స్కోరును ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ జట్టు 3.3 ఓవర్లలో 17/3కి పడిపోయింది. ఓపెనర్ సోఫియా డంక్లీ (1) రనౌట్ కాగా, దీప్తి శర్మ తన భాస్వామి డేనియల్ వ్యాట్‌హాడ్జ్ (1)ను అవుట్ చేసింది. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సాధించిన టామీ బ్యూమాంట్ కూడా ఎక్కువసేపు నిలవలేదు, అమన్ ఆమెను కేవలం 13 పరుగులకే పంపించింది. ఆ తర్వాత టామీ బ్యూమాంట్ (54), అమీ జోన్స్ (32) ఐదో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యంతో ఇంగ్లాండ్‌కు గట్టి మద్దతు ఇచ్చారు, సోఫీ ఎక్లెస్టోన్ (35) అజయంగా కనిపించినప్పటికీ, బ్యూమాంట్ వికెట్ పడటంతో సిరీస్‌ను సమం చేయాలనే ఇంగ్లాండ్ ఆశలు దాదాపుగా దెబ్బ తిన్నాయి. భారతదేశం తరఫున, ఎడమచేతి వాటం స్పిన్నర్ శ్రీ చరణి 2/28తో అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలవడంతో ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 157/7కే పరిమితం చేయబడింది.

# ఆసియా మహిళల టేబుల్ టెన్నిస్‌లో దివ్యాంశికి స్వర్ణం

## చైనాపై విజయంతో టైటిల్ సొంతం

### తానీషా జోడీకి కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా జూనియర్ మరియు క్యాడెట్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ ప్యాడ్లర్ దివ్యాంశి భౌమిక్ అండర్ 15 మహిళల సింగిల్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించింది, టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా 36 ఏళ్ల తర్వాత భారత్ మళ్లీ ఛాంపియన్‌గా నిలిచింది. ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో జరిగిన ఫైనల్లో చైనాకు చెందిన జు కిహుయ్‌తో జరిగిన పోటీలో, 14 ఏళ్ల దివ్యాంశి 54 నిమిషాలకు పైగా కొనసాగిన పోరులో 13-11, 11-8, 8-11, 12-10, 9-11, 11-8 తేడాతో విజయం సాధించింది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో ఆమె చైనాకు చెందిన లియు జిలింగ్‌ను 4-3 తేడాతో ఓడించింది. ప్రతిభావంతమైన యువ ప్యాడ్లర్లలో ఒకరిగా పరిగణించబడే దివ్యాంశి, 36 సంవత్సరాలలో ఆసియా క్యాడెట్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారతీయురాలిగా నిలిచింది. 1989లో ఢిల్లీలో స్వదేశీ ప్రేక్షకుల ముందు స్వర్ణం గెలిచిన సుబ్రమణియన్ భువనేశ్వరి ఈ టైటిల్ గెలుచుకున్న చివరి భారతీయురాలు. దివ్యాంశి మొదట రెండు వరుస గేమ్‌లతో 30 విజయంతో తన గ్రూప్‌ను అగ్రస్థానంలో నిలిపి నాకౌట్ రౌండ్లకు చేరుకుంది. తర్వాత ప్రీక్వార్టర్స్‌లో జపాన్‌కు చెందిన హిసా ఉరియును 3-0 తేడాతో ఓడించి, క్వార్టర్స్, సెమీస్ మరియు ఫైనల్స్‌లో వరుసగా ముగ్గురు చైనా పాడ్లర్లు యాంగ్ హుయిజ్, లియు, జు లను ఓడించింది. ఇక అంకుర్ తనీషా జోడీ కాంస్య పతకం గెలుచుకుంది. కాగా అంతకు ముందు జరిగిన అండర్19 విభాగంలో భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ అంకుర్ భట్టాచార్జీ మరియు తనీషా కోటేచా కాంస్య పతకం సాధించారు. భట్టాచార్జీ మరియు కోటేచా తమ సెమీఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన కిమ్ గావ్ మరియు పార్క్ గా యోన్ చేతిలో 23 తేడాతో ఓడిపోయి మూడవ స్థానంలో నిలిచింది.



## ఉమెన్స్ ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో

# భారత్ విజయం

**న్యూఢిల్లీ:** ఎఫ్‌సి మహిళల ఆసియా కప్-2026 క్వాలిఫయర్స్‌లో ఇరాక్‌ను ఓడించిన భారత్ ఫుట్‌బాల్ జట్టు గ్రూప్ బిలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. థాయిలాండ్‌లోని చియాంగ్ మాయిలో బుధవారం జరిగిన 2025 ఎఎఫ్‌సి ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు తమ మూడవ మ్యాచ్‌లో ఇరాక్‌తో తలపడింది. ఈ క్వాలిఫయర్స్‌లో ఇరాక్‌పై 5-0 తేడాతో ఘన విజయం సాధించి భారత్ సంచలన విజయాన్ని సాధించింది. సంగీత బస్ఫోర్, మనీషా కళ్యాణ్, కార్తీక అంగముత్తు, నిర్మలా దేవి మరియు రతన్‌బాలా దేవి గోల్స్ బ్లూ టైగ్రెస్‌లను మూడు మ్యాచ్‌లలో తొమ్మిది పాయింట్లకు తీసుకువెళ్లాయి. ఇరాకీ ఆటగాళ్లను దాటుకుని డ్రిబుల్ చేస్తూ సంజు చివరికి మనీషా వైపు వైపునకు పంపడంతో ఆమె మొదటిసారి షాట్ తీసుకుంది. భారత్ దీంతో 1-0 ఆధిక్యంలోకి వచ్చింది. మొదట నిర్మల, ఆ తర్వాత మనీషా ఇద్దరూ తమ షాట్లను లక్ష్యంపైకి మళ్లించడంలో ఇరాకీ ప్లేయర్లు అడ్డుకోవడంతో విఫలమయ్యారు, ఆశాజనకమైన అవకాశాన్ని గోల్‌కిక్‌గా మార్చుకోవడంతో భారత్ 2-0తో స్కోరు రెట్టింపు అయింది. కార్తీక అంగముత్తు మిడ్‌ఫీల్డ్‌లో ఫ్రీ బాల్‌ను కొట్టి జట్టు వైపు అద్భుతమైన షాట్ కొట్టాడు, అది గోల్ కీపర్‌ను చిప్ చేసి గోల్‌గా మార్చింది, భారతదేశం ఆధిక్యాన్ని 3-0కి పెంచింది. ఈ విధంగా భారత్ స్కోరు పెరుగుతూ 5-0కు చేరింది. కాగా 42 సంవత్సరాల తర్వాత పోటీలో వరుసగా రెండు విజయాలు నమోదు చేయడం ద్వారా భారతదేశం ఈ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. దీంతో భారత్ 9 పాయింట్లతో లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది, థాయిలాండ్ తర్వాతి స్థానంలో ఉండగా, ఈ నెల 5న జరిగే వారి చివరి మ్యాచ్‌డేలో కూడా అదే స్థానాన్ని కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోపక్క క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఓటమి తరువాత, ఈ గ్రూప్‌లో పోటీ నుండి ఇప్పటికే నిష్క్రమించిన జట్లు మంగోలియా మరియు తైమూర్ లెస్టే జాబితాలో ఇరాక్‌కూడా చేరింది. గ్రూప్‌విజేతను నిర్ణయించేచివరి క్వాలిఫయర్‌లో భారత్ తన చివరి క్వాలిఫయర్‌లో థాయిలాండ్‌తో తలపడుతుంది.

# కెప్టెన్సీకి గుడ్‌బై

## బ్యాటర్లుగానే బరిలోకి.. ముగ్గురు టీమిండియా ప్లేయర్ల యు టర్న్



**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రపంచం దృష్టి ఇప్పుడు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 వైపు మళ్లింది. ఇందులోభాంగా వచ్చే ఐపీఎల్ సీజన్‌పై ఫ్రాంచైజీలు దృష్టిసారిచాయి. కెప్టెన్సీ అనేది ఐపీఎల్‌లో ఒక పెద్ద బాధ్యత. జట్టును ముందుండి నడిపించడంతో పాటు, స్వంత ఆటతీరుపై కూడా దృష్టి పెట్టాలి. కొన్నిసార్లు, కెప్టెన్సీ ఒత్తిడి ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శనపై ప్రభావం చూపవచ్చు. ఈ నేపథ్యంలో, 2026 సీజన్‌లో కెప్టెన్సీని వదిలేసి, తమ బ్యాటింగ్‌పై పూర్తి దృష్టి పెట్టాలని కొందరు భావిస్తున్నారు. అటువంటి వారిలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ పేరు ఈ జాబితాలో ప్రముఖంగా వినిపిస్తోంది. గత కొన్ని సీజన్లలో సంజూ రాజస్థాన్‌ను నడిపించినప్పటికీ, జట్టు స్థిరమైన ప్రదర్శన కనబరచలేకపోయింది. ఐపీఎల్ 2025లో కూడా రాజస్థాన్ నిరాశపరిచింది. కేవలం 4 విజయాలతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. సంజూ వ్యక్తిగతంగా అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడినప్పటికీ, కెప్టెన్‌గా అతను పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అయితే చెన్నై సూపర్ కింగ్స్ సంజూను తమ జట్టులోకి తీసుకోవడానికి ఆసక్తి చూపుతోంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా కొనసాగే అవకాశం ఉన్నందున, సంజూ కేవలం ప్యూర్ బ్యాటర్‌గా లేదా వికెట్ కీపర్‌బ్యాటర్‌గా ఆడటానికి సిద్ధం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక ఐపీఎల్ 2024 విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ 2025 సీజన్‌లో శ్రేయాస్ అయ్యర్‌ను అనూహ్యంగా విడుదల చేసి, అజింక్యా రహానేకు కెప్టెన్సీ కట్టబెట్టింది. రహానే గొప్ప బ్యాట్స్‌మెన్ అయినప్పటికీ, కెప్టెన్‌గా జట్టును ప్లేఆఫ్‌లకు తీసుకెళ్లడంలో విఫలమయ్యాడు. జట్టు 14 మ్యాచ్‌ల్లో 5 గెలిచి, 7 ఓడి, 2 మ్యాచ్‌లు రద్దు కావడంతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. రహానే కెప్టెన్సీ రికార్డు నిరాశపరచడంతో, ఐపీఎల్ 2026 సీజన్‌కు కొత్త కెప్టెన్‌ను వెతుకుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రహానే తన 37 ఏళ్ల వయసులో, కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా, కేవలం బ్యాట్స్‌మెన్‌గా ఏ జట్టులోనైనా ఆడటానికి సిద్ధం అవుతున్నాడు. అలాగే ఐపీఎల్ హిస్టరీలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా (రూ.27 కోట్లు) రిషబ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసి కెప్టెన్ బాధ్యతలు అప్పగించింది. అయితే, ఐపీఎల్ 2025 సీజన్‌లో పంత్ కెప్టెన్‌గా, బ్యాట్స్‌మెన్‌గా నిరాశపరిచాడు. అతను 12 మ్యాచ్‌ల్లో కేవలం 135 పరుగులు మాత్రమే చేశాడు. స్ట్రైక్ రేట్ కూడా 100 లోపే ఉండటం గమనార్హం. చివరి మ్యాచ్‌లో బెంగుళూరుపై సెంచరీ చేసినప్పటికీ, అది అతని గత ప్రదర్శనలను కప్పిపుచ్చలేకపోయింది. దీంతె లక్నో మేనేజ్‌మెంట్ పంత్‌ను విడుదల చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు ఉన్నాయి. ఒకవేళ అదే జరిగితే, పంత్ తన బ్యాటింగ్‌పై పూర్తి దృష్టి పెట్టడానికి, కెప్టెన్సీ భారం లేకుండా మరో జట్టులో ప్యూర్ బ్యాటర్‌గా ఆడటానికి సుముఖంగా ఉన్నాడు.

# వాణిజ్యం

# ఎస్‌బిఐకి రూ.66 లక్షల కోట్ల కేపిటల్!

**ముంబై, జూలై 1:** దేశంలోనే దిగ్గజ బ్యాంకింగ్‌వ్యవస్థగా నడుస్తున్న భారతీయ స్టేట్ బ్యాంకు ప్రస్తుత మూలధనం ప్రపంచంలోని 175 దేశాల జీడిపి కంటే ఎక్కువ నమోదు చేసింది. ఏడు దశాబ్దాల చరిత్రకలిగిన ఎస్‌బిఐ వ్యవస్థాపక దినం సందర్భంగా 66 లక్షల కోట్ల రూపాయల మూలధన వృద్ధితో ఉంది. 1955 జూన్ 30వ తేదీతో పోలిస్తే ఇపుడు డిపాజిట్లు 53,82,190 కోట్లుగా ఉన్నాయి. 25,500 రెట్లు వృద్ధి నమోదుచేసింది. 1955లో కేవలం 116.24 కోట్లు మాత్రమే ఉన్న అడ్వాన్సులు నేడు 35,800 రెట్లుపెరిగి 41,63,312 కోట్లకు పెరిగాయి. దేశ జీడిపితో పోలిస్తే 1955లో కేవలం 10,977 కోట్లు మాత్రమే ఉంది. ఇపుడు మూడువేల రెట్లు పెరిగి 3,30,68,145 కోట్లకు చేరింది. అంటే 330 లక్షల కోట్లకు పెరిగింది. ప్రపంచ జీడిపి పరంగాచూస్తే ఎస్‌బిఐ గ్లోబల్‌జీడిపిలో 1.1శాతం వాటాతో ఉంది. భారత జీడిపిలో 16శాతం వాటాతో ఉంది. ఇక గ్లోబల్‌స్థాయిలో భారత్6.7శాతం జీడిపి వాటాతో ఉంది. ఎస్‌బి ఒక్కటే 1.1 శాతం లేదా 44 బిలియన్ డాలర్ల వాటాతో ఉంది. 2025లో ఎస్‌బిఐ వృద్ధి గ్లోబల్ జీడిపిలో 1.1 శాతంగా ఉంది. భారత జీడిపిలో 16శాతంగా ఉంది.బ్యాంకు స్థూల విలువ జోడింపులోను, ఆర్థికసేవల రంగంలో 8.7శాతం వాటాతో ఉందని తేల్చింది. బ్యాంకు ఆస్తి అప్పుల పట్టీనిచూస్తే 66 లక్షల కోట్లుగా ఉంది. ప్రపంచ బ్యాంకుల్లో 43వ అతిపెద్ద బ్యాంకుగా ఉంది. కస్టమర్లు 53కోట్లమందికిపైగా ఉన్నారు. చైనా తర్వాత భారత్‌లోనే అతి పెద్ద బ్యాంకుగానిలిచింది. ఎస్‌బిఐ అధీకృత మూలధనం 159 రెట్లు పెరిగి 5.62 కోట్ల నుంచి 892 కోట్లకు చేరింది. రిజర్వులు, మిగులు నిధులు వంటివి 69,300 రెట్లు పెరిగి 6.35 కోట్ల నుంచి 4,40,270 కోట్లకు చేరింది. మొత్తం మూలధన వ్యవస్థను 11.97 కోట్ల నుంచి 4,41,162 కోట్లుగా పెరిగింది. అంటే 36,800 రెట్లు పెరిగింది. బ్యాంకు రాబడులు కూడా 61,600 రెట్లు పెరిగి 8.5 కోట్ల నుంచి 5,24,172 కోట్లకు చేరింది. నికరలాభం కూడా 52వేల రెట్లుపెరిగి రూ.1.36 కోట్ల నుంచి 70,901 కోట్లకు చేరింది.



15కోట్ల జనధన్ యోజన ఖాతాల్లో 14.6కోట్లమంది జాయిన్‌కాగా పిఎం సురక్ష బీమాయోజనకింద 14.6 కోట్లమంది పిజం జీవన్‌జ్యోతి బీమాయోజన 6.7కోట్లు, అటల్ ఫెన్షన్‌యోజన కింద 1.73కోట్ల మంది చేరారు.

# త్వరలో మిడిల్‌క్లాస్ జిఎస్‌టి స్లాబ్!

**న్యూఢిల్లీ, జూలై 2:** ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు అమాంతం పెంచి మధ్యతరగతికి ఊరట కల్పించిన కేంద్రం మరో గుడ్‌న్యూస్ చెప్పేందుకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని చూస్తోంది. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా 12 శాతంలో ఉన్న చాలావరకు వస్తువులను 5 శాతం ట్యాక్స్ శ్లాబ్ పరిధిలోకి తీసుకురావడమోచేయాలని కేంద్రం చూస్తోంది. పేద, మధ్యతరగతి ఎక్కువగా వినియోగించే టూత్‌పేస్టు, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంటగదిలో వినియోగించే పాత్రలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషిన్లు, సైకిళ్లు, రూ.1000 పైబడిన రెడీమేడ్ దుస్తులు, ఫుట్‌వేర్, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గించాలని డిమాండ్ పెరుగుతోంది. ప్రతిపాదిత వస్తువులపై జీఎస్టీ తగ్గిస్తే అవి తక్కువ ధరకే పేద, మధ్యతరగతి వర్గాలకు లభిస్తాయి. కేంద్రం తీసుకోబోయే ఈ నిర్ణయం వల్ల ఖజానాపై రూ.40వేల నుంచి రూ.50వేల కోట్ల వరకు భారం పడుతుందని అంచనా. అయితే, ఆయా ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించడం ద్వారా వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. పన్ను పరిధి పెరగడం



తో పాటు దీర్ఘకాలంలో జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దిగువ, మధ్య తరగతికి ఊరట కల్పించే దిశగా జీఎస్టీ రేట్లు హేతుబద్ధీకరించాలని భావిస్తున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొనడం గమనార్హం. ఈ నిర్ణయాలు తీసుకోవాలంటే జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం సాధించాల్సి ఉంటుంది. ఈ నెలాఖరులో జీఎస్టీ మండలి సమావేశం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రద్దీ వేళల్లో క్యాబ్ రేట్ల మార్పులకు ఓకే


**ముంబై, జూలై 2:** యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్, ఓలా వంటి సంస్థలకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రద్దీ ఉంటే రేట్లు పెంచుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈమేరకు మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం నామమాత్రంగా రద్దీ ఉన్న సమయాల్లో బేస్ ఛార్జీల్లో సగం సర్‌ఛార్జీ కింద పెంచుకునేందుకు వీలు కల్పించింది. అలాగే ఒకవేళ రద్దీ విపరీతంగా ఉంటే 200 శాతం పెంచుకునేందుకు అనుమతిచ్చింది. అంతకుముందు ఈ వెలుసుబాటు 150 శాతంగా ఉండేది. ఇక, మూడు కిలోమీటర్లలోపు ప్రయాణానికి ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదన్న షరతు విధించింది. యాప్‌ద్వారా రైడ్‌ను అంగీకరించిన తర్వాత సరైన కారణం చెప్పకుండా డ్రైవర్‌క్యాన్సిల్ చేస్తే.. ఛార్జీలో 10శాతం పెనాల్టీ (రూ.100 మించకుండా) పడుతుంది. దానిని డ్రైవర్, అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ (ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలు) చెరి సమానంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ, సరైన కారణం చెప్పకుండా ప్రయాణికులు రైడ్ క్యాన్సిల్ చేసినా ఇదే పెనాల్టీ వర్తిస్తుంది. అలాగే కేంద్రం డ్రైవర్ల సంక్షేమంపై ప్రధానంగా దృష్టిసారించింది. ఈ అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లతో అనుబంధంగా ఉన్న ప్రతి డ్రైవర్‌కు కనీసం రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.10లక్షల మేర టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజ్‌ను ఆక్యాబ్ సంస్థలు తప్పని సరిగా అందించాలని పేర్కొంది. అలాగే ఈ వేదికల ద్వారా ప్యాసింజర్ రైడ్స్ కోసం ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి అనుమతించింది. ఇటీవల కర్ణాటక వ్యాప్తంగా బైక్ ట్యాక్సీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటే కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతం లో ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 15 వరకు గడువు ఇచ్చింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయగా.. డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. దాంతో వాటి సేవలు నిలిచిపోయాయి. బైక్ ట్యాక్సీలపై నిషేధం వల్ల గిగ్‌వర్కర్ల జీవితాలు రోడ్డునపడతాయంటూ తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఆటోలు, బైక్ ట్యాక్సీలు, సహా ఇతర వాహనాలకు బేస్ ఛార్జీలను నిర్ణయించే అధికారాన్ని కేంద్రం రాష్ట్రాలకు అందించింది. ఒకవేళ రాష్ట్రాలు బేస్ ఛార్జీలను అధికారికంగా నోటిఫై చేయకపోతే.. ఆ ధరలను ప్రకటించే బాధ్యత అగ్రిగేటర్లదేనని వెల్లడించింది. అలాగే ఆ వివరాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాలని చెప్పింది. ఇక డ్రైవర్ పికప్‌పాయింట్‌కు చేరుకోవడానికి ప్రయాణించే దూరం అంటే డెడ్ మైలేజ్‌కు ఛార్జీ విధించకూడదని మార్గదర్శకాల్లో పేర్కొంది.





# ఇన్వెస్టర్ల అలర్ట్‌తో నష్టాల్లోనే స్టాక్ సూచీలు

**ముంబై, జూలై 2:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా విధించిన టారిఫ్ డెడ్‌లైన్ జులై 9 సమీపిస్తున్న వేళ ఇన్వెస్టర్లుఅప్రమత్తత పాటించారు. దీంతో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు ఒత్తిడి సూచీలపై కనిపించింది. దీంతో సూచీలు ఆరంభ లాభాలను కోల్పోగా.. నిఫ్టీ 25,500 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,790.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,697.29) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,935.01 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకుంది. చివరికి 287 పాయింట్ల నష్టంతో 83,409.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.40పాయింట్ల నష్టంతో 25,453.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.68గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీ ఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటి జాబితాలో ఉన్నాయి. టాటాస్టీల్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.70 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3352 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# 13శాతం ప్రీమియంతో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ లిస్టింగ్

**ముంబై, జులై 2:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ బుధవారం స్టాక్ మార్కెట్లలోకి ఎంట్రీ ఇచ్చింది. దాదాపు 13శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యింది. ఇష్యూ ధర రూ.740తో పోలిస్తే ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేరు 12.84శాతం లాభంతో రూ.835 వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది. బీఎస్ఈలోనూ ఇదే ప్రీమియంతో నమోదయ్యింది. అనంతరం ఈ షేర్లు ఫ్లాట్‌గా కొనసాగుతున్నాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రూ.12,500 కోట్ల మెగా ఐపీఓకు విశేష స్పందన లభించిన సంగతి తెలిసిందే. ఐపీఓలో భాగంగా 13 కోట్ల షేర్లు (13,04,42,855) విక్రయానికి ఉంచగా.. 217 కోట్ల షేర్లకు (2,17,67,62,140) బిడ్లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్ల కోటా అత్యధికంగా 55.47 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ కాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కేటగిరీలో 9.99 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.41 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఈ ఏడాదిలో ఇంతపెద్ద ఐపీఓ ఓవర్ సబ్‌స్క్రైబ్ అవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.41 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఈ ఏడాదిలో ఇంతపెద్ద ఐపీఓ ఓవర్ సబ్‌స్క్రైబ్ అవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.3,369 కోట్లను హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సమీకరించింది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.36శాతం వాటా ఉంది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులతో కంపెనీ తమ టైర్1 కేపిటల్ బేస్‌ను బలోపేతం చేసుకోనుంది. భవిష్యత్ వ్యాపారవృద్ధికి కొంత మొత్తాన్నివినియోగించనుంది.





# జూన్‌లో ఆటోమొబైల్ రివర్స్‌గేర్!

**ముంబై,జులై 2:** ప్యాసింజర్ వాహనాల విక్రయాలు జూన్‌నెలలో మార్కెట్ డిమాండ్‌లేక పడిపోయాయి. చిన్నకార్లపరంగానే బయ్యర్లు తగ్గారు. మారుతిసుజుకి ఏటికేడాది చొప్పున చూస్తే 13శాతం తగ్గింది. జూన్‌లో 118,906 యూనిట్లు విక్రయించింది. అంతకుముందు ఏడాదిఇదేనెలలో 137,160 యూనిట్లు విక్రయించిన కంపెనీ ఈసారి తగ్గినట్లు వెల్లడించింది. హుండయి మోటార్ ఇండియా, టాటామోటార్స్ కూడా భారీ క్షీణత నమోదుచేసాయి. హుండై మోటార్స్ 12శాతం క్షీణించి 44,024 యూనిట్లు విక్రయిస్తే ఏడాది క్రితం ఇదేనెలలో 50,103యూనిట్లు విక్రయించింది. దేశీయ మార్కెట్లలో మార్కెట్ సెంటిమెంట్ బలహీన పడిందని కంపెనీ ప్రతినిధులు చెపుతున్నారు. ఇక టాటా మోటార్స్ చూస్తే 15శాతం క్షీణించాయి. 37,083 వాహనాలు మాత్రమే విక్రయించింది. మూడేళ్ల నుంచి అమ్మకాలు చూస్తే జూన్ నెలలో అతితక్కువ విక్రయాలు జరిగాయి. ఇక మహీంద్ర అండ్ మహీంద్ర పరంగాను, టయోటా కిర్లోస్కర్‌మోటార్స్ మాత్రమేకొంతమేర పెరిగాయి. యుటిలిటి వాహనాల విక్రయాల్లో మహీంద్ర 47,306 యూనిట్లు విక్రయించింది. ఇక టయోటా కిర్లోస్కర్ మోటార్స్ అమ్మకాలు ఐదుశాతంపెరిగి 28,869 యూనిట్లకు పెరిగాయి. వాటిలో 6453 యూనిట్లు దేశీయ మార్కెట్ లోను, 2416 యూనిట్లు ఎగుమతి అయినట్లు కంపెనీ ప్రకటించింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.